# పెళ్లి సంతకం

## THE MARRIAGE CONTRACT

ARCHANA REDDY MANDA

BlueRose ONE.com
Stories Matter
NewDelhi • London

**BLUEROSE PUBLISHERS**
India | U.K.

Copyright © Archana Reddy Manda 2026

All rights reserved by author. No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means, electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior permission of the author. Although every precaution has been taken to verify the accuracy of the information contained herein, the publisher assumes no responsibility for any errors or omissions. No liability is assumed for damages that may result from the use of information contained within.

BlueRose Publishers takes no responsibility for any damages, losses, or liabilities that may arise from the use or misuse of the information, products, or services provided in this publication.

BlueRose ONE.com
Stories Matter
NewDelhi • London

For permissions requests or inquiries regarding this publication, please contact:

BLUEROSE PUBLISHERS
www.BlueRoseONE.com
info@bluerosepublishers.com
+91 8882 898 898
+4407342408967

ISBN: 978-93-7825-089-7

Cover design: Aafiya Saifi
Typesetting: Namrata Saini

First Edition: July 2026

బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్.. ముందు ఆగిన క్యాబ్ లో నుండి దిగిన ఆ ఇరవై ఐదేళ్ళ అమ్మాయి చేతిలో క్యారేజీతో లోపలికి నడిచింది వడివడిగా ..

ముద్దబంతిలా ముగ్ధ మనోహరమైన రూపం, ముట్టుకుంటే కందిపోయే సుకుమారత్వం, నడుస్తుంటే పిరుదులపై సయ్యాటలాడే పొడవాటి జడ.. పదహారణాల తెలుగు ఆడపిల్లకు ప్రతిరూపంలా ఉంది..ఆమె.

నేరుగా నడుచుకుంటూ తనకు కావలసిన రూం కి వెళ్ళేసరికి, బెడ్ పై పేషెంట్లా పడుకున్న తన తండ్రి పక్కనే కూర్చుని ఉన్న తన తల్లితో మాట్లాడుతున్నాడు.

"నేను బ్రతికుండీ మీ ఇద్దరికీ భారం అవడం తప్ప ఏం ఉపయోగం నా వల్ల. నా భుజాలపై ఎక్కించుకుని తిరిగిన నా కూతురిభుజాలపై నా బాధ్యత పెట్టి బాధ పెడుతున్నా.." అంటూ ఏడుస్తున్నాడు.

"నాన్నా. అలా అనొద్దని మీకెన్ని సార్లు చెప్పాను?" అంటూ లోపలికెళ్ళింది ఆ అమ్మాయి.

"మీరు బరువో, బాధ్యతో కాదు. బంధం... నాకు, అమ్మకు ఉన్న ఏకైక అమూల్యమైన బంధం. దాన్ని రక్షించుకోవడం కోసం మా ప్రాణాలైనా అడ్డేస్తాం.." అంది ఆయన చేతులు పట్టుకుని.

"మీరేం చేసినా నేను బతకను బంగారం. ఈ క్యాన్సర్ మహమ్మారిచివరికి నా ప్రాణాలు తీసుకుపోతుంది. అయితే దీన్ని ఆహ్వానించింది కూడా నేనే కదా.. మీరు ఎంత చెప్పినా వినకుండా విపరీతమైన సిగరెట్లు తాగి నా ఆరోగ్యం నేనే పాడు చేసుకున్నాను. ఇప్పుడు నా వల్ల మీరు శిక్ష అనుభవిస్తున్నారు."

"వద్దమ్మా అనవసరంగా డబ్బు తగలెయ్యద్దు నామీద లక్షలకు లక్షలు.. పదా నన్ను ఇంటికి తీసుకెళ్ళు.. ఎలాగూ పోయే ప్రాణం కోసం మీరిద్దరూ అప్పుల పాలు కాకండి.." లాలనగా చెప్పాడు అతను.

"ఇంకోసారి ఇలా మాట్లాడితే నేను చచ్చినంత ఒట్టే..

ఈ ఇరవై ఐదేళ్ళు మీరు నాకు పంచిన ప్రేమకి నా ప్రాణం ఇచ్చినా తక్కువే నాన్న.. నువ్వు లేకపోతే నేను ఉండలేను. నీకేమైనా అయితే మరుక్షణమే నా ప్రాణం వదిలేస్తా.."అంది ఏడుస్తూ.

ఛా.. ఏంమాటలవీ? పిచ్చిపిల్లా నువ్వు ధైర్యంగా ఉండాలి. నాకేమైనా సరే అమ్మను బాగా చూసుకో. నా పెంపకాన్ని అవమానించకు ఇంకోసారి ఇలా పిరికి దానిలా మాట్లాడి. కూతురైనా, కొడుకైనా నువ్వే కదా నాకు.. అంటుండగా,

వెనక నుండి గట్టిగా చప్పట్లు వినిపించాయి.

"బాగుంది..చాలా బాగుంది.. అన్నీ తనే మీకు.. వాళ్ళకు అన్నీ మీరే.. నేనెవరిని మరి?ఒంటరి అనాథని.. అమ్మ లేక, నాన్న ఉన్నా అనాథని నేను.." అన్నాడు మాధవ్.

"లేదురా మాధవ్. మేము అలా ఎప్పుడూ అనుకోలేదు. కానీ నువ్వు మేము లేమనే అనుకుంటున్నావు.." అన్నాడు వాళ్ళ నాన్న దగ్గుతూ..

"అలా అనుకునే వాడినే అయితే ఇప్పుడు ఇలా వచ్చేవాడినే కాదు కదా. వచ్చి తప్పు చేసాను అసలు.. రాకుండా ఉండాల్సింది. అమ్మ చనిపోయిందని ఈమెని చేసుకున్నావు. ఆస్తి కోసం వయసులో తేడా ఉన్నా కూడా చేసుకుంది. చివరికి ఆ ఆస్తి అంతా కరిగించేసారు తల్లీ, కూతుర్లిద్దరూ కలిసి.." అన్నాడు మాధవ్ వాళ్ళ వైపు కోపంగా చూస్తూ.

"ఒరేయ్ మాధవా.. అలా అనకు రా వాళ్ళని. మనకు పాపం తగులుతుంది. తాగి, తిరిగి సగం ఆస్తి నేను తగలెడితే, నీ చదువుల కోసం పంపిన మిగతా సగం నాలాగే తాగి, తిరిగి, నువ్వు తగలెట్టావు. మధ్యలో వాళ్ళని అంటావేంట్రా." అన్నాడు ఆయాస పడుతూ.

"నాన్నా.. మీరు ఆవేశపడకండి. రెస్ట్ తీసుకోండి." అంటూ పడుకోబెట్టింది మధు.

మౌనంగా కన్నీళ్ళు కారుస్తూ నిలబడింది వాళ్ళ అమ్మ.

"ఎంతైనామీరు మీరు ఒకటి. మధ్యలో నేనే వేరు కదా.. సరే ఉండండి మీరే.." అంటూ విసురుగా అక్కడి నుండి వెళ్ళిపోయాడు మాధవ్.

"మధూ నీకు లేటవుతుంది ఆఫీస్ కి. ఈమధ్యనే కొత్తగా జాయిన్ అయ్యావు అసలే, వెళ్ళు వెళ్ళు.." అంది వాళ్ళ అమ్మ.

"నాన్నా.. మీరు డబ్బు గురించి అసలు ఆలోచించకండి. నేను మా మేనేజర్ తో మాట్లాడాను. ఆపరేషన్కి కావలసిన డబ్బు ఇప్పిస్తారు. మీకేం కాదు. నేనున్నాను." అంది ఆయన చేతిలో చేయి వేసి.

"నాకు ఉన్నారు మీరిద్దరూ.ఇందాక వాగి వెళ్ళిన వాడికీ ఉంది ఒక గయ్యాళి పెళ్ళాం.. కానీ, నీకే ఎవరూ లేరు తల్లి. నీ బాధని పంచుకునేందుకు, నీ కష్టం తెలుసుకునేందుకు. నీ కన్నీళ్ళు తుడిచేందుకు.. నీకు ఒక మంచి అబ్బాయిని చూసి పెళ్ళి చేసాక నాకేమైనా ఇక బాధ లేదు రా.." అన్నాడు బాధగా.

"నాకు మీరు ఉంటే చాలు.. ఇంకెవరూ అవసరం లేదు..అంటూ నవ్వి, అన్నయ్యని మీరు అలా అని ఉండకుండదు నాన్నా..." అంది మెల్లగా.

"హా.. అన్నయ్య.అలా నువ్వు పిలవడమే కానీ వాడు ఒక్కసారన్నా చెల్లి అన్నాడా? ఎందుకమ్మా ద్వేషించే వాళ్ళ పై కూడా ప్రేమ కురిపిస్తావు." అన్నాడు.

"ఆ ప్రేమతో వాళ్ళు కూడా తిరిగి ప్రేమించడం మొదలెడతారేమోనని నాన్నా" అంటూ నవ్వివెళ్ళిపోయింది మధు ఆఫీసు కి.

*****

"ఏంటో శాస్త్రి.. బామ్మ, ఇంకా అమ్మావాళ్ళు రోజు నస పెడుతున్నారు పెళ్ళి పెళ్ళి అని.. ఎన్ని సార్లు చెప్పినా అర్థం చేసుకోవట్లేదు" అన్నాడు ఒక ప్రఖ్యాత సాఫ్ట్వేర్ కంపెనీ యొక్క CEO ముప్పయైదేళ్ళ విక్రమ్..

"వాళ్ళు చెప్పేది కూడా కరెక్టే కదా సర్, భార్య చని పోయాక ఎంతమంది రెండో పెళ్ళి చేసుకోవట్లేదు.? చనిపోయేదాకా ఎక్కడ, భార్య బతికి ఉండగానే చేసుకుంటున్నారు పెళ్ళిళ్ళ మీద పెళ్ళిళ్ళు.. పైగా మీ వయసు కూడా చిన్నదే.."అన్నాడు అతని దగ్గర ఏడేళ్ళు గా పి.ఎ గా పని చేస్తున్న శాస్త్రి.

"శాస్త్రీ... నువ్వు కూడా వాళ్ళలా మాట్లాడతావేంటయ్యా? నా దృష్టిలో అమ్మ, నాన్న లాగా భార్య కూడా ఒక్కరే ఉంటారు ఒక జన్మకి. ఒక భార్య పోయిందని ఇంకో భార్యని చేసుకోవడం ఏంటి? నా మనసులో, జీవితంలో భార్య అనే స్థానం ఎప్పటికీ నా ప్రియదే.." అన్నాడు బాధగా.

"అది కాదు సర్ పాపం చిన్నపిల్లలు. మీకు కాకున్నా వాళ్ళకు తల్లి అవసరం చాలా ఉంది కదా.." నసిగాడు పి.ఎ శాస్త్రి.

" ఎందుకయ్యా అందరూ ఇదే సెంటిమెంట్ తో చంపుతున్నారు. తల్లి అవసరం ఉంటుంది. కానీ వారి తల్లి చనిపోయింది. ఇపుడు వేరే ఆమెని

నేను పెళ్ళి చేసుకున్నంత మాత్రాన ఆ పిల్లలకు తల్లి ఎలా అవుతుంది. చెప్పు?" అన్నాడు విసుగ్గా.

"కాని ఎలా సర్? మీ బామ్మ గారు మీ పెళ్ళి అయ్యేదాకా నిరాహార దీక్ష చేస్తోందన్నారు కదా.."

"అదే కదా నా ఏడుపు. ఈ ముసల్ది చస్తుందో లేదో కానీ నన్ను చంపుతోంది.. పైగా ఆమె గారి కొడుకు,కోడలు అక్కడ యూ.యస్ నుండే ఫోన్లో బెదిరింపులు మొదలుపెట్టారు. ఇంకో వారంలో పెళ్ళి చేసుకోవాలంట.. లేదంటే ఈ కంపెనీకి వేరే సి.ఇ.ఓ ని చూసుకుంటారంట.. అసలేంటయ్యా వీళ్ళు? ఏమనుకుంటున్నారు నా గురించి?"

"ఎంతో కష్టపడి ఈ స్థాయికి తీసుకువచ్చిన కంపెనీకి, చివరికి ఇలా మిమ్మల్ని దూరం చేయడం అన్యాయం సర్.."

"అందుకే ఒక నిర్ణయానికి వచ్చాను శాస్త్రి..."

"చెప్పండి సార్.. ఏం నిర్ణయం? పెళ్ళి చేసుకుంటారా? అమ్మాయిని చూడమంటారా?" అన్నాడు శాస్త్రి ఉత్సాహంగా.

"ఆ.. చూడు.. చేసుకుంటా.. కానీ పర్మనెంట్ కాదు కాంట్రాక్టు.." అన్నాడు విక్రమ్.

"ఇదేమైనా జాబా సర్ కాంట్రాక్టు, రెగ్యులర్ అనీ.." అంటూ తలపట్టుకున్నాడు శాస్త్రి.

"నావరకు అలాంటిదే శాస్త్రి.. నాకు ఇష్టం లేకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో నేను పెళ్లి చేసుకోక తప్పట్లేదు.. కానీ అది ఒక అగ్రిమెంట్ ద్వారా 1 లేదా 2 సంవత్సరాలకే పరిమితం చేస్తే.. తర్వాత ఎవరి దారి వాళ్ళు చూసుకునేలా కాంట్రాక్ట్ పెళ్లి చేసుకుందాం అనుకుంటున్నా.."

"కానీ సర్ ఇది చాలా డేంజర్.. ఈ మధ్య వార్తల్లో చూసాను.. ఒక అతను ఇలాగే కొన్ని అవసరాల వల్ల కాంట్రాక్ట్ మ్యారేజ్ చేసుకుంటే.. ఆ అమ్మాయి స్లో పాయిజన్ ఇచ్చి అతని ఫ్యామిలీ మొత్తాన్ని చంపి ఆ ఆస్తి కి వారసురాలు అయిందంట.. అలా ఉంటున్నారు సర్ ఇప్పుడు మనుషులు.. డబ్బు ఎంత పని ఐనా చేస్తుంది.."

"అవును శాస్త్రి కానీ తప్పదు.. ఈ రెండేళ్లు నేను నా పిల్లలు జాగ్రత్త గా ఉంటే చాలు.. తర్వాత మేము ఫ్రీ.. తనకి నాకు పడట్లేదని విడాకులు తీసుకుంటా.. ఇంకా మళ్ళీ పెళ్లి గిళ్ళి అని అనే అవకాశం కూడా మా వాళ్ళకి ఇవ్వను." అన్నాడుకాన్ఫిడెంట్ గా విక్రమ్.

"ఎక్స్క్యూజ్ మీ సర్.."అన్న మధురమైన కంఠం వినపడగానే, మాట్లాడటం ఆపి "యస్. కమిన్" అన్నాడువిక్రమ్..

"సర్. అర్జంట్ మీటింగ్ ఉంది ఇంకొక

అరగంటలో.."గుర్తు చేసింది సెక్రెటరీ...

ఓ అంటూ "సరే శాస్త్రి.. బాగా ఆలోచించునేను చెప్పిన దాని గురించి సాయంత్రం లోగా.." అంటూ బయలు దేరాడు విక్రమ్.

అప్పుడే ఒక ఆలోచన మెదిలింది శాస్త్రి మదిలో.

"సర్ దొరికింది అమ్మాయి.. మీ మీటింగ్ అయిపోయాక ఫోన్ చేసి చెప్తా మొత్తం వివరాలు.." అన్నాడు శాస్త్రి నవ్వుతూ..

“సార్.. మీటింగ్ అయిందా?”ఫోన్ చేసి అడిగాడు శాస్త్రి.

“ఆ అయింది చెప్పు. ఎవరా అమ్మాయి?” అడిగాడు విక్రమ్.

“సెక్రటరీ ఉందా మీ పక్కన?”

“ఆ..ఉంది. ఎందుకు?”

“తనకి కాస్త దూరం వచ్చి మాట్లాడండి. అయితే..”

“ఏంటి శాస్త్రి ఇదేమైనా పెద్ద టాప్ సీక్రెటా? వచ్చానులే చెప్పు..” అన్నాడు విక్రమ్ విసుగ్గా.

“ఆ అమ్మాయే సర్ నేను చెప్పిన అమ్మాయి. ”

“ఏంటి సెక్రెటరీనా? నీకేమైనా పిచ్చా శాస్త్రి... ఎలాగూ చూడమన్నాను కదా. అని ఎవరు కనిపిస్తే వాళ్ళ పేరు చెప్పేస్తావా? బాస్ కదా అని అడగ్గానే ఏమైనా చేస్తుందనుకున్నావా? అసలేంటి శాస్త్రి నీ ఉద్దేశ్యం ?” అంటూ కయ్యిమన్నాడు విక్రమ్.

“ఛా అలా కాదు సర్, ఇప్పటికిప్పుడు. కాంట్రాక్ట్ పెళ్ళి చేసుకునే అమ్మాయి ఎవరైనా దొరుకుతారా మనకు చెప్పండి... కానీ ఆ అమ్మాయి ఒప్పుకుంటుంది. సర్. ఎందుకో తెలుసా ఆ అమ్మాయికి ప్రస్తుతం డబ్బు అత్యవసరం కనుక. చదువుల్లో నంబర్ వన్. ఆమె తెలివికి తలుచుకుంటే ఇంతకన్నా మంచి ఉద్యోగాలు దొరుకుతాయి. కాని ఆమె దగ్గర అంత సమయం లేదు. అందుకే మన దగ్గర జాయిన్ అయింది హడావిడిగా..

అంతే కాదు జాయిన్ అయిన రోజే నన్ను వచ్చి ఏమడిగిందో తెలుసా? సర్ మా నాన్నకి క్యాన్సర్. ట్రీట్ మెంట్ కి చాలా డబ్బులు అవసరం. మీరు 20 లక్షలు ఇవ్వగలరా కంపెనీ నుండి ముందుగా . నేను ఆ డబ్బు మీకు వడ్డీతో సహా తీర్చేదాకా మీ కంపెనీలోనే పని చేస్తానని బాండ్ రాసిస్తాను అంది. అంత అవసరం తనకుంది. కాబట్టి ఈ పెళ్ళి ప్రపోజల్ తనకి చెప్తామనుకుంటున్నా సేసే. తను తప్పకుండా ఒప్పుకుంటుంది..”

“కానీ మరీ సెక్రటరీని ఇలా పెళ్ళిచేసుకోవడం”అంటూ నసిగాడు.

“ఎవరైతే ఏంటి సర్ మీకు కావలసింది కాంట్రాక్ట్ కదా. పైగా తనైతేనే సేఫ్. విషయం మన మధ్యే ఉంటుంది. ఇంకా తన సర్టిఫికెట్స్ అన్నీ మన ఆఫీసులోనే ఉన్నాయి. ఈ కాంట్రాక్ట్ పూర్తికాగానే ఎంచక్కా తను మన ఆఫీసులోనే పని చేసుకోవచ్చు ఎప్పటిలాగా. ఎవరికీ ఏ సమస్య ఉండదు. ఏమంటారు?” అన్నాడు శాస్త్రి ఉత్సాహంగా..

“సరే శాస్త్రి. ఇప్పటివరకు కొంత సందిగ్ధంలో ఉన్నా ఇవుడు పూర్తి క్లారిటీ వచ్చింది. తనే కరెక్ట్, ముక్కు మొహం తెలియని వాళ్ళకన్నా మన వాళ్ళే నయం కదా..” అంటూ తృప్తిగా నవ్వి,

“ఇంతకీ తన పేరేంటి శాస్త్రి? “అన్నాడు విక్రమ్ ఉత్సాహంగా...

“మీకు పేరు కూడా తెలియదా సర్. ”

“తన పేరుతో నాకేం పని? ”

“సరే సరే.. తన పేరు మధు ప్రియ సర్ .”

**ప్రియా..** ఆ పేరు వినగానే తన ప్రాణప్రదమైన భార్య రూపం కళ్ళముందు మెదిలింది..

ఒక్క క్షణం కళ్ళు మూసుకుని సారి ప్రియా. ఇది తప్పో ఒప్పో నాకు తెలీదు కానీ తప్పడం లేదు.అనుకున్నాడు..

“సర్ వెళ్దామా..” అంటూ వినిపించిన మధు ప్రియ గొంతు విని కళ్ళు తెరిచి ఆమెను చూసాడు.

గ్రీన్ కలర్ చుడీదార్ లో సింపుల్ గా, ఒక మధ్య తరగతి అమ్మాయిని ప్రతిబింబించేలా చూడచక్కగా ఉంది. కాని ఆ మొహం లోనే ఏదో లోటు, వెలితి... కొన్నాళ్ళు గా గూడు కట్టుకున్న బాధ తెలుస్తోంది.. వాళ్ళ నాన్న గురించే అనుకుంటా బహుశా.. పోనీ నేను చేసే ఈ పని మంచిదైనా

చెడ్డదైనా ఒకరి ప్రాణం అయితే నిలుస్తుంది. ఒకరి కష్టం ఐనా తీరుతుంది. నాకు ఆ తృప్తి చాలు అనుకున్నాడు.

ఎప్పుడూ తన మొహం కూడా సరిగా చూడని తమ CEO అంత సేపు తన వైపే కళ్ళార్పకుండా చూడటం గమనించి కాస్త ఇబ్బంది పడింది మధు.

తన ఇబ్బందిని గమనించి, "ఆ వెళ్దాం.." అంటూ వెళ్ళి కార్ లో కూర్చున్నాడు. వచ్చి పక్కనే కూర్చున్న ఆమె దగ్గరనుండి వచ్చే సువాసన కూడా తనకు తెలుస్తోంది.

"ఏంటి ఇదంతా. ఎందుకు తన గురించి ఇంత కాన్సన్ట్రేషన్ అవసరమా నాకు? పెళ్ళి అనే ఆలోచనకే అంత పవరుందా నిజంగానే? ముందే ఇలా ఉంటే మరి రేపు పెళ్ళి అయ్యాక కొంపదీసి తనకు కనెక్ట్ అవుతానా? ఛీ ఛీ నో వే. నా ప్రియ స్థానంలో కి ఎవరూ రారు.. అగ్రిమెంట్ లో అన్ని వివరంగా రాసుకోవాలి. "మనసులోనే గట్టిగా అనుకొని విండో సైడ్ నుండిబయటకు చూస్తూ కూర్చున్నాడు.

"ఈ రోజు మాట్లాడతాను. అన్నారు శాస్త్రి గారు.. బహుశా నేను అడిగిన డబ్బుల గురించే అయి ఉంటుంది. ఆయన ఎన్ని కండీషన్లు పెట్టినా సరే ఒప్పుకోవాలి. నాన్న ప్రాణం కంటే నాకేది ఎక్కువ కాదు." అనుకుంటూ కళ్ళు మూసుకుంది మధు.చాలా అలిసిపోయినట్లుగా...

*****

అది ఒక మూడంతస్థుల పెద్ద భవంతి.లోపలకి అడుగు పెట్టగానే ప్రశాంతతని ఇచ్చే పచ్చదనంతో, రంగు రంగు పూల మొక్కలు, రకరకాల పండ్ల చెట్లతో కళకళలాడుతూ ఉంది.

గేట్ నుండి మెయిన్ డోర్ కే ఒక కిలోమీటర్ దూరం ఉంటుంది.. అత్యాధునిక ఫర్నిచర్ తో రాజ భవనంలా మెరిసిపోయే ఆ ఇంటి అందం చూడటానికి రెండు కళ్ళు సరిపోవు..

మీటింగ్ అయిపోగానే మధుని ఆఫీస్ దగ్గర డ్రాప్ చేసి, ఇంటికి వచ్చేసాడు విక్రమ్.

లోపలికి అడుగు పెట్టగానే, " హే... డాడీ వచ్చేసాడూ..."అంటూ కాళ్ళని చుట్టుకున్నారు ఇద్దరు అల్లరి పిడుగులు.. పదేళ్ళ అద్విత్, మూడేళ్ళ ఆద్య..

ముద్దులొలుకుతూ ఉన్న ఆ చిన్నారులను, చూస్తే చాలు హుషారు వచ్చేస్తుంది ఎవరికైనా. ఆద్యకి జన్మనిస్తూ చనిపోయిన తన భార్య ప్రియ అంటే ఎంత ప్రాణమో, తన ఇద్దరు పిల్లలంటే అంతే ప్రాణం విక్రమ్ కి. అందుకే ఎంత మంది చెప్పినా ఈ మూడేళ్ళ నుండి పెళ్ళి అనే మాటకు అస్సలు తావివ్వలేదు..

కానీ ఇక ఇలా చెప్తే వినేలా లేడని బెదిరింపులు మొదలెట్టారు అతని ఫ్యామిలీ మెంబర్స్ ఒక నెల నుండి.

"డాడీ.. అన్నయ్య నన్ను కొలుతున్నాడు." అంటూ ముద్దు ముద్దుగా కంప్లయింట్ చేసింది ఆద్య.

"హే. నువ్వే కొట్టి నా పేరు చెప్తున్నావు.." అన్నాడు. అమాయకంగా అద్విత్..

"సరే సరే మీ జేజి లేదా ఏం చేస్తుంది?" అడిగాడు.

"ఉంది. పొద్దున్న నుండీ రామ కోటి రాసుకుంటూ కూర్చుంది గదిలో.." అన్నాడు అద్విత్.

"ఏమైనా తిందా?" అడిగాడు మెల్లగా చెవిలో.

“ఊహూ.. ” అంటూ ఇద్దరూ తలూపారు అడ్డంగా..

“సరే.. మీరు వెళ్ళి ఆడుకోండి”అంటూ వాళ్ళ

బామ్మ గదిలోకి వెళ్ళాడు విక్రమ్.

“బామ్మ ఏమైనా తిన్నావా లేదా?” అన్నాడు తదేకంగా పుస్తకం లోకి చూస్తూ రాసుకుంటున్న బామ్మ ని చూసి.

రాసుకునేదల్లా తల పైకెత్తి చూసి, మళ్ళీ తల కిందికి దించి రాయడం కొనసాగించింది.

“ఇలా చేస్తే, నీకేమైనా అయితే నేను

అమ్మా వాళ్ళకి ఏం సమాధానం చెప్పాలి? ఏమనుకుంటున్నారు అసలు మీరంతా కలిసి ?” సీరియస్గా అనడంతో.

రాస్తున్న పుస్తకం మూసేసి,కళ్ళు మూసుకుని నమస్కరించి..మెల్లగా లేచింది అక్కడ నుండి..

“అయితే నేను పస్తులుండి చచ్చినా పర్వాలేదు.. కానీ నా కొడుకు కోడలు ఏమంటారో అనే భయం. అంతేనా?” అంది కళ్ళ నిండా నీళ్ళతో.

చిన్నప్పటినుండి తనని ఎంతో ప్రేమగా పెంచి పెద్ద చేసిన బామ్మ, తన కన్న తల్లిదండ్రుల కంటే ఎంతో దగ్గరైన బామ్మ అలా అనేసరికి చాలా బాధనిపించింది అతనికి.

“రాజ్యం నువ్వలా మాట్లాడకే. గుండెల్లో గుచ్చుకుంటుంది నాకు. సరే నేను రేపే నీకు శుభ వార్త చెప్తాను ఈ విషయంలో.. ఇప్పుడు మాత్రం నువ్వు తినాలి లేదంటే నా మీద ఒట్టే”అన్నాడు విక్రమ్, రాజ్యలక్ష్మి చేయి తన తలపై పెట్టుకుని.

“నిజంగా నువ్వు రేపు పెళ్ళి చేసుకుంటా అని చెప్ప బోతున్నావా విక్కీ?” అన్నారు ఆమె మురిసిపోతూ.

“అవును. తింటావా మరి?” అన్నాడు నవ్వుతూ..

“తప్పకుండా తింటా...” అంటూ నవ్వి విక్రమ్ చేతిలో చేయి వేసి అతని భుజం పై తలవాల్చి డైనింగ్ ఏరియాకి వచ్చింది..

*****

"సర్ నాతో ఏదో మాట్లాడాలని పిలిచారు.. చెప్పండి అంది." మధు ప్రియ శాస్త్రి కి ఎదురుగా కూర్చుని..

" హా.. ప్రియా! మన విక్రమ్ సర్ గురించి మీ ఒపీనియన్ ఏంటి ?"

“నాన్న ఆపరేషన్ కోసం అడిగిన డబ్బుల గురించి మాట్లాడతారని అనుకుంటే, సి ఇ ఓ పై నా ఒపీనియన్ అడుగుతారేంటి

ఈయన?” అని మనసులో అనుకుని,

"సర్ ఒపీనియనా, ఆయనపై నాకు ఒపీనియన్ ఏంటి? మీరేం అడుగుతున్నారో నాకు అర్థం కావట్లేదు.." అంది మొహమాటంగా.

"జస్ట్ క్యాజువల్ గా అడిగాను. నీకు అనిపించిందే చెప్పు." అన్నాడు శాస్త్రి నవ్వుతూ.

"సర్ నేను జాయిన్ అయ్యి నెల రోజులు కూడా కాలేదు. సర్ గురించి నాకేం తెలుసనీ, అయినా మీరు ఏదో చెప్తారనుకుని వస్తే, ఇలా సంబంధం లేకుండా..." అంటుండగా, మధ్యలోనే..

" సంబంధం ఉంది మధూ, ఉంది కాబట్టే అడుగుతున్నా. అయినా సంబంధం లేకుండా మాట్లాడటానికి నాకేమైనా పిచ్చా?" అన్నాడుశాస్త్రి సీరియస్ గా,

అతని గొంతులోని సీరియస్ నెస్ కి భయపడి,

" ఏమైంది సర్. నావల్ల ఏమైనా తప్పు జరిగిందా? ఈ రోజు మీటింగ్ లో గాని ఏమైనా ?"

"ఛా. అదేం లేదు మధు. సరే డైరక్టా పాయింట్కే వస్తాను. నాకు కూడా ఈ డొంకతిరుగుడు నచ్చదు. మన విక్రమ్ సర్ కి పెళ్లయింది... ఇద్దరు పిల్లలు ఉన్నారనే సంగతి నీకు తెలుసా ? " అన్నాడు.

పిచ్చివాడిని చూసినట్లుగా చూసింది మధు. ఇదంతా నాకెందుకు చెప్తున్నాడు అన్నట్లు...

" తెలియదు సర్. అయితే ?" అంది

అయోమయంగా.

"సర్ భార్య చనిపోయింది మూడేళ్ళక్రితం."

"అయ్యో అవునా నో సాడ్.." అంది.

"హ్మ్..సర్ వాళ్ళ ఇంట్లో అప్పటినుండే బాగా బలవంతం చేస్తున్నారు. మళ్ళీ పెళ్ళి చేసుకోమని. కాని, సర్ కి ఇష్టం లేదు. ఆయనకి తన భార్య అంటే ప్రాణం.. కానీ, ఎంత చెప్పినా సర్ వినట్లేదని ఇంట్లో వాళ్ళుబెదిరింపులకు దిగారు.. ఇప్పుడు సర్ కి పెళ్ళి చేసుకోక తప్పట్లేదు.."

"సర్ మీరు ఇదంతా నాకెందుకు చెప్తున్నారు. సంబంధం ఏమైనా చూడాలా ?" అంది విసుగ్గా..

"పూర్తిగా వినడం నేర్చుకో మధు... సర్ తన భార్యని తప్ప ఇంకో అమ్మాయిని భార్యగా ఎప్పటికీ అంగీకరించరు. అందుకే కాంట్రాక్ట్ మ్యారేజ్ చేసుకుందాం అనుకుంటున్నారు."

" వాట్.. అంటే.." అంది అర్థం కానట్లుగా..

"అంటే ఒక ఒప్పందం మీద అయ్యే పెళ్ళి. నకిలీ పెళ్ళి. ఒకటి లేదా రెండు సంవత్సరాల అగ్రిమెంట్.. భార్య భర్తల్లా నటించడం... ఆ తర్వాత ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోవడం.."

"అలా ఎవరు ఒప్పుకుంటారు సర్ . నోవే.."అంది నవ్వుతూ.

"ఊరికే కాదు మధు. బదులుగా 20 లక్షలు ఇస్తారు." అన్నాడు శాస్త్రి, మధు మొహంలోని ఫీలింగ్స్ ని గమనిస్తూ.

ఒక్క సారిగా మధు మొహంలో ఆశ్చర్యం. అంతలోనే ఆవేశం..

"అంటే ఒక ఆడపిల్ల జీవితానికి రేటు కడుతున్నా రా సర్ మీరు?" అంది కోపంగా.

“వామ్మో.. ఈమె ఏంటి ఇపుడే ఇలా రియాక్ట్ అవుతోంది. అది నిన్నే అని అడిగితే. కొట్టినా కొడుతుందేమో..” అనుకుని,

"అబ్బా.. అంతలా ఫీలవ్వాల్సిందేం ఉండదు మధు. ఇప్పుడు ఇవన్నీ కామన్ అయిపోయాయి.. ఎంతమంది జంటలు ఒకరికొకరు అడ్జస్ట్ కాలేక విడిపోవట్లేదు చెప్పు. ఇది ముందే విడిపోతాం అని రాసుకున్న అగ్రిమెంట్ కాబట్టి బాధపడటానికి

కూడా ఏముండదు. పైగా 20 లక్షలు అంటే చిన్న మొత్తం కూడా కాదు కదా" 20 లక్షలు అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ చెప్పాడు శాస్త్రి..

"సరే అవన్నీ నాకెందుకు గానీ, మీరు నాకు చెప్పాలనుకున్నదేంటో చెప్పండి.."

"అదీ మధు.. నీకు కూడా అర్జంట్గా20 లక్షలు కావాలి అన్నావ్ కదా. అందుకే సర్ దీని గురించి చెప్పగానే ముందు నువ్వే గుర్తొచ్చావు. పాపం నాన్న కి సీరియస్ అన్నావు కదా. అందుకే నీకే చెప్తున్నా. ఈ అగ్రిమెంట్ గురించి ఆలోచించు." అన్నాడు మెల్లగా.

''ఏంటి?" అంది గట్టిగా, గబుక్కున లేచి నిలబడి.

“కూల్ మధు.ప్లీజ్..సిట్ డౌన్. అర్థం చేసుకో... అవకాశం ఉందని చెప్పా.. నీకు నచ్చితేనే ఒప్పుకో లేదంటే వదిలెయ్.గొడవలేం వద్దు” అన్నాడు భయంగా..

"సర్ నాకు డబ్బు అప్పుగా ఇవ్వమన్నాను.. నా జీతం అంతా కట్ చేసుకోండి ఎన్నాళ్ళకైనా అగ్రిమెంట్ రాసిస్తాను. కాని ఆయనెవరికో అద్దె భార్యగా కాదు. ఈ ఆఫీసులో సెక్రెటరీగా.." అంది కోపంగా.

"బట్ నువ్వు ఉద్యోగం లో కొత్త. జాయిన్ అయ్యి నెల కూడా కాలేదు. కంపెనీ రూల్స్ ప్రకారం, డబ్బు లోన్ గా ఇవ్వాలంటే కనీసం ఐదేళ్ళ సర్వీస్ అయినా ఉండాలి. పైగా 20 లకలు అనేది కష్టం.. పది లక్షల వరకు మాత్రమే ఇస్తారు. కాబట్టి అది ఇంపాజిబుల్.

ఇక ఇది నీ ఇష్టం. నువ్వు ఒప్పుకుంటే రేపే 20 లక్షలు నీ చేతిలో ఉంటాయి. రెండేళ్ళు నువ్వు ఆయన ఇంట్లో

మహారాణిగా ఉండవచ్చు. ఆ తర్వాత కూడా నువ్వు ఎప్పటిలా ఇక్కడే సెక్రటరీగా పని చేసుకోవచ్చు. నీకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. సర్ చాలా మంచివారు. ఆయనకి సాయం చేసిన దానివి కూడా అవుతావు.

బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో.." అని లేచాడు శాస్త్రి..

అసలు ఏమీ అర్థం కానట్లుగా బ్లాంక్ అయిన ఆమె మౌనంగా కూర్చుంది అక్కడే...

" రేపు పొద్దున కాల్ చేస్తాను మధు. ఏ విషయమూ చెప్పు. మాకు టైం లేదు ఎక్కువగా.."

అని అక్కడినుండి వెళ్ళిపోయాడు.

*****

"ఏమైంది ఇంత త్వరగానే తిరిగి వచ్చేసారు గోడకు కొట్టిన బంతిలా. నాన్న, మా నాన్న.. అని పరిగెత్తుకెళ్ళారుగా తెగ ప్రేమ ఒలక బోస్తూ.. " అంది కావ్య, మాధవ్ భార్య మూతి తిప్పుతూ.

కోపంగా చూసి, "నాఅవసరం ఆయనికి ఏమి లేదులే.." అంటూ లోపలికి వెళ్ళాడు.

"నేను చెప్తే విన్నారా ? ఆయనకి కూతురుంటే చాలు.. మీ అవసరమేమి లేదని.." అంది నిష్ఠూరంగా ..

"సర్లే ఇపుడు పూర్తిగా అర్థమైంది గా.. ఆయన చచ్చినా పోను గాని, నోరు మూసుకుని భోజనం వడ్డించు." అన్నాడు మాధవ్ కోపంగా.. మనసులోనే తన తండ్రిని తిట్టుకుంటూ.

*****

ఎప్పటి లాగే సాయంత్రం నేరుగా ఇంటికి వెళ్ళి, తన తల్లిదండ్రులకి భోజనం తయారు చేస్తూ, తన తండ్రికి క్యాన్సర్ ట్రీటిమెంట్ వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్

గురించి, క్యాన్సర్ జయించిన వారి అనుభవాలను యూట్యూబ్ లో చూస్తోంది మధు ప్రియ.

మధుప్రియకి, తన తండ్రి అంటే చాలా పిచ్చి. అమ్మ కంటే కూడా నాన్న దగ్గరే చనువు ఎక్కువ. చిన్నప్పటి నుండీ చాలా గారాబంగా చూసుకునే వాడు నరసింహ కూతురిని.. కొడుకుకి పెళ్ళి చేయగానే అతను పూర్తిగా మారిపోవడంతో, కూతురితో మరింత అనుబంధం పెరిగింది. కొడుకు తమని ఏ మాత్రం పట్టించుకోక పోయినా,"అన్నయ్యకి ఫోన్ చేసి మాట్లాడు నాన్నా అప్పుడపుడు.." అంటూ చెప్పే కూతురిని చూసి చాలా గర్వపడేవాడు.

తాగి,తిరిగి ఆస్తులన్నీ కరిగించి, తను చదివిన చదువులకి US వెళ్ళే అవకాశం వచ్చినా వెళ్ళే స్థోమత లేకుండా చేసిన తండ్రి పై ఎప్పుడు కొంచెం కూడా కోపం రాలేదు మధుకి..

తన తండ్రి ఏం చేసినా హీరోనే ఆమె దృష్టిలో. తను దేని గురించి అయినా బాధపడితే నే తట్టుకోలేని ఆమె, ఇప్పుడు ఏకంగా అతను ప్రాణాలతో పోరాడుతుంటే ఆమె గుండె తట్టుకోలేక పోతోంది.

అమ్మ నుండి ఫోన్ రావడంతో, "ఏంటమ్మా ఏమైంది వస్తున్నా.. బాక్స్ లో పెడుతున్నా భోజనం.." అంది.

"డాక్టర్ గారు రౌండ్స్ కి వచ్చి వెళ్ళారు మధు.. నీతో మాట్లాడాలి అన్నారు. త్వరగా వచ్చెయ్.. మళ్ళీ ఆయన వెళ్ళిపోతారు.." అంది.

"అలాగే అమ్మా.. ఇప్పుడే వస్తున్నా అంటూ గబగబా బాక్సులు సర్ది ఇంటికి తాళం వేసి బయటకు వచ్చింది మధు..

*****

"రా అమ్మా.. మధూ.. కూర్చో. మీ నాన్నగారికి ఎంత త్వరగా ఆపరేషన్ చేస్తే అంత మంచిది. ప్రతీ క్షణం చాలా విలువైనది. ఆలస్యం అయ్యే కొద్దీ ఆయన కోలుకునే ఛాన్సెస్ తగ్గుతాయి. అదిచెప్తామనే పిలిచాను..." అన్నాడు డాక్టర్.

"ఆపరేషన్ అయ్యాక నాన్న పూర్తిగా కోలుకుంటారు కదా డాక్టర్ గారు..." అడిగింది మధు భయంగా..

"అదే చెప్తున్నాను తల్లీ.. ఇక్కడ సమయం అనేది చాలా ముఖ్యం. ఆలస్యం చేయకపోతే ఆయన కోలుకునే అవకాశాలు చాలా ఎక్కువ. ఆలస్యంగా ఆపరేషన్ చేసినా ఉపయోగం ఉండకపోవచ్చు."

"ఓకె అండి రేపే చేయండి అయితే.. నేను డబ్బులు అరేంజ్ చేస్తాను.." అంది మధు ధైర్యంగా.

"మంచిదమ్మా, నువ్వు డబ్బులు కట్టడమే ఆలస్యం.. ఆపరేషన్ చేయడమే.అన్ని రెడీగానే ఉన్నాయి."

"ఓకే సర్ థాంక్యూ.." అంటూ బయటకు వచ్చి,తన తండ్రి దగ్గరకు వెళ్ళింది.

"ఏమన్నారు తల్లి డాక్టర్ గారు?" అడిగింది రేణుక.

"రేపే ఆపరేషన్ చేద్దామన్నారమ్మా.ఆపరేషన్ తర్వాత నాన్న తొందరగానే కోలుకుని, ఎప్పటిలా తిరుగుతారంట.." అంది సంతోషంగా..

"మరి ఆపరేషన్కి అయ్యే డబ్బులు ?" అన్నాడు నరసింహం కంగారుగా.

"నేను చూసుకుంటాను నాన్నా అదంతా. మీరు అవన్నీ పట్టించుకోకండి.వారం రోజుల్లో మనం మళ్ళీ ఎప్పట్లా అమ్మ చేసే వేడి వేడి పకోడీలు తింటూ, టివిలో మనకిష్టమైన సీరియల్స్ చూసుకుంటూ, అమ్మ

మీద సెటైర్ లు వేసుకుంటూ హ్యాపీగా మనింట్లో ఉంటాం ఓకేనా.." అని నవ్వుతూ అతని నుదుటిన ముద్దు పెట్టింది.

"అలాగే బంగారు తల్లి. నువ్వు నాకు మరో అమ్మవిరా.." అంటూ ఆమె చేయిని తన చెంపపైపెట్టుకున్నాడు నరసింహం.

*****

"ఏమైంది విక్కీ? ఈ రోజు గుడ్ న్యూస్ చెప్తానన్నావు. ఇదిగో మీ మమ్మీడాడీ కూడా లైన్లో కి వచ్చారు వీడియో కాల్లో." అంది రాజ్యలక్ష్మి అప్పుడే జాగింగ్ నుండి ఇంటికి వచ్చిన మనవడితో.

"నాకు కొంచెం ఫ్రెషప్ అయ్యే టైం అయినా ఇస్తారా మేడం ?" అంటూ విసురుగా తన రూం లోకి వెళ్ళాడు.

బెడ్ పై తన పిల్లలిద్దరూ ఒకరిపై ఒకరు చేతులు వేసుకుని ముద్దుగా పడుకున్న దృశ్యం చూడగానే తన కోపం అంతా ఎగిరిపోయి మనసంతా ఉత్సాహంగా అయింది..

వెంటనే శాస్త్రికి ఫోన్ చేసి, "ఏమైంది శాస్త్రి? ఆ అమ్మాయి ఓకె అందా ? ఇంట్లో చెప్పేయనా?" అడిగాడు.

"అయ్యో సర్.. ఆ అమ్మాయి ఇంకేం చెప్పలేదు. ఇపుడే అడుగుతాను. మీరు అప్పుడే ఇంట్లో ఏం చెప్పకండి. " అని వెంటనే మధుకి ఫోన్ చేసాడు.

రాత్రంతా ఎవరెవరికో ఫోన్లు చేసి, డబ్బు సర్దుబాటు అయ్యే మార్గాలన్ని వెతికి వెతికినిద్రపోక, తెల్లవారేముందే పడుకోవడంతో, ఫోన్ ఎన్ని సార్లు రింగవుతున్నా లేవలేదు మధు.

అన్ని సార్లు ఫోన్ చేస్తున్నా తీయకపోవడం తో

"డౌటే లేదు...ఈ అమ్మాయి ఒప్పుకునేలా లేదు.." అనుకుని ఊరుకున్నాడు శాస్త్రి.

లేటుగా మెలకువ రావడంతో ఆఫీసుకి లేటవుతుందని లేచి గబగబా రెడి అయి,తన పేరేంట్స్ కి బయటనే భోజనం తీసుకుని, వేగంగా హాస్పిటల్ కి వెళ్ళి క్యారేజీ ఇచ్చేసి, తిరిగి ఆఫీస్ కి బయల్దేరింది మధు.

హాస్పిటల్ నుండి బయటకు వస్తుండగా,

సిస్టర్ ఎదురుపడి, "మీ నాన్న గారి ఆపరేషన్ ఈ రోజే అని చెప్పారంట డాక్టరు గారు. డబ్బులు ఇప్పుడు కడతారా మేడం.. " అంటూ అడిగింది.

"ఒక గంట సేపట్లో డబ్బుతో తిరిగి వస్తాను." ధృఢంగా చెప్పి బయటకు వచ్చింది.

"ఏమైంది శాస్త్రి? ఇక్కడ వీళ్ళు నన్ను పీక్కు తింటున్నారు."అని మళ్ళీ ఫోన్ చేసాడు విక్రమ్.

"సర్ ముందైతే ఆఫీసుకి రండి. వచ్చాక మాట్లాడదాం ఆమెతో. ఫోన్ లిఫ్ట్ చేయట్లేదు." అన్నాడు శాస్త్రి.

"నువ్వు చెప్పింది నమ్మి, తను ఖచ్చితంగా ఒప్పుకుంటుందనుకుని ఇంట్లో లీక్ చేశాను.ఇప్పుడు చూస్తే అసలు అది జరిగేలానే లేదు. ఏంటి శాస్త్రి ఇలా చేశావు?" అన్నాడు కోపంగా.

"ఛా. అదేం లేదు ముందు మీరు రండి సార్.." అన్నాడు శాస్త్రి.

"బామ్మా. నాకు అర్జంట్ మీటింగ్ ఉంది. సాయంత్రం వచ్చాక మన చర్చలు కొనసాగిద్దాం. నీ పార్టనర్స్ కి కూడా అదే చెప్పు.."

అంటూ హడావుడిగా బయట పడ్డాడు ఇంట్లో నుండి బతుకు జీవుడా అనుకుంటూ.

*****

"పెళ్ళి అనే మాట చాలా పవిత్రమైనది నా దృష్టిలో, దానిని ఇలా కాంట్రాక్ట్ మ్యారేజ్ అని కించపర్చడం అస్సలు ఇష్టం లేదు. కాని నాన్న ప్రాణం నిలబెట్టడానికి నా ప్రాణమైనా అడ్డు వేస్తాను. అలాంటిది ఇదొక లెక్క కాదు. కానీ ఈ విషయం. అమ్మ వాళ్ళకి ఎలా చెప్పాలి ? ఇంత సడెన్ గా పెళ్ళి అంటే వాళ్ళేం అనుకుంటారో. పైగా నాన్నకి ఆపరేషన్ అయి హాస్పిటల్ లో ఉండగా, నేను ఎలా ఈ పెళ్ళి చేసుకోగలను? సర్ ని అడిగి నెల రోజులు టైం అడుగుతా.." అనుకుంటూనే ఆఫీస్కి వెళ్ళింది మధు.

తను లోపల అడుగు పెట్టి పెట్టగానే ఎదురయ్యాడు శాస్త్రి..

"ఏమ్మా మధు. ఫోన్ చేస్తే తీయట్లేదు. " అన్నాడు.

"అయ్యో నేను చూసుకోలేదు సర్ లేట్ అవుతుందనే హడావుడిలో సారీ..." అంది మధు.

"ఇట్స్ ఓకే. విక్రమ్ సర్ నిన్ను పిలుస్తున్నారు. పద" అన్నాడు నవ్వుతూ.

తన బ్యాగ్ క్యాబిన్ లో పెట్టుకుని విక్రమ్ రూం కి వెళ్ళింది.

తను వెళ్ళగానే, విక్రమ్, శాస్త్రి ఇద్దరు తనవైపే కంగారుగా చూస్తుండటం గమనించి,

"నాకు డబ్బులు వెంటనే కావాలి సర్. ఆపరేషన్ ఈరోజే చేయాలన్నారు" అంది నెమ్మదిగా.

"అంటే నీకు ఓకే నా?" అరిచారు ఇద్దరూ ఒకేసారి.

"అవును.. నాకు ఇంక వేరే దారి లేదు. నాన్నకి వెంటనే ఆపరేషన్ చేయాలి. ఆయన కోసం ఏం చేయడానికైనా సిద్ధమే.." అంది మెల్లగా.

"థాంక్యూ సోమచ్ మధు. నువ్వు ఒప్పుకుంటావో లేదో అని చాలా కంగారు పడ్డాం.ఏం కాదు. ఆయనకి బాగవుతుంది... శాస్త్రీ.. ఆడబ్బులు తీసుకొచ్చి మధుకి ఇవ్వు ఇప్పుడే.." అన్నాడు విక్రమ్ సంతోషంగా.

"సర్, అగ్రిమెంట్ మీద సంతకం.." అన్నాడు

శాస్త్రి నసుగుతూ.

"అంటే ఏంటయ్యా.. ఆ అమ్మాయి డబ్బులు తీసుకున్నాక మాట తప్పుతుందనా నీ ఉద్దేశ్యం."

"అలా అని కాదు సర్ కానీ..." అనడంతో,

"సరే.. ఆ సంతకాలు ఎక్కడ పెట్టాలో చెప్పండి సర్. పెట్టాకే డబ్బు తీసుకుంటా.. నాకేం ఇబ్బంది లేదు.." అంది మధు ధృఢంగా.

"ఒక్క అరగంట నీ క్యాబిన్ లో వెయిట్ చెయ్ మధూ.. పిలుస్తాం." అంటూ పంపించాడు శాస్త్రి.

" ఏ శాస్త్రి. మరీ ఇలా చేస్తున్నావు ఏంటి? " అన్నాడు విక్రమ్ కోపంగా..

"సర్.. ఈ గుడ్డి నమ్మకమే కొంపలు ముంచేది. ఆ అమ్మాయి తో మీరు చేసుకునేది ఒక బిజినెస్ డీల్ లాంటిదే.. అనవసరంగా ఎమోషనల్ గా కనెక్ట్ కాకండి.. తర్వాత బాధ పడాల్సి వస్తుంది" అన్నాడు శాస్త్రి.

ఆలోచిస్తే నిజమే కదా.. అనిపించింది విక్రమ్ కి..

*****

బాగా ఆలోచించి, ఇద్దరూ కలిసి చర్చించి రెండు సంవత్సరాల పాటు భార్య భర్తల్లా నటించటానికికొన్ని నియమ నిబంధనలతో కూడిన ఒప్పంద పత్రాన్ని తయారు చేశారు మొత్తానికి..

అందులోని ముఖ్య నిబంధనలు .

@ ఈ విషయం మన ముగ్గురి మధ్య మాత్రమే ఉండాలి.

@ 2 సంవత్సరాల తర్వాత ఒకరితో మరొకరికి ఎటువంటి సంబంధం లేదు.

@ ఈ 2 సంవత్సరాలలో బయటి ప్రపంచం దృష్టిలో మాత్రమే బార్యాభర్తలు.భార్యగా ఆమెకు విక్రమ్ ఆస్తులపై ఎటువంటి హక్కులు లేవు.ఉండవు.

అంతా చదివిన తర్వాత “సర్, పెళ్ళి ఒక నెల తర్వాత చేసుకుందామా ?” అడిగింది భయంగా.

"అంత టైం లేకనే కదా ఇంత హడావుడిగా నిన్ను ఓకే చేసింది.." అన్నాడు శాస్త్రి.

"వచ్చే వారమే పెళ్ళి. అందరి దృష్టిలో ఇది నిజమైన పెళ్లే."అన్నాడు విక్రమ్.

"కానీ నాన్న ఆరోగ్యం దృష్ట్యా ఇంత సడెన్గా నేను ఇంట్లో ఏం చెప్పి పెళ్ళి చేసుకోవాలో అర్థం కావట్లేదు." అంది బాధగా.

"మేం చూసుకుంటాంలే మధు అదంతా.ముందయితే మీ నాన్న కి ఆపరేషన్ సంగతి చూసుకో వెళ్ళి.." అన్నాడు విక్రమ్.

"ఓకే సర్" అంటూ సంతకం చేసేసి.. డబ్బులు తీసుకుని హాస్పిటల్ కి వెళ్ళింది.

హాస్పిటల్లో డబ్బులు పే చేయగానే గంట తర్వాత ఆపరేషన్ కి మొదలయింది.

"ఆపరేషన్ సక్సెస్ అయింది. సమయానికి చేసాం కాబట్టి ఇంక మీ నాన్న త్వరగానే మాములవుతారు మధు..బీ హ్యాపీ.." అని చెప్పి నవ్వారు డాక్టర్.

"థాంక్యూ సోమచ్ డాక్టర్. ఎప్పుడు డిశ్చార్జ్ చేస్తారు?" అడిగింది మధు.

"చూద్దాం మధు.. సాయంత్రం చెప్తాను కండీషన్ చూసి. ఈలోగా ఈ మెడిసిన్ తెప్పించు.." అంటూ వెళ్ళాడు డాక్టర్.

"అన్నయ్యకి ఫోన్ చేయలేదా మధు" అడిగింది రేణుక.

"చేసాను అమ్మా.. ఆపరేషన్ కోసం డబ్బులు కట్టినప్పటి నుండి ఇందాకటి వరకు చేస్తూనే ఉన్నా.. లిఫ్ట్ చేయలేదు."

"బిజీగా ఉన్నాడేమో. డిస్టబ్ చేయకు. తనే చేస్తాడులే చూసుకుని.." అంది. తను కావాలనే రాలేదని తెలిసినా.

"అలాగే అమ్మ,నువ్వు ఇక్కడే ఉండి నాన్నని చూడటానికి పంపిస్తే వెళ్ళి చూసిరా. నేను ఇపుడే వస్తా.. " అంటూ బయటకు వెళ్ళి శాస్త్రికి కాల్ చేసింది.

"సర్ నాన్న ఆపరేషన్ సక్సెస్ అయింది."

"ఓకే మధు. సర్ కూడా వాళ్ళింట్లో మీ పెళ్ళి విషయం చెప్పడానికి వెళ్ళారు. దాదాపుగా ఇంకో వారంలోనే మీ పెళ్ళి ఉంటుంది. మీ ఇంట్లో కూడా నీకేమైనా హెల్ప్ కావాలంటే సర్ మాట్లాడతారు... ఇంట్లో ఎలా చెప్పాలి ఏం చెప్పాలి అనేది మాత్రం నీ ఇష్టం.." అన్నాడు శాస్త్రి.

"అలాగే సర్ " అంటూ ఫోన్ పెట్టేసి, ఆలోచించడం మొదలుపెట్టింది.

"ముందుగా డాక్టర్ గారు ఏం చెప్తారో విని, ఇంటికి వెళ్ళాక చెప్తే బెటర్ . కానీ ఎం చెప్పాలి? ఎందుకు ఇంత అర్జెంట్ గా పెళ్లి అని అడిగితే? అసలు పెళ్లి అయి పిల్లలు ఉన్న వాడిని చేసుకోవాల్సిన అవసరం ఏంటి అంటే ఎం చెప్పాలి? దేవుడా.. ఒప్పుకోవడమయితే ఒప్పుకున్నా.. కానీ ఇపుడు ఆలోచిస్తుంటే చెమటలు పడ్తున్నాయి.."

ఏదో రకంగా ఈ పెళ్లి కి అమ్మవాళ్ళని ఒప్పించాలి అనుకుని, లోపలికి వెళ్లబోతుంటే మాధవ్ నుండి ఫోన్ వచ్చింది..

వెంటనే ఎత్తి, "హెల్లో అన్నయ్యా.." అంది

"చెప్పు.." అన్నాడు చిరాకుగా.

"మన నాన్న కి ఆపరేషన్ అయింది అన్నయ్యా.." అంది సంతోషం గా

"మంచిది.. ఇంకేం మరి చూసుకోండి బాగా .."

"నీకు చెప్దామని ఫోన్ చేశాను.. అంతే .."

"సరే విన్నాను కదా.. ఉంటా.." అంటూ ఫోన్ కట్ చేశాడు.

మనసు బాధ గా మూలిగింది.. అన్నయ్య వచ్చి నాన్నని చూస్తే నాన్న ఎంత సంతోష పడేవారు అని.. సరేలే నేనున్నా కదా.. నేనే చూసుకుంటా.. అని కళ్ళు తుడుచుకుని లోపలికి వెళ్ళింది.

*****

"బామ్మా ఏం చేస్తున్నావ్.. రా బయటకి..." అంటూ గట్టిగా పిలిచాడు విక్రమ్..

"ఏంటిరా ?" అంటూ వచ్చింది రాజ్యలక్ష్మి నెమ్మదిగా.

"ఇపుడు పిలువు నీ కొడుకుని కోడలిని.. గుడ్ న్యూస్ చెప్పడానికి నేను రెడీ.. " అంటూ హాల్ లో సోఫాలో కూర్చున్నాడు కాలు మీద కాలేసి దర్జాగా కూర్చుని..

అవునా.. అంటూ సంబరం గా వాళ్ళకి వీడియో కాల్ చేసి, విక్రమ్ పక్కనే కూర్చుంది బామ్మ చేతిలో ఫోన్ పట్టుకుని..

"హాయ్ విక్కి ఎలా ఉన్నావ్? అన్నాడు విక్కి వాళ్ళ నాన్న.

"బాగున్నా డాడీ.. మీరు ఎప్పటినుండో ఎదురుచూస్తున్న వార్త చెప్పడానికే కాల్ చేశాను.."

"చెప్పు రా.." అంది విక్కి వాళ్ళ మమ్మీ రోజీ ఉత్సాహం గా.

"మీరు చెప్పినట్లే నేను మళ్ళీ పెళ్ళి చేసుకుంటాను.. అమ్మాయినీ కూడా చూసుకున్నా.." అన్నాడు నవ్వుతూ.

"వాహ్ థాంక్యూ నాన్న.. చాలా మంచి వార్త చెప్పావు.." అన్నాడు వాళ్ల డాడీ సంతోషంగా..

"థాంక్యూ విక్కి.. ఇప్పటికైనా మమ్మల్ని అర్థం చేసుకుని సరైన నిర్ణయం తీసుకున్నందుకు.." అంది రోజీ..

"రేయ్ విక్కి.. ఇంతకీ ఎవరు రా ఆ అమ్మాయి? మన కులం వాళ్లేనా? కులం వేరైనా పర్లేదు.. కానీ మన హిందువులే గా.. ఇప్పటికే మీ అమ్మ వల్ల నేను నా ఇంట్లో చేయాల్సిన పూజలన్నీ చేయలేక చాలా బాధపడ్డాను.. తర్వాత నీ భార్య ప్రియ.. నేను ఎంత చెప్పినా ఒక్క పూజ కూడా చేయలేదు.. నాస్తికత్వం నా మొహం అని..అందుకే తను ఇలా.." అంటూ ఏదో అనబోయి ఆగింది.

విక్రమ్ మొహం కోపం తో ఎర్రగా అవడం గమనించి నాలుక కరుచుకుంది..

"బామ్మా.. మర్యాదగా చెప్తున్నా.. ఆఖరిసారి... ఇంకోసారి నా ప్రియని ఏమైనా అన్నావంటే?".

"చూశారా బ్రతికున్న నన్ను మీ అమ్మ అన్ని మాటలు అన్నా మీరు పట్టించుకోరు.. కానీ మీ కొడుకు.. చనిపోయిన తన భార్య మీద ఒక్క మాట కూడా పడనివ్వడు.." అన్నది రోజీ..

"ఆ తెల్సు లే ఊరుకో.. అమ్మ వింటే మళ్ళీ ఒక గొడవ.." అని,

"సర్లే రా విక్రమ్ ఎవరైతే ఏంటి? నీకు నచ్చింది అది చాలు మాకు.. పిల్లల్ని నిన్ను బాగా చూసుకునే అమ్మాయి అయితే చాలు.." అంటూ నవ్వి..

"పెళ్లికి మంచి ముహూర్తం చూపించు అమ్మా.. వీలైనంత త్వరగా.. మళ్ళీ వాడి మనసు, మాట మారకముందే.." అన్నాడు.

"అది ఐతే నిజమే..ఇదివరకూ ఇలా చాలా సార్లు నమ్మించి మాట మార్చాడు మళ్ళీ.."అనుకుని,

"అలాగే రా.. నేను చూసుకుంటా.." అంది రాజ్యలక్ష్మి.

****

“అమ్మా.. డాక్టర్ గారితో మాట్లాడాను..మూడు రోజుల తరవాత డిశ్చార్జ్ చేస్తాను అన్నారు.. నాన్న కండిషన్ ఇపుడు బాగానే ఉందంట.. రెగ్యులర్ గా చెకప్ చేపించుకుంటూ మందులు వాడుతూ ఉంటే తొందరగానే మామూలు ఐపోతారంట..” అంది మధు సంతోషం గా..

“చాలా సంతోషం తల్లి.. నీకు సమయానికి డబ్బులు ఇచ్చి హెల్ప్ చేసిన అతనికి ఎప్పటికీ రుణపడి ఉంటాం..మా తరపున కూడా చాలా థాంక్స్ చెప్పు తల్లి” అంది మధు వాళ్ళ అమ్మ.

“ఆ.. ఇంకో ముఖ్యమైన విషయం మాట్లాడాలమ్మా మీతో.. నాన్నతో అయితే ఇపుడు చెప్పలేను.”

“ఏంటమ్మా. నాన్న ఆరోగ్యం గురించి డాక్టర్ గారు ఇంకా ఏమైనా చెప్పారా?” అంది కంగారుగా.

“లేదమ్మా ఆయన బాగున్నారు.. నాన్న గురించి ఇంకేం టెన్షన్ పడకు..”

“మరి దేని గురించో చెప్పు?”

“అంటే అమ్మా అది..”

“చెప్పు మధు.. నా దగ్గర చెప్పడానికి మొహమాటం ఎందుకు?” అంది కాస్త రిలీఫ్ గా కూర్చుని.

“నేను పెళ్లి చేసుకుందాం అనుకుంటున్నా అమ్మా..” అంది నెమ్మదిగా.

ఒక్కసారి వినకూడని మాటేదో విన్నట్లు గా ఉలిక్కి పడి, “అదేంటి మధు ఇలా సడెన్ గా..”

“హ్మ్.. ఎప్పటినుండో చెప్దామని అనుకున్నా.. కానీ నాన్న ఆరోగ్యం బాలేక చెప్పలేకపోయా.”

“అవునా.. పర్లేదు తల్లీ.. ఇపుడు నాన్నకి బాగయ్యింది కదా.. ఆయన కోలుకున్నాక అలాగే చేస్తాం.. ఇంతకీ ఎవరు అబ్బాయి?”అంది

“మా కంపెనీ సి ఇ ఓ అమ్మా..” అంది మధు బెరుకుగా

“ఏంటి?”అంది అర్ధం కానట్లు గా

“అవును.. మా కంపెనీ కి యజమాని ఆయన చాలా రిచ్.”

“నీకెలా పరిచయం మధు ఆయన? నువ్వు జాయిన్ అయ్యి నెల కూడా కాలేదు. అపుడే పెళ్లి అంటున్నావు..” అంది అయోమయం గా .

“నాకు తెల్సు అమ్మా అంతకుముందే..” అంది ఏం చెప్పాలో తెలియక.

"అవునా సర్లే.. మంచిదే కదా.. నీకు నచ్చారంటే మంచివారే అయి ఉంటారు.. ఏది చేసినా బాగా ఆలోచించే చేస్తావు కదా నువ్వు.. నీకంటే మాకు ఏం ఎక్కువ తెలీదులే.. నీ లైఫ్ నీ ఇష్టం రా.. నీకు ఎవరు నచ్చితే వాళ్ళనే ఇచ్చి చేస్తాం.." అంది మధు తలపై చేయి వేసి..

“థాంక్యూ అమ్మా..ఇంకో విషయం.. ఆయనకి పెళ్లయి ఇద్దరు పిల్లలు ఉన్నారు.. కానీ ఆయన భార్య చనిపోయింది..” అంది మెల్లిగా తల వంచుకుని..

“ఏం మాట్లాడుతున్నావో నీకైనా తెలుస్తుందా మధు అసలు” అంది కోపం గా.

“ప్లీజ్ అమ్మా అరవకు.. అర్థం చేసుకోండి.. ఇపుడే అన్నావు కదా ఆలోచించకుండానేను ఏ నిర్ణయం తీసుకోనని..ఇది కూడా బాగా ఆలోచించే నిర్ణయించుకున్నా.. గొడవ చేయకు ప్లీజ్..” అంది.

“అది కాదు రా నీకేం తక్కువ అని పెళ్లయి పిల్లలున్న వాడిని పెళ్లి చేసుకుంటావ్ చెప్పు..” అంది ఏడుస్తూ.

“చెప్పాను కదా అమ్మ..అర్థం చేసుకో అంతే..ఏడవకు..” అంది స్థిరంగా.

“సరే.. నాన్న కోలుకున్నాక ఆలోచిద్దాం లే..” అంది బాధ గా ..

“అంత టైం లేదమ్మా.. వచ్చే వారమే పెళ్లి.. నాన్న నీ ఈలోగా డిశ్చార్జ్ కూడా చేస్తారు..” అంది ఎటో చూస్తూ..

మధు వైపు కింది నుండి పైదాకా చూస్తూ.. "ఏమో ఇక నీ ఇష్టం.." అంది స్తబ్దుగా..

ఒకసారి అమ్మ వంక చూసి తను మనసులో పడే వేదన నీ అర్థం చేసుకుని.. దగ్గరికి వెళ్ళింది మధు..

"నన్ను క్షమించు అమ్మా.. మిమ్మల్ని బాధ పెడ్తున్నందుకు.. కానీ నాకు తప్పట్లేదు.." అంటూ తన కాళ్ళ మీద పడి ఏడ్చింది.

“మధు ఏంటి ఈ పని లే?” అంటూ లేపి, “నిజం చెప్పు.. నాన్న ఆపరేషన్ కోసమేనా ఇదంతా” అంది.. అనుమానంగా చూస్తూ.

షాక్ తిన్నట్లుగా గా చూసింది మధు. అమ్మ కి ఎలా తెలిసింది అని.

“డబ్బులు ఇస్తారనే ఈ పెళ్లికి ఒప్పుకుని ఉంటావ్.. ఆయన వయసు పైబడిన వాడేమో.. అందుకే ఎవరు దొరకక నీ అవసరాన్ని అవకాశం గా వాడుకున్నాడు.. అవునా?” అంది.

“లేదమ్మా.. ఆయన ముసలివారు కాదు.. చిన్న పిల్లలే ఉన్నారు తనకి..” అంది ఆమె భయాల్ని తొలగించడానికి.

“మరి ఏంటి ఇదంతా? ఎందుకు ఇంత సడెన్గా పెళ్లి..”

“వాళ్ళ కారణాలు వాళ్ళకి ఉంటాయి.. వాళ్ళ బామ్మ ఆరోగ్యం బాలేదంట. అందుకే అర్జెంట్ గా చేయాలనుకుంటున్నారు.. ఆయనే మన నాన్న ప్రాణం నిలబెట్టారు.. మనం ఆయనకి కృతజ్ఞత చూపించాలి కదా..”అంది

“కానీ నాన్న ఒప్పుకుంటారా..”

“ఒప్పించాలి మనమే..” అంది నవ్వుతూ

“నీకు ఐతే ఇష్టమే కదా ఈ పెళ్లి.. బలవంతం గా చేసుకోవటం లేదు కదా.. నిజం చెప్పు మధు.. ఇప్పుడే ఏదున్నా.. నా మీద ఒట్టేసి.” అంటూ మధు చెయ్యి తీసుకుని తన తలపై పెట్టుకుంది.

“ఏ ఊరుకో అమ్మా..ఇష్టం లేకపోతే నేనెందుకు చేసుకుంటా? ఇదేమైనా ఆటలా.. పెళ్లి..

నాకు ఆ మాత్రం తెలీదా? అనవసరం గా నువ్వు భయపడి ఆయనని భయ పెట్టకు.. నాన్నని ఒప్పించే బాధ్యత నీదే..” అంది సీరియస్ గా.

“సరే మధు.. నీ మీద నమ్మకం తో నే ఒప్పుకుంటున్నా..” అంది.

*****

“విక్కీ..ఆ అమ్మాయి ఎవరు? ఒకసారి నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళు రా..”అంది బామ్మ .

“ఎందుకు? మళ్ళీ ఏం పెంట చేయడానికి? ఆ పెళ్లి ఎప్పుడు చేస్తావో చెయ్యి.. ఆమె నే మనింట్లోకి వస్తుంది..” అన్నాడు విసురుగా.

“అది కాదు రా.. జాతకాలు చూపించాలి.. అలాగే తనింట్లో వాళ్ళని ఒకసారి కలుద్దాం అని..అంతే..”

“జాతకమేగా నేను తెప్పిస్తా లే.. కానీ జాతకాలవీ కుదరలేదు అంటే మాత్రం నాకు సంబంధం లేదు ఇక.. పెళ్లి అనే ఊసే ఎత్తకూడదు మళ్ళీ నా దగ్గర.. ముందే చెప్తున్నా..” అంటూ బెదిరించాడు.

గుర్రుగా విక్రమ్ వైపు చూసి, అంతకంటే గుర్రుగా చూస్తున్న అతని మొహాన్ని చూసి, సరే అంది ఏం చేయలేక.

*****

“శాస్త్రి.. మధు ఇంట్లో చెప్పిందా?” అడిగాడు విక్రమ్.

“తెలియదు సర్.. చెప్పమని చెప్పాను..” అడుగుతా ఫోన్ చేసి..

“ఆ అడుగు.. అలాగే తన జాతకం పంపించమని చెప్పు శాస్త్రి.”

“అదెందుకు సర్ ఇప్పుడు?”

“ఎందుకంటే ఏం చెప్తాం శాస్త్రి? ఇంట్లో మా ముసల్ది ఒకతి ఉందిగా నా ప్రాణానికి..” అన్నాడు కోపం గా

“అవును సార్ మర్చిపోయా.. సరే చెప్తా..” అని మధుకి ఫోన్ చేసి అడిగాడు ఇంట్లో చెప్పావా అని..

“చెప్పాను సర్ అమ్మకి. నాన్న ఇంకా ఐ సి యూ లోనే ఉన్నారు..”

“సర్ వాళ్ళ బామ్మ నీ జాతకం అడిగిందంట మధూ.. పంపిస్తే ముహుర్తం చూస్తారు.”అన్నాడు శాస్త్రి.

“అలాగే సర్ పంపిస్తాను.”అంది మధు.

*****

"ఏరా ఇంతకీ ఎప్పుడు వస్తున్నారు ఇండియాకి?" అడిగింది రాజ్యలక్ష్మి.

“ఏమో కష్టమేనే అమ్మా.. చాలా ఇంపార్టెంట్ ప్రాజెక్టు ఒకటి వచ్చింది. ఇలా మధ్యలో వదిలేసి వస్తే చాలా లాస్ వస్తుంది..” అన్నాడు.

“అలాగా.. మంచిది నాయనా.. ఇంతకీ ఎందరు రా నీకు కొడుకులు?”

“అదేంటే అలా అడుగుతావ్?”

“మరేంట్రా..ఉన్నది ఒక్కగానొక్క కొడుకు.. వాడికి పెళ్లి చేస్తే భార్య చనిపోయి, మూడేళ్లు అవుతోంది. చిన్నపిల్లలను వేసుకొని ఒక్కడే బ్రతుకుతున్నాడు

ఇక్కడ. రెండో పెళ్లి చేసుకోరా అంటే అస్సలు చేసుకోనని మొండికేశాడు ఇన్నేళ్లు. దేవుడి దయవల్ల మన అదృష్టం బాగుండి, ఏదో పిల్ల నచ్చిందేమో చేసుకుంటాను అని ముందుకు వచ్చాడు.

తీరా ఇప్పుడు మీరు బిజినెస్ లాస్ వస్తుందని కొడుకు పెళ్ళికి రానంటున్నారా? ఏం మనుషులురా మీరు? తల్లికి ఎలాగు పట్టింపు లేదు కొడుకు మీద. కనీసం నువ్వైనా పట్టించుకోవా?" అంటూ కడిగిపారేసింది.

"కాదమ్మా.. రావాలని మాకు మాత్రం ఉండదా? కానీ అది చాలా ప్రెస్టీజియస్ ప్రాజెక్టు..!"

"అది కాదురా కోట్లకి కోట్లు సంపాదించి ఎవరికీ పెడతారురా? వాడి కోసమేగా? మరి వాడు సంతోషంగా ఉండటం మీకు అక్కర్లేదా? అరే పిల్లాడు అడగగా అడగగా పెళ్లికి ఒప్పుకొని, కొత్త జీవితం ప్రారంభించాలి అనుకుంటున్నాడు. మీరు లేకుండా, మీ ఆశీర్వాదాలు లేకుండా వాడి కాపురం ఎలా చక్కగా ఉంటుందిరా. పోతే పోనీ కోట్లు.. బోడి ప్రాజెక్టు.. బోడి ప్రెస్టేజ్.. కొడుకు కంటే ఎక్కువారా మీకు?"

"సరే అమ్మ.. సరే.. వస్తాన్లే.. ముహూర్తం అదీ చూసి ఎప్పుడు బాగుందో చూసి, అన్ని ఏర్పాట్లు చేసి చెప్పు.."

"ఆ.. అన్ని చేసి, నీకు ఫోన్ చేస్తాను.. తాళి కట్టే సమయానికైనా దిగండి."అని తిట్టి ఫోన్ పెట్టేసింది.

"నేను ముందే చెప్పాను కదా వెళ్దామండి అని నిన్ననే మీతో.. ఏమన్నారు? మనం వెళ్లి ఏం చేస్తాం? అమ్మ చూసుకుంటుందిలే అనో నన్ను నోరు మూయించారు. ఇప్పుడు చూసారా ఆవిడ నన్ను ఎన్ని మాటలు అంటున్నారో? నిన్న నేను అడిగితే వద్దన్నారు.. ఈరోజు తల్లి చెప్పగానే తయారైపోయారు..

ఆవిడకి, మీకు నేనంటే విలువే లేదు..” అంది కోపంగా.

“అబ్బా రోజీ నువ్వు కూడా మొదలెట్టావా ఆవిడ టార్చరే పడలేకపోతున్నా.. మళ్ళీ నువ్వు కూడా మొదలుపెట్టకు.. అయినా ఇదంతా గత 30 ఏళ్లుగా జరుగుతున్నదే కదా ఇప్పుడు ఏమైనా కొత్తా?”

“ఆ 30 ఏళ్ళుగా మీరు చేస్తున్నది కూడా ఇదే కదా.. అలాగే మూసుకొని కూర్చోండి..”అంటూ కోపంగా వెళ్ళిపోయింది.

*****

“అమ్మా.. పేషెంట్ ని నార్మల్ రూమ్ కి షిఫ్ట్ చేస్తున్నాము. వెళ్లి చూడండి.”అని చెప్పిన నర్స్ మాట వినగానే తల్లి కూతుర్లు ఇద్దరు చూడటానికి వెళ్లారు.

మధు రూమ్ లోకి అడుగుపెట్టగానే నవ్వుతూ తన బొటన వేలు చూపించాడు నరసింహ, సక్సెస్ అంటూ ..

“నేను చెప్పాను కదా నాన్న.. నేనుండగా నీకేమికానివ్వను”అని అంది నవ్వుతూ, ఆయన చేతులు పట్టుకుని పక్కనే కూర్చుని.

“అవును తల్లి.. నీ ప్రేమే నన్ను బ్రతికించింది..” అంటూ ఆమె చేతుల్ని ముద్దు పెట్టుకున్నాడు.

మధు తల్లి వీళ్ళిద్దరినీ చూసి మురిసిపోయింది.

“మాధవ్ రాలేదా అమ్మా?”అడిగాడు మెల్లిగా.

“అన్నయ్యకి కొంచెం అర్జెంట్ పని ఉందంట.. మీరు ఎలా ఉన్నారని ఫోన్ చేసి అడుగుతూనే ఉన్నాడు పదేపదే.” అంది మధు తడుముకోకుండా.

“సర్లే.. కన్న తండ్రి కంటే వాడికి అన్ని ముఖ్యమైనవే.”అన్నాడు నిరాశగా

“ఏం కాదు అన్నయ్యకి మీరంటే ఇష్టమే.. కాకపోతే తను ఉన్న పరిస్థితి అలాంటిది. అయినా అన్నయ్య వచ్చి ఏం చేస్తారు చెప్పు ఇప్పుడు.మేమిద్దరం ఉన్నాం కదా చూసుకోవడానికి.” అంది ఆయన తల

నిమురుతూ..

అంతేలే అంటూ నవ్వాడు.”ఇంతకీ డాక్టర్ ఏమన్నారు తల్లి డిశ్చార్జ్ గురించి.”అన్నాడు.

“మూడు రోజుల తర్వాత చేస్తా అన్నారు నాన్నా.”

“హమ్మయ్య మొత్తానికి ఇంటికి వెళ్ళిపోతాం.. మొత్తానికి బ్రతికి బయటపడ్డాను రా.. బతుకుతానో లేదో అనుకున్నాను.. నీ పెళ్లి చూస్తానో లేదో అనుకున్నాను.. దేవుడు కనికరించాడు. ఇంక త్వరగా నీకు పెళ్లి చేసేయాలి..”అన్నాడు.

ఆ మాటకి మధు వాళ్ళ అమ్మ,మధు ఇద్దరు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

“ఏమైంది ఇద్దరికీ?”అన్నాడు సందేహం గా.

“ఏం లేదండి.. ఆల్రెడీ ఒక మంచి సంబంధం వచ్చింది మధు కి.. మీరు డిశ్చార్జ్ అయ్యాక మాట్లాడదాం లేండి..” అంది నెమ్మదిగా.

“అవునా చాలా మంచిది. ఎవరు అబ్బాయి? సంబంధం ఎవరు చూశారు? మాధవా?” అడిగాడు ఆసక్తిగా.

“లేదు లేదు.. మధు పనిచేసే ఆఫీసులో మేనేజర్ అంట..” ఏం చెప్పాలో తెలియక అంది.

"అవునా.. సంతోషం తల్లి.. నీకు నచ్చితే చాలు రా.. ఇంకా ఏ వివరాలు నాకు అవసరం లేదు.. నీకంటే మెచ్యూర్ గా మేము ఏమి ఆలోచించలేంలే.." అంటూ నవ్వాడు.

"మంచి సంబంధం నాన్న..నేను చాలా సంతోషంగా ఉంటాను.. కానీ పెళ్లి అర్జెంటుగా చేసేయాలి అంటున్నారు.. అదొక్కటే ప్రాబ్లం.." అంది మెల్లిగా ఆయనకు విషయం తెలియజేస్తూ.

"అంత అర్జెంట్ అంటే మనకు డబ్బులు అవి సర్దుబాటు కావాలి కదా.." అన్నాడు కంగారుగా.

"ఏమి అవసరం లేదు నాన్న.. అంతా వాళ్ళే చూసుకుంటామన్నారు."

"లవ్ మ్యారేజ్ ఆ తల్లి.. అబ్బాయికి నువ్వంటే చాలా ఇష్టం అనుకుంటా కదా.."నవ్వుతూ అన్నాడు.

"అవును నాన్నా..." అంది మధు ఏం చెప్పాలో తెలియక.

"అలాగే రా నువ్వు ఎలా అంటే అలాగే చేసేద్దాం. ఏ విషయంలోనూ నేను అడ్డు చెప్పను. పూర్తి స్వేచ్ఛ నీకే ఇస్తున్నాను.. నువ్వు సంతోషంగా ఉంటే చాలు తల్లి."అన్నాడు మధు తలపై చేయి వేసి.

"థాంక్యూ సో మచ్ నాన్న.. నా మీద ఇంత నమ్మకం ఉంచినందుకు.. అంటూ ఉంటే ఆమెకు తెలియకుండానే కళ్ళల్లో నుంచి కన్నీళ్ళుజారి కింద పడ్డాయి.

అది తనని నమ్మిన తన తల్లిదండ్రుల నమ్మకాన్ని మోసం చేస్తున్నందుకో లేక తన జీవితాన్ని చేతులారా తానే పాడు చేసుకుంటున్నందుకో అర్థం కాలేదు.

తన ఇంట్లో వాళ్ళ ని పెళ్ళికి ఒప్పించినట్లు, మెసేజ్ పంపింది శాస్త్రి కి.

“బామ్మా.. ఇప్పుడు అమ్మ వాళ్ళని ఎందుకు రమ్మన్నావు? వాళ్ళకి అక్కడ ముఖ్యమైన పనుంది అన్నారు కదా.. అవసరమా? “

“ఇంకా ఎవరిని పిలవనవసరం లేదు.. గుడిలో దండలు మార్చుకుని మీ ఆశీర్వాదం తీసుకుంటాం.. అంతే..” అన్నాడు విక్రమ్.

“అప్పుడు చేసింది ఏంట్రా మరి.. ఉన్న ఒక్కగానొక్క కొడుకువి.. కోట్లకి వారసుడివి.. ఏ ఆర్భాటం లేకుండా చేసుకుంటామని చేసుకున్నారు.. అప్పుడు కూడా ఎంత చెప్పినా వినిపించుకోలేదు.. ఆ పిల్ల ఏంటో? ఆమె ఆదర్శాలేంటో.. ?పెళ్లికి ఖర్చు చేయడం అనవసరం అంటూ.. ఆ డబ్బుల్ని అనాథాశ్రమాలకి తగలేసారు..కనీసం ఇప్పుడైనా మా కోరిక తీర్చొచ్చు కదరా..”

“నన్ను పెళ్లి చేసుకోమంటావా మొత్తానికే మానేయమంటావా? అదొక్కటి చెప్పు బామ్మ..”

“ఏమైనా అంటే బెదిరించడం చేసుకోనని.. ఎవరికోసం చేసుకుంటున్నావు రా నువ్వు? నీకోసమేగా మేము చెప్పేది..”

“నాకోసం అయితే నాకు పెళ్లే అక్కర్లేదు.. మీ కోసమే నేను పెళ్లి చేసుకుంటున్నాను.. మీ టార్చర్ భరించలేక పెళ్లి చేసుకుంటున్నాను.. అది కూడా వద్దంటే చాలా సంతోషం నాకు.. హంగులు, ఆర్భాటాలు,చుట్టాలు పక్కాలు, అంటూ హడావిడి చేస్తే మాత్రం పెళ్లి క్యాన్సిల్ చేసేస్తాను బామ్మ.. ముందే చెప్తున్నాను తర్వాత నన్ను అనొద్దు..”

“సరే ఎలాగోలా ఏడువ్.. ఆ పిల్ల కూడా ఇలాగే సింపుల్ గా చేసుకుందాం అందా? వాళ్ల వాళ్లు కూడా ఎవరిని పిలవరంటనా?” అంది ఆరాలు తీస్తూ..

“పిలవద్దన్నాను నేనే..”

“మంచి పని చేశావు లే ఇంతకీ పిల్ల వివరాలు, కనీసం ఫోటో అయినా చూపిస్తావా లేదా..”

“అసలు నీకెందుకే ముసలిదానా ఇంత ఇంట్రెస్ట్ నా పెళ్లి మీద..కోపంగా అని, నా దగ్గర ఫొటోస్ లేవు. అయినా జాతకంచూపించావుగా.. సరిపోలేదా.. ఇప్పుడు ఫోటో చూసి బాలేకపోతే, క్యాన్సల్ చేస్తావా..”

“ఛా.. నీతో మాట్లాడడమే వేస్ట్ రా.. పిల్ల ఫోన్ నెంబర్ అయినా ఇవ్వు. ఒకసారి మాట్లాడుకుంటా..”

అమ్మో ఈవిడకి ఫోన్ నెంబర్ ఇస్తే ఏదో ఒక పెంట చేసి, ఇది కాంట్రాక్ట్ మ్యారేజ్ అని తెలుసుకుంటుంది.. అనుకుని,

"నువ్వు అమ్మాయిని చూడాలి.. అంతే కదా.. సరే ఈరోజు ఇంటికే తీసుకుని వస్తాను చూసి మాట్లాడదువులే.."

"వద్దురా.. పెళ్లికి ముందే అమ్మాయి ఇంటికి రాకూడదు మన ఆచారం ప్రకారం. కావాలంటే నన్నే వాళ్లింటికి తీసుకెళ్ళు.."

"సరే నేను తనకి ఫోన్ చేసి చెప్తాలే.. సాయంత్రం వెళ్దాం.."

"మా బామ్మ చంపుతుంది మధు.. నిన్ను చూడాలి.. మాట్లాడాలి.. అంటుంది. నాన్నకు ఎలా ఉంది ఇప్పుడు? డిశ్చార్జ్ చేశారా?" ఫోన్ చేసి అడిగాడు విక్రమ్.

"లేదు సర్ రేపు డిశ్చార్జ్ చేస్తారు.."

"ఇంట్లో అంతా ఓకే కదా.. చెప్పావుగా పెళ్లి గురించి? ఒప్పుకున్నారా? ఏం ప్రాబ్లం అయితే లేదు కదా.."

"కొంత బాధపడ్డారు కానీ ఒప్పించాను సార్.."

"జాతకాలు చూపించిందంట బామ్మ.. ఇంకా నాలుగు రోజుల్లో మంచి ముహూర్తం ఉందంట. పెళ్లి గుళ్లో.. దండలు మార్చుకోవడమే.. ఎవరిని పిలవట్లేదు. మీరు కూడా అంతే.. నువ్వు మీ అమ్మ, నాన్న వచ్చేసేయండి.."

"అలాగే సర్ ఇంట్లో మాట్లాడి చెప్తాను.."

"రేపు సాయంత్రం మా బామ్మ ని తీసుకొని మీ ఇంటికి వస్తా.. అడుగుతుంది ఒకసారి కలవాలని మాట్లాడాలని..."

"అలాగే సర్.." అని పెట్టేయగానే,

"ఎవరమ్మా ఫోన్లో సర్ అని మాట్లాడుతున్నావ్.. అబ్బాయి తోనా?" అంది మధు వాళ్ళ అమ్మ.

"అవునమ్మా.. సర్ వాళ్ళ బామ్మ నన్ను ఒకసారి చూడాలనుకుంటున్నారంట.. కలిసి మాట్లాడాలనుకుంటున్నారంట.. రేపు నాన్న డిశ్చార్జ్ అయి, ఇంటికి వెళ్లాక,మన ఇంటికి వస్తానన్నారు వాళ్ళ బామ్మ ని తీసుకుని.."

"అలాగా.. సరే మంచిది లే.. మేము కూడా ఒకసారి వాళ్ళని చూస్తే మాకు కూడా హ్యాపీగా ఉంటుంది.." అంది మధు వాళ్ళ అమ్మ రేణుక.

"ఆ ఇంకో విషయం.. పెళ్లి ఇంకో నాలుగు రోజుల తర్వాతే అట.. గుడిలో దండలు మార్చుకుని సింపుల్ గా.. " అంటూ వుండగానే,

"మీ నాన్న ఒప్పుకోరు మధూ అలా.." అంది ఖచ్చితంగా .

"అదేంటమ్మా.. ఈ తక్కువ టైం లో అలా కాకుండా ఏం చేస్తాం?" అంది మధు.

"అది కాదు మధు.. మీ నాన్న నీ పెళ్లి గురించి చాలా కలలు కన్నాడు.. అంగరంగ వైభవంగా జరిపించాలని అందరినీ పిలిచి సంతోషంగా నిన్ను సాగనంపాలని... ఇలా.. నీ పెళ్లి అనేది ఆయనకు ఒక అందమైన కల."

"అలాంటిది ఇలా గుళ్లో పెళ్లి అంటే.. ఆయన ఏమంటారో చూద్దాం.."

అమ్మ అలా అన్నాక నిజంగానే భయం మొదలైంది మధుకి. ఇప్పుడు నాన్నకి ఎలా నచ్చ చెప్పాలి? అని ఆలోచించడం మొదలుపెట్టింది.

"విక్కీ.. పెళ్లి మన రాములవారి గుడిలోనే జరిపిద్దాం రా.. అక్కడ అంతా మనం అనుకున్నట్లే చేయొచ్చు.. పూజారి కూడా మనోడు" అంది రాజ్యలక్ష్మి..

"కానీ బామ్మా.. అక్కడ ఎప్పుడు జనాలు ఉంటారు కదా ఎక్కువగా." అన్నాడు ఇబ్బంది గా..

"ఉంటే మనకేంటి రా? మనమేమైనా దొంగలమా భయపడటానికి?"అంది వింతగా చూస్తూ.

"సరేలే ఏదోకటి నీకు నచ్చినట్లు కానియ్.."

"అమ్మాయి దగ్గరికి తీసుకు వెళ్తా అన్నావ్.. ఏమైంది?"

"వెళ్దాం ఇవాళ సాయంత్రం.."

"అలాగే అమ్మాయిని తీసుకుని షాపింగ్ కి వెళ్లి పెళ్లి బట్టలు తీసుకుందాం ."

"అబ్బా ఇదొకటుందా.. అనుకుని సరేలే.."అన్నాడు ముక్తసరిగా..

"పెళ్లి ఎవరికి జేజి?"అంటూ పరిగెత్తుకుని వచ్చారు ఆద్య అద్విత్ లు.

వాళ్ళు అడిగిన ప్రశ్నకి తెల్లబోయి చూసాడు విక్రమ్.

కానీ రాజ్యలక్ష్మి మాత్రం..

"మీ డాడీకే రా..రోజు అడుగుతారు కదరా.. మమ్మీ కావాలి..మమ్మీ కావాలి.. అని, మీకు మమ్మీ రాబోతుంది రా.." అంది సంతోషం గా..

"బామ్మా.." అంటూ ఆపబోయాడు విక్రమ్.

కానీఈలోగా పిల్లలే ఎగురుతూ,గెంతుతూ.. "హే... మమ్మీ వస్తుందోచ్.." అంటూ కేకలు వేయడంతో నోట మాట రాక, చూస్తూ ఆలోచన లో పడిపోయాడు. మధు వచ్చాక పిల్లలు తనకి అట్రాక్ట్ అయిపోతే ఎలా అని...

"ఇంటికి తీసుకొచ్చారా మధు మీ నాన్నని?" అడిగాడు విక్రమ్ ఫోన్ చేసి..

"పొద్దున్నే వచ్చాం సర్.. మీరు వస్తున్నారా బామ్మని తీసుకుని.." అడిగింది మధు క్యాజువల్గా..

"తప్పదు కదా..మా మేడం గారు ఎక్కడ తగ్గట్లేదు నీకేం ఇబ్బంది లేదు కదా.."

"దేనికి ఇబ్బంది పడదలచుకోలేదు సర్ ఇంక నేను.. మీకు రాసిచ్చినట్లుగా ఈ రెండేళ్లు మీరు ఎలా చెప్తే అలానే చేస్తా.. అమ్మ వాళ్లకు కూడా చెప్పాను మీరు వస్తున్నారనీ.. అమ్మ కూడా హ్యాపీగా ఫీల్ అయింది.. పర్లేదు రండి."

"అదే నా బాధ మధు.. వీళ్ళు అనవసరంగా హ్యాపీగా ఫీల్ అయిపోయి, ఎక్కడ ఎమోషనల్ గా కనెక్ట్ అయిపోతారో అని.. కానీ ఏం చేస్తాం..

సరే వస్తున్నాం.. అడ్రస్ షేర్ చెయ్.."

"వెళ్దామా బామ్మా.."

"వెళ్దాం రా.. పిల్లల్ని కూడా రెడీ చేసి తీసుకెళ్దాం."

"హలో... వాళ్ళు ఎక్కడికి రారు.. ఇంట్లోనే ఉంటారు.. పనివాళ్ళు ఉన్నారుగా చూసుకోవడానికి.. మనం కూడా అలా వెళ్లి ఇలా వచ్చేయడమే.. గంటలు గంటలు కూర్చునే టైం నాకు లేదు.. చాలా బిజీ వర్క్ ఉంది నాకు.."

"అలాగే నాయనా.. వచ్చేద్దాం ఆ బట్టలన్నీ కొనేసి తొందరగానే వచ్చేద్దాం లే.. అయినా నువ్వు బిజీగా లేనిదెన్నడు.. పిల్లల బట్టలు కూడా తీసుకోవచ్చు వాళ్ళ ని తీసుకెళ్తే అని అడిగాను.."అంది..

"నేను తెస్తానులే వాళ్లకు.. నువ్వు అంత కంగారు పడొద్దు వాళ్ల గురించి..పదా" అంటూ నడిచాడు బయటకి..

ఇద్దరు కలిసి మధు వాళ్ళ ఇంటికి బయలుదేరారు..

మధు వాళ్ళకి సొంత ఇల్లు లేదు.. ఒక అపార్ట్మెంట్లో సింగిల్ బెడ్ రూమ్ అద్దెకి తీసుకుని ఉంటున్నారు. వాళ్ళ ఇల్లు కూడా మాధవ్ బిజినెస్ కోసం అమ్మేయాల్సి వచ్చింది..

మధు పంపిన అడ్రస్ ప్రకారం వెళ్తే ఒక అపార్ట్మెంట్ ముందుకుఆగింది విక్రమ్ కారు.

"ఏంట్రా విక్కీ ఏరియా బాగా చీప్ గా ఉన్నట్లుంది.. అమ్మాయి వాళ్ళది బాగా పూర్ ఫ్యామిలినా? మిడిల్ క్లాసా?" అడిగింది బామ్మ.

ఏమి మాట్లాడకుండా కార్ దిగి, మధుకి ఫోన్ చేశాడు.

"మీ అపార్ట్మెంట్ కిందే ఉన్నాం మధు.. లోపలికి రావచ్చా?"

"రండి సర్.. నేను కూడా బయటకు వస్తున్నాను.."

అని లిఫ్ట్ లోకి కిందికి వచ్చి విక్రమ్ని, రాజ్యలక్ష్మిని చూసి నమస్కారం పెట్టింది..

చుడిదార్లో చూడచక్కగా, సంప్రదాయబద్ధంగా,అందంగా ఉన్న మధును చూడగానే రాజ్యలక్ష్మి పెదవులు విచ్చుకున్నాయి..

రండి.. అంటూ మధు ముందు నడుస్తుండగా ఆమె వెనకాలే వెళ్లారు ఇద్దరూ.

వేగంగా నడుస్తున్న ఆమె అడుగులకు అనుగుణంగా, వెనకాల లయబద్ధంగా ఊగే వాలుజడ వయ్యారాలు వద్దన్నా విక్రం కళ్ళలో పడ్డాయి.

ఇన్నేళ్లలో ఏ అమ్మాయిని చూసినా అసలు ఇలాంటి ఆలోచన అనేదే ఉండేది కాదు.. ఎందుకు ఈ పిల్లను చూడగానే నాకు అప్పుడప్పుడు ఇలా అవుతుంది. పెళ్లి అనే మాటకు ఉన్న పవరా ఇది? లేక చాలా ఏళ్లుగా ఆడవాళ్లకు దూరంగా ఉండడం వలన కలిగే అలజడా..? అనుకున్నాడు మనసులో.

“ఏ మాటకి ఆ మాట.. చాలా బాగుందిరా అమ్మాయి..” అంది రాజ్యలక్ష్మి సంబరంగా, సంతోషం ఆపుకోలేక..

“సంతోషమే కదా నీకూ..” అన్నాడు వెటకారంగా.

“రండి లోపలికి.. ఇదే మా ఫ్లాట్.” అంటూ నవ్వుతూ లోపలికి ఆహ్వానించింది మధు.

చాలా చిన్న హాల్.. కానీ అన్నీ ఎక్కడివక్కడ నీట్ గా సర్ది ఉన్నాయి.. ఇంత చిన్న గదిని ఇంత అందంగా తీర్చిదిద్దుకోవచ్చా? అనిపించేలా ఉంది..

ఆఫీసులో తన క్యాబినైనా ఇంతకన్నా పెద్దగా ఉంటుంది.. అనుకున్నాడు విక్రమ్ మనసులో.

మధుకి కూడా మనసులో చాలా గట్టిగా అనిపిస్తుంది.. "అంత పెద్ద కోటీశ్వరులు ఇలాంటి ఇంటికి రావడం, ఇలాంటి ఇంటి నుండి అమ్మాయిని పెళ్లి చేసుకోవడం అంటే బామ్మ ఎలా ఫీల్ అవుతుందో పాపం? " అని.

మధు వాళ్ళ అమ్మ కూడా వచ్చి, పలకరించి నమస్కారం పెట్టింది.. వాళ్లకు టీ,టిఫిన్ ఇచ్చింది..

"నాకు టీ అలవాటు లేదు ఆంటీ.." అని అవాయిడ్ చేశాడు విక్రమ్.

తాగకపోతే బాగోదని బామ్మ మాత్రం టీ తాగి,

"చాలా బాగుందమ్మా.. ఉన్నవరకు చక్కగా నీటుగా ఉంచుకున్నారు ఇల్లు.. హడావుడిగా జరిగిపోతున్నాయి అన్నీ.. ఎంతైనా పెద్దదాన్ని కదా కొంత ఆరాటం గా ఉంటుంది.. అందుకే కనీసం ఒకసారి అమ్మాయిని చూడాలి అంటే తీసుకొచ్చాడు.. మిమ్మల్నేం ఇబ్బంది పెట్టలేదు కదా.."అంది.

"ఛ ఛ.. అదేం లేదు పైగా నాకు కూడామీరు వస్తే కొంత ధైర్యంగా ఉంది.మా అమ్మాయి మొన్ననే చెప్పింది సడెన్ గా పెళ్లి గురించి.. మాకు కూడా చాలా భయమేసింది.. ఇప్పుడు మిమ్మల్ని ఇలా చూస్తుంటే చాలా ధైర్యం వచ్చింది."అంది రేణుక.

"ఇంతకీ మీ నాన్నగారేరమ్మా.."

"ఆయనకి మొన్ననే సర్జరీ జరిగిందండి.. ఈరోజే డిశ్చార్జ్ అయి వచ్చాము హాస్పిటల్ నుండి.. పడుకున్నారు.."

"అయ్యో అలాగా.. జాగ్రత్తగా చూసుకోండి మరి..

షాపింగ్ పనులవీ ఉంటాయి కదా.. పెళ్లి ఎల్లుండే వచ్చింది..ఎంత సింపుల్గా చేసినాకనీసం కొత్త బట్టలైనా ఉండాలి కదా.. అందుకే ఇటునుంచి ఇటే షాపింగ్ కి వెళ్లి అమ్మాయికి చీర తీసుకుందామని వచ్చాను..” అంది.

“సరే అయితే. షాపింగ్ అయిపోయాక మళ్ళీ నేను ఇక్కడ డ్రాప్ చేస్తాను.. వెళ్దామా మధు.. అన్నాడు విక్రమ్  అంతసేపు మొబైల్ లో ఏదో సీరియస్ గా చూస్తున్న వాడల్లా లేచి..

“అలాగే సర్.. “ అంటూ వాళ్ళ అమ్మకి చెప్పి, వాళ్ళిద్దరి వెనకాలే బయటకి వెళ్ళింది.

డ్రైవర్ పక్కనే విక్రమ్ కూర్చుంటే, వెనకాల రాజ్యలక్ష్మి పక్కన మధు కూర్చుంది. సిటీలోనే ఉన్న వాళ్ళు ఎప్పుడు వెళ్లే పెద్ద షాపింగ్ మాల్ కి వెళ్లారు.

సరిగ్గా అరగంట సమయం అక్కడికి వెళ్లడానికి..

ఆ అరగంటలో మధు గురించి, మధు కుటుంబం గురించి, మధు చేస్తున్న జాబ్ గురించి, విక్రమ్ ఎలా పరిచయమయ్యాడనే దాని గురించి పూర్తి వివరాలు రాబట్టింది రాజ్యలక్ష్మి తన చాకచక్యంతో..

రాజ్యలక్ష్మి అడుగుతున్న ప్రతి విషయాన్ని ముందు కూర్చుని వింటూనే ఉన్నాడు విక్రం.. మధు ఆచితూచి, ఆలోచించి చెప్తున్న సమాధానాలకు సంతృప్తిగా చిరునవ్వు నవ్వాడు.

మధు చెప్తున్న సమాధానాలకు బామ్మ కూడా తృప్తి పడింది.

ఒకప్పుడు బాగా బతికిన వాళ్లే, కానీ తండ్రి కొడుకుల జల్సాలకి పాపం ఆస్తంతా ఖర్చు అయిపోయి ఇలా ఆడపిల్ల కష్టం మీద బ్రతకాల్సి వస్తుందని సులభంగానే అర్థం చేసుకుంది అనుభవజ్ఞురాలు అయిన

రాజ్యలక్ష్మి. ఏదో తెలియని అభిమానం పుట్టుకొచ్చిందామెకి మొదటి పరిచయంలోనే మధు మీద.

తమ సీఈవో అనే తప్ప ఇంకే విషయం తెలియని విక్రమ్ గురించి చాలా విషయాలు చెప్పింది బామ్మ మధు కి.. అతని కుటుంబం గురించి, తన తల్లిదండ్రుల గురించి చెప్పి అందరి ఫోటోలు చూపించింది.

ఇది ఉత్తి పెళ్లి అని తెలిసినా విక్రం గురించి తెలుసుకోవడానికి ఎందుకో చాలా ఆసక్తిగా అనిపించింది మధుకి..

పెళ్లి అనేది ఒక ఆడపిల్లకి ఎంతో ప్రత్యేకం..తనకి మరో జన్మ లాంటిది..తెలిసి తెలిసి ఎంతో అమూల్యమైన పెళ్లి ని ఒక ఆటలా మార్చిన తన మీద తనకే కోపం వచ్చింది.. కానీ తప్పనిసరి పరిస్థితి కనుక ఏమి చేయలేక మౌనంగా ఉంది మధు..

ఇది కేవలం కాంట్రాక్ట్ అనే విషయం అప్పుడప్పుడు మర్చిపోతున్నట్లు అనిపించేది.. మళ్లీ వెంటనే తేరుకొని వాస్తవంలోకి వచ్చి తన మనసును అదుపులో పెట్టుకునేది.

మంచి కాస్ట్లీ పట్టుచీరలు రెండింటిని మధుకి కొని, మధు వాళ్ళ అమ్మకి కూడా ఒక మంచి చీర, వాళ్ళ నాన్నకి కొత్త బట్టలు తీసుకుని ప్యాక్ చేసి, అలాగే విక్రమ్ కి, పిల్లలకి, బామ్మకి కూడా బట్టలు తీసుకుని.. ఒక గంటలో షాపింగ్ పూర్తి చేసుకుని హడావుడిగా వచ్చేసారు విక్రమ్ ఆదేశాల మేరకు.

మళ్లీ మధుని వాళ్ళ ఇంటిదగ్గర వదిలి బామ్మని తీసుకొని ఇంటికి వెళ్ళాడు విక్రమ్.

"మధూ.. ఇలా రా.." అని పిలిచాడు వాళ్ళ నాన్న బెడ్ పై నుండి.

"ఎలా ఉంది నాన్న ఇప్పుడు పర్లేదా?

ఏమైనా ఇబ్బందిగా ఉందా?" అడిగింది మధు.

"పెళ్లి ఎల్లుండే అంట కదా.. ఏంటమ్మా? ఇంత హడావిడిగా చేస్తున్నావ్.. నీకు తెలుసు కదా. నీ పెళ్లి నేను ఎలా చేయాలనుకున్నానో? నాకు ఉన్నదే ఇద్దరు పిల్లలు.. అందులోనూ వాడు చెప్పా పెట్టకుండా పెళ్లి చేసుకుని తీసుకొచ్చాడు పిల్లని. కనీసం నీ పెళ్లి అయినా.. నాకు నచ్చినట్లు చేద్దామనుకుంటే నువ్వు ఇలా.. ఎందుకురా ఇలా బాధ పెడుతున్నారు నాన్న ని..?" అన్నాడు కళ్ళ నిండా నీళ్ళతో.

"పరిస్థితి అలా వచ్చింది నాన్న.. ఇప్పుడు మనకు అంత టైం కూడా లేదు పిలవడానికి.." అంది నరసింహని కన్విన్స్ చేయడానికి ట్రై చేస్తూ..

"లేదు.. ఇంకా రెండు రోజులు టైం ఉందిగా.. అందరికీ ఫోన్లో ఇన్విటేషన్ పంపిస్తాను.. వచ్చేవాళ్ళు వస్తారు. కానీ పిలవకుండా ఊరుకోవడం బాగుండదు కదా.." అన్నాడు నరసింహ మధునే కన్విన్స్ చేస్తూ.

"అలాగే కానీ, దగ్గర వాళ్ళనే పిలవండి.. అందరిని వద్దు.. " అంది మధు ఇంకా వాళ్ళ నాన్నను బాధ పెట్టడం ఇష్టం లేక..

"అలాగే రా.. " అన్నాడు కొంత తృప్తి గా..

ఒక ఇన్విటేషన్ ప్రిపేర్ చేసి తన దగ్గరి చుట్టాలకు పంపించాడు నరసింహ వాట్సప్ లో.. ఫోన్స్ కూడా చేశాడు..

తన ఆరోగ్య పరిస్థితిని గురించి చెప్పి, అనుకోకుండా కుదిరిన సంబంధం అని.. కార్డ్స్ ఇవ్వడానికి వీలు కావడం లేదని.. చెప్పాడు..

అర్ధం చేసుకుని వస్తామన్నారు కొందరు.. ఇంత హడావుడిగా పెళ్లి ఏంటి? ఒకవైపు ప్రాణాలతో పోరాడి.. అని ఇంకొందరు చెవులు కొరుక్కున్నారు.

చుట్టు పక్కల వారు కూడా గుసగుసలు మొదలుపెట్టారు.. విక్రమ్ వాళ్ళు ఇంటికి వచ్చి వెళ్ళాక..

*****

"హేయ్ వాట్సప్ మాన్.. పూర్తిగా మర్చిపోయారు అయితే సర్ నన్ను..." అన్నాడు ఉరుములేని వాన లా వచ్చిన శ్రావణ్, విక్రమ్ బెస్ట్ ఫ్రెండ్ అండ్ ప్రియ వాళ్ళ అన్నయ్య..

"ఒరేయ్ ఏంట్రా సడన్గా ఇన్నాళ్ల తర్వాత.? అది కూడా ఎప్పుడు రానిది.. డైరెక్ట్ గా ఆఫీస్ కే వచ్చావు.." అన్నాడు ఫైల్స్ చూస్తున్న విక్రమ్ ఆశ్చర్యంగా ..

"ఎంతైనా మీలా మేము బెస్ట్ ఫ్రెండ్ ని మర్చిపోయే టైపు కాదులేరా.."

"ఏమైందిరా వచ్చి రాగానే నా మీద యుద్ధం ప్రకటించావు.. " అన్నాడు విక్రం నవ్వుతూ లేచి శ్రావణ్ ని దగ్గరికి తీసుకుని.

విక్రమ్ ని దూరంగా నెట్టేసి, "ఏహే.. పోరా.. నువ్వు చాలా మారిపోయావు.. నా చెల్లి చనిపోతే నేను కూడా పోయాను అనుకున్నావా.. మళ్లీ పెళ్లి చేసుకుంటున్నాననే విషయం కూడా నాతో చెప్పలేదు.." అన్నాడు శ్రావణ్ సీరియస్ గా..

ఓరినీ ఈ విషయం వీడికెలా తెలిసింది అని మనసులో అనుకొని..

"సడన్ గా జరిగిపోయింది రా.. ఎవర్ని పిలవలేదు.. అసలు నీకెలా తెలిసిందిరా?" అన్నాడు.

"ఎందుకు తెలిసింది అన్నట్లుగా అడుగుతున్నావ్.. ఎందుకురా నా దగ్గర దాయడం.. ప్రియ చనిపోయిన తర్వాత నేనే నిన్ను చాలాసార్లు అడిగాను కదా మళ్ళీ పెళ్లి చేసుకోమని... నువ్వు మళ్ళీ పెళ్లి చేసుకుంటే ఎక్కువ

ఆనందించే వాడిని కూడా నేనే అని నీకు తెలుసు కదరా.. అయినా ఎందుకురా నా దగ్గర దాచావ్.. " అన్నాడు శ్రావణ్ బాధగా.

"సారీ రా నిన్ను బాధ పెట్టాలని కాదు అనుకోని పరిస్థితుల్లో చేసుకోవాల్సి వస్తోంది.."

"నాకు తెలుసు ఆంటీ అంకుల్ నిన్ను చాలా ఫోర్స్ చేసి ఉంటారు.. అయినా వాళ్ళు గత మూడు ఏళ్లుగా బలవంత పెడుతూనే ఉన్నారు ఈసారి ఇంకా ఎక్కువగా ఏదో బెదిరించి ఉంటారు బామ్మతోకలిసి.. అంతేనా.." అన్నాడు శ్రావణ్ సీరియస్ గా చూస్తూ.

అవునన్నట్లు తలాడించాడు విక్రమ్..

“వాళ్ళు చెప్పేది కూడా నీ మంచి కోసమే.. కానీ నువ్వు పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకుని చాలా మంచి నిర్ణయం తీసుకున్నావు రా విక్కీ.. నేను ఎంత హ్యాపీగా ఉన్నానో మాటల్లో చెప్పలేను తెలుసా ఈ విషయం విన్నప్పటి నుండి.. నా అల్లుడికి కోడలికిఒక మంచి గిఫ్ట్ ఇస్తున్నావు.." అన్నాడు శ్రావణ్ సంతోషంగా.

"ఏమోరా నాకైతే ఇష్టం లేదు అంతగా.."

"అలా అనొద్దు విక్కీ.. చిన్నపిల్లలురా వాళ్ళు..

మమ్మీ లేదని ఎంత బాధ పడుతుంటారో తెలుసా.. స్కూల్లో ఫ్రెండ్స్ మాటిమాటికి వాళ్ళ మమ్మీ ల గురించి చెప్తూ ఉంటే, వీళ్ళకి మనసులో ఎంత బాధగా ఉంటుందో నీకు తెలుసారా.. అంత చిన్న పిల్లలు ఎంతగా మిస్ అవుతున్నారు తల్లి ప్రేమ ని.. ఊహించగలవా..?"

నిశ్శబ్దంగా ఉన్న విక్కీని చూసి హగ్ చేసుకుని..

"ఇంట్లో వాళ్ళ బలవంతం మీద అయిష్టంగా పెళ్లి చేసుకుని, ఒక అమ్మాయిని బాధ పెట్టొద్దు రా... నువ్వు అలాంటి వాడివి కాదని కూడా నాకు తెలుసు.. నువ్వు నా చెల్లిని ఎంతలా ప్రేమించి, ఎలా ఇష్టంగా పెళ్లి చేసుకున్నావో, అలాగే ఈ పెళ్లి కూడా చేసుకోవాలి.. తానే నా చెల్లి అనుకుంటాను నేను కూడా.. నువ్వు కూడా నీ ప్రియనే చూసుకో తనలో.. ప్రామిస్ చెయ్ నాకు తనను సంతోషంగాచూసుకుంటానని."

"సర్లేరా ఇప్పుడు అవన్నీ ఎందుకు.. నువ్వు చెప్పినట్లే చేస్తాలే గాని.. ఈ విషయం నీ చెవిలో వేసింది ఎవర్రా?"

"ఆంటీ అంకుల్.. ఇందాకే ఎయిర్పోర్టులో కలిశారు నా ఫ్రెండ్ కి సెండ్ ఆఫ్ ఇవ్వడానికి వెళ్తే.. ఊరకనే రారు కదా మహానుభావులు.. ఏంటి ఇంత సడన్గా వచ్చారని అడిగితే చెప్పారు.. తమరి కళ్యాణం గురించి.." అన్నాడు నవ్వుతూ అక్కడే చైర్ లో కూర్చుని.

"ఓహో.. అయితే వచ్చేసారా వాళ్లు కూడా.." అంటూ నవ్వి,

"ఎలా ఉన్నావ్ రా శ్రావణ్.. చాలారోజులైంది నిన్ను చూసి.. ఇంకేంటి సంగతులు?" అన్నాడు..

"నా సంగతుల సంగతి తర్వాత.. ముందు నీ పెళ్ళికి నేను రావాలా వద్దా ఇప్పటికైనా?"

" సింపుల్గా గుళ్లో దండలు మార్చుకోవడమేరా అంతే.. పెద్దగా ఏం చేయట్లేదు.. " అన్నాడు విక్రమ్ పెదవి విరుస్తూ.

"ఆహా.. అయితే నేను తిండి కరువై, తినడానికి వస్తాను అనుకుంటున్నావా లేక తాగడానికి వస్తానంటున్నా అనుకుంటున్నావా?

నాకు కావాల్సింది నువ్వు పెళ్లి చేసుకోవడం రా.. అది ఎలా చేసుకుంటే నాకేంటి రా?"

"సరే సరే బాబు.. నువ్వు రాకుండా ఎలా చెప్పు? నీ చేతులతో నువ్వే చేద్దువులే నా పెళ్లి " అన్నాడు కసిగా..

"అదీ.. అలా అన్నావ్ చక్కగా ఉంది.. ఇప్పుడు మా విక్కీ గాడివి అనిపించావురా.." అంటూ నవ్వి,

" సరే రా నాకు అర్జెంట్ పనుంది.. ఎయిర్పోర్ట్ నుంచి డైరెక్ట్ గా నీ దగ్గరికే వచ్చేసాను పెళ్లి మాట వినగానే కంగ్రాట్స్ చెప్పడానికి.. ఎనీవే కంగ్రాట్యులేషన్స్ రా.. లవ్ యు మై స్వీట్ హార్ట్.. ఆల్ ది బెస్ట్.." అంటూ మళ్ళీ విక్రం ని హగ్ చేసుకుని, బాయ్ చెప్పి వెళ్లాడు.

*****

“వచ్చారా.. రండి రండి కొడుకు అంటే ఎంత ప్రేమనో?” అంటూ దెప్పుతూ లోపలికి పిలిచింది అమెరికా నుండి వచ్చిన తన కొడుకు కోడల్ని రాజ్యలక్ష్మి.

తన భర్త వైపు, చూడండి మీ అమ్మ.. అన్నట్లుగా ఒక చూపు విసిరి, అత్తతో మాట కూడా మాట్లాడకుండా లోపలకు నడిచింది విసురుగా రోజీ..

“కొడుకును కని, భూమి మీద వదిలేస్తేనే సరిపోతుందా? వాడి బాగోగులు ఏంటి? వాడి భవిష్యత్తు ఏమవుతుంది ఏమీ అక్కర్లేదు? ఏం తల్లో ఏమో..” అంటూ అక్కడే హాల్లో కూర్చుంది కొడుకు ప్రక్కన.

ఆమెతో వాదులాడడం బురదలో రాయి వేయడం లాంటిది అని భావించిన రోజీ లగేజ్ పట్టుకుని తమ గదిలోకి వెళ్ళింది.

"ఎందుకమ్మా.. వచ్చి రాగానే మాతో గొడవ? నీకు ఎప్పుడూ దూరంగానే ఉంటాం కదా.. కనీసం ఎపుడో ఒకసారి వచ్చినప్పుడైనా కొడుకు,కోడలితో ప్రేమగా మాట్లాడొచ్చు కదా.." అన్నాడు కృష్ణ.

"మరి మీ కొడుకు మీద  మీ ప్రేమ ఏది రా?"

"ప్రేమ లేకుండానే పెళ్లి చేసుకోమని పోట్లాడామా ఇన్నేళ్లుగా.. ఏదో నువ్వు ఒక్కదానివే సాధించినట్లు చెప్తున్నావ్.. నేను ఎన్ని రకాలుగా వాడిని బెదిరించలేదు.. బుజ్జగించలేదు.." అన్నాడు.

"మీ ప్రయత్నాల వల్ల ఉపయోగం అయితే ఏం జరగలేదు. చివరికి నేను చేసిన నిరాహార దీక్ష కే వాడు కరిగిపోయాడు తెలుసా?" అంది రాజలక్ష్మి గర్వంగా.

"సరే అమ్మ.. నువ్వే సాధించావులే. మాకు కొడుకు మీద ఉన్న ప్రేమ కంటే నీకు నీ మనవడి మీద ఉన్న ప్రేమే ఎక్కువ..సరేనా హ్యాపీనా.." అంటు నవ్వి,

"ఇంతకు ఎక్కడ మీ గారాల మనవడు గారు.." అన్నాడు

"ఇంకా రాలేదు ఆఫీస్ నుండి.. వచ్చేస్తూ ఉంటాడు." అని గుమ్మం వైపు చూసింది..

*****

"ఇదిగోండి ఆంటీ.. మమ్మీ మీరు అర్జెంటుగా కుట్టమని ఇచ్చిన బ్లౌజులు కుట్టేసిందంట.. ఇచ్చి రమ్మని పంపింది నన్ను.." అంటూ సరాసరి వంటింట్లో ఉన్న రేణుక దగ్గరికి వెళ్లి బ్లౌజులు ఇచ్చి, కోపంగా హాల్ లో కూర్చున్న మధు వంకే చూస్తూ బయటకు వెళ్తుంటే,

"ఏమైందే నీకు? నేను ఇక్కడ ఉండగా నన్ను వదిలేసి అమ్మ దగ్గరికి వెళ్లి మాట్లాడుతున్నావ్.." అంది మధు ఆశ్చర్యంగా చూసి నవ్వుతూ.

“ఎక్స్క్యూజ్మీ ఎవరండీ మీరు.. నాకు పెద్దగా పరిచయం లేదే మీతో..” అంది కోపంగా.

“మమ్మీ.. దీనికి ఏమో అయ్యింది.. మెంటల్ హాస్పిటల్ కి తీసుకెళ్లాల్సిందే..” అంటూ నవ్వుతున్న మధుని కోపంగా చూసి, ఆవేశంగా దగ్గరికి వెళ్ళి, మధు పీకను పిసుకుతూ,

" ఎవరికే పిచ్చి.. నువ్వే మెంటల్.. మెంటల్ కాదు మతిమరుపు అనుకుంటా.. అందుకే చిన్నప్పటినుండి బెస్ట్ ఫ్రెండ్ అయినా నన్ను నీ పెళ్లికి పిలవట్లేదు.. కనీసం పెళ్లి గురించి మాట మాత్రం అయినా చెప్పలేదు నాకు.. అందుకే నీ ఫ్రెండ్ షిప్ కటిఫ్ ఈరోజుతో.." అంది.

“హో.. అదన్నమాట మేటర్.. అనుకుని ఛా.. అదేం లేదే.. సారీ..నీకు చెబుదామనే వద్దామనుకున్నాను ఇంటికి.. అంతలోనే నువ్వే వచ్చావు.”

“అవునా సంతోషించాం లే.. రెండు రోజుల్లో పెళ్లి పెట్టుకొని ఎప్పుడు చెప్తావ్ ఇంకా?షాపింగ్ కూడా చేసేసావు నన్ను తీసుకెళ్లకుండానే.. బ్లౌజులు కుట్టమని మా అమ్మకి ఇచ్చి కూడా పెళ్ళి గురించి చెప్పలేదు.”

“అనుకోని పరిస్థితుల్లో అలా జరిగిపోయింది.. లేకపోతే నీకు చెప్పకుండా ఉంటానా?”

“అనుకోకుండా జరగడానికి అదేమైనా పిక్నికా.. పెళ్లి..” అంది సీరియస్గా చూస్తూ

“ఏదైనా సరే కొన్నిసార్లు అలా జరుగుతుంటాయి.. అంతే..”

“సరే ఇప్పుడు ఏంటి? ఇప్పుడైనా మీ హస్బెండ్ ని పరిచయం చేస్తున్నావా లేదా?ఆయన ఫోటో చూపిస్తున్నావా లేదా? పెళ్లికి పిలుస్తున్నావా లేదా?” అంటూ నాన్ స్టాప్ గా అరుస్తున్న కృతి మాటలకు,

చెవులు గట్టిగా మూసుకొని, “అమ్మా తల్లి.. దండం పెడతాను. తలనొప్పిగా ఉంది ఇప్పటికే..

నువ్ వస్తే తప్ప పెళ్లే చేసుకోను సరేనా..” అంటూ తన నోటిపై చెయ్యి అడ్డుగా పెట్టింది మధు.

ఓకే.. అంటూ తన బొటనవేలి పైకెత్తి చూపిస్తూ, తన నోటిపై ఉన్న మధు చేయిని తొలగించి, “ఇంతకీ అన్నయ్య ఫోటో ఏది? ముందది చూపించు..” అంది ఉత్సాహంగా.

సరే అంటూ యధాలాపంగా ఫోన్ తీసి ఫోటో చూపియ బోయి, లేటుగా గ్రహించింది మధు తన దగ్గర విక్రమ్ ది ఒక ఫోటో కూడా లేదని .

వెంటనే నాలుక కరుచుకుని, “సారీ నే ఫొటోస్ లేవు నా దగ్గర.. ఎల్లుండి డైరెక్ట్ గా చూపిస్తాను లే..” అంది నీరసంగా.

“అదేంటే ఫోటో కూడా లేకపోవడం ఏంటి? ఏ కాలంలో ఉన్నావు ఇంకా?”

“చెప్పాను కదా ఏదో హడావుడి పెళ్లి.. అడ్జస్ట్ అయిపో బేబీ.. నేనవ్వట్లేదా?” అంది.

“ఇంతకీ ఏం చేస్తుంటారు.. చాలా రిచ్ అని విన్నాను ఇరుగుపొరుగు మాటల్లో. ఏదో కంపెనీకి సీఈఓ అని కూడా విన్నాను.. నిజమేనా లేక అన్నీ కోతలా?”

“నువ్వు విన్నది నిజమే..” అంది మధు కూల్ గా.

“అవునా అయితే ఏదో కొత్త కంపెనీ స్టార్ట్ చేసి ఉంటాడు అంతేనా..”

“లేదు వాళ్ళ తాతయ్య వాళ్ళ కంపెనీ చాలా ఏళ్లుగా ఉంది.”

“అవునా ఇంతకీ కంపెనీ పేరు ఏంటి?”

“రాజ్యలక్ష్మి సొల్యూషన్స్..”

“ఏంటే.. అది చాలా ఫేమస్ కదా. అండ్ నువ్వు జాబ్ చేసేది కూడా అక్కడే కదా..” అంది ఆశ్చర్యంగా.

“అవును అక్కడే.”

“హే మధు నిజమా.. చాలా లక్కీ అయితే నువ్వు. ఏంటే లవ్ మ్యారేజా ఏంటి కొంపతీసి.. నాతో ఏమి చెప్పలేదు కదా.. దిస్ ఈజ్ టూ మచ్..అరేంజ్డ్ ఏమో సడన్గా జరిగినట్లుంది అనుకున్నా.. కానీ ఇప్పుడు డౌట్ కొడుతుంది.. లవ్ మ్యారేజ్ ఏమో అని..” అంది కోపంగా..

“ఛా.అలా ఏం కాదే.. నువ్వు కూడా అర్థం చేసుకోపోతే,ఇంకా నన్ను ఎవరు అర్థం చేసుకుంటారు చెప్పు..” అంది డల్ గా.

“తను ఇంతవరకు మాకే ఏది సరిగా చెప్పలేదు రా.. వాళ్ళ డాడి ఆపరేషన్ కోసం మనీ హెల్ప్ చేశారని చెప్పింది..అంతే..” అంది రేణుక.

“ఏమన్నా నీకు ఇష్టం లేకుండా అయితే జరగట్లేదు కదా ఇదంతా..” అంది కృతి అనుమానంగా చూస్తూ.

“అదేం లేదు లేవే.. నువ్వు నీ అనుమానాలు పక్కన పెట్టి.. రేపు మెహందీ పెట్టడానికి రా.. అలాగే ఈరోజు సాయంత్రం వెళ్లి కొంచెం షాపింగ్ చేద్దాం. ఓకేనా..” అంటూ నవ్వింది మామూలుగా ఉండడానికి ట్రై చేస్తూ.

“అయితే ఓకే.. కానీ ఒక కండిషన్ మీ ఆయన కంపెనీలో నాకు ఉద్యోగం ఇప్పించాలి..” అంది కన్ను కొడుతూ.

“ఊరుకోవే..నీ టాలెంట్ కి ఏ రికమండేషన్ అవసరం లేదు.. జాబ్ కంపల్సరీ దొరుకుతుంది ఎక్కడైనా..” అంది మధు.

“ఇపుడు ఏంటి? మీ ఆయనతో మాట్లాడి ఇప్పించవా? ఏంటి తప్పించుకుంటున్నావా? డబ్బు రాగానే మారిపోతారే మీరు..?” అంది సరదాగా..

ఏ పోవే నువ్వొకత్తివి.. అని మొట్టికాయ వేసి అలాగే చెపుతాలే సరేనా అంది.

“అదీ.. అలా అన్నావు బాగుంది..” అంటూ వెళ్ళింది మళ్ళీ వస్తానని.

"తెల్లవారితే పెళ్లి పెట్టుకుని ఈరోజు ఆఫీస్ కి వెళ్లడమేంటమ్మా.. అది కూడా మీ కంపెనీ నే కదా.. అల్లుడికి నువ్వు చెప్పలేవా?" అంది రేణుక మధు తల నిమురుతూ.

"అర్జెంటు లేకపోతే ఆయన ఎందుకు రమ్మంటారమ్మా.. నేను పర్సనల్ సెక్రెటరీ ని ఆయనకి.. ఆయన మీటింగ్ షెడ్యూల్స్ అన్ని నా దగ్గరే ఉంటాయి.. పెళ్లయ్యాక వెంటనే వెళ్లడం వీలు కాదు కదా కొన్నాళ్లపాటు.. ఆయనకు ఇబ్బంది అవుతుంది.. అందుకే అవన్నీ ఎక్స్ప్లయిన్ చేసి టెంపరరీగా ఎవరికైనా అప్పగించడానికి వెళ్తున్నాను.. త్వరగానే వచ్చేస్తానని చెప్పాను కదా.."

"అలాగే తల్లి.. కానీ కనీసం బాబు వచ్చి నిన్ను కారులో తీసుకెళ్లొచ్చు కదా.. ఎలాగో కాబోయే భార్యవే కదా..ఎప్పటిలాగా క్యాబ్ లో వెళ్లడం దేనికి?"

"అమ్మో సర్ కి చాలా పనులు ఉంటాయి.. నాకోసం ఇంత దూరం వచ్చి ఆఫీస్ కి తీసుకెళ్లడం అంటే కష్టం. అయినా మనం మొదటి నుండి కష్టపడ్డ వాళ్ళమేగా.. సడన్గా లగ్జరీ లైఫ్ నేనేమీ కోరుకోను.."

"సరే సరే..మరి తొందరగా వచ్చేయ్ జాగ్రత్త.."

*****

“సార్ తో పెళ్లి అనుకున్నప్పటినుండి ఇప్పటి దాకా ఆఫీస్ కి వెళ్ళలేదు.. ఎందుకో అక్కడికి వెళ్లాలంటేనే భయంగా ఉంది. అందరూ ఏం మాట్లాడుకుంటున్నారో మా గురించి? ఇలాంటి ఆర్డినరీ అమ్మాయిని అంత రిచ్ అయిన సర్ పెళ్లి చేసుకోవాలనుకోవడం అది కూడా ఇంత సడన్గా.. వాళ్ళని ఎలా ఫేస్ చేయాలో కూడా అర్థం కావట్లేదు.." అనుకుంది కంగారుగా మధు.

కానీ ఈ మంత్ చాలా ముఖ్యమైన మీటింగ్స్ ఉన్నాయి.. అవన్నింటి గురించి డీటెయిల్స్ చెప్పడం తనకి చాలా అవసరం.. అందుకే తను రమ్మనగానే వెళ్లడానికి రెడీ అయింది. కానీ లోపల మాత్రం ఒకటే కంగారుగా ఉంది.

లోపలికి అడుగుపెట్టగానే అందరూ గుమిగూడి ఉన్నారు ఆఫీస్ లో..

ఏదో గొడవ జరుగుతున్నట్లుగా మాటలు అరుపుల్లా మారి వినిపిస్తున్నాయి..

అందులో ఒక గొంతు శాస్త్రి ది అయితే మరొక ఆడ గొంతు వినిపిస్తుంది..

శాస్త్రి అంత గట్టిగా అరవడం ఎప్పుడూ చూడలేదు. ఈ  నెల రోజుల్లో..

ఏమై ఉంటుంది అనుకుని లోపలికి వెళ్లి చూసింది మధు..

అందరూ పక్కకు జరిగి మధు వంకనే చూస్తూ గుసగుసలాడుకుంటున్నారు..

శాస్త్రి పక్కన నిలబడి శాస్త్రి తో ఆర్గ్యూ చేస్తున్న అమ్మాయి చాలా మోడరన్ లుక్ తో, వెస్టన్ డ్రెస్ లో, చాలా పోష్ గా ఉంది. ఇంతవరకు తనని ఆఫీసులో అయితే చూడలేదు.

గొడవ పడుతున్నదల్లా మధు రాగానే ఆగి, మధువంక చూసి "ఈవిడనేనా నా విక్కీపెళ్లి చేసుకునేది.." అంది శాస్త్రి వంక కోపంగా చూస్తూ..

అప్పటికి గాని మధుని గమనించని శాస్త్రి, వెనక్కి తిరిగి మధు వంక చూసి నిట్టూర్చాడు.

మధు కి ఏం అర్థం కావట్లేదు అసలు ఏం జరుగుతుందో?

"ఏంటే.. అసలు ఏముంది నీ దగ్గర? నిన్ను పెళ్లి చేసుకోవడం ఏంటి విక్కీ.. ఐదేళ్లుగా అతని దగ్గర సెక్రటరీగా పని చేశాను..ఎంత కోపరేట్ చేశాను..?

తన భార్య చనిపోయాక నువ్వంటే నాకిష్టం.. నన్ను పెళ్లి చేసుకోమని ఎన్నిసార్లు అడిగాను? నా భార్య తప్ప నా మనసులో ఎవరు లేరు.. నేను పెళ్లే చేసుకోను అని పెద్ద పెద్ద కబుర్లు చెప్పిన పెద్ద మనిషి ఇప్పుడు నిన్నెలా చేసుకుంటున్నాడు పెళ్లి? " అంటూ విరుచుకు పడింది మధు మీద..

అనుకోకుండా రేగిన తుఫానులా, జరుగుతున్న గొడవకి ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా నిలుచుంది మధు.

"ఎలా పడేసావే అసలు? ఏం మాయ చేసావే నా విక్కీని? నేను ఊరికే పెళ్లి చేసుకోమని అడుగుతున్నానని, ఏదో వంక పెట్టి నన్ను ఉద్యోగంలో నుంచి పీకేశాడు.. నన్ను పీకేయగానే నువ్వు వచ్చి జాయిన్ అయ్యావు నా ప్లేస్

లో.. నెల రోజులు కూడా కాలేదు నువ్వు వచ్చి.. నీతో పెళ్లికి రెడీ అయ్యాడుగా..ఇప్పుడు నాకు తెలియాల్సింది నాలో లేనిదేంటి నీలో ఉన్నదేంటో?"

పిచ్చి పట్టినట్లుగా అరుస్తున్న ఆమె గొంతుకి భయపడి, అందరూ మౌనంగా సినిమా చూస్తున్నట్లుగా చూస్తూ నిలబడిపోయారు.

మధుకి ఇదంతా చాలా చిరాకుగా ఉంది. కానీ ఎలా ఫేస్ చేయాలో అర్థం కావట్లేదు..

అప్పుడే అక్కడికి వచ్చిన విక్రమ్, కోపంగా ఆమె చేయి పట్టుకుని లాక్కెళ్లి పోయాడు తన క్యాబిన్ లోకి..

విక్రమ్ వెనకాలే శాస్త్రి కూడా ఆ రూమ్ లోకి వెళ్ళాడు.

మధుకి అందరి ముందు చాలా అవమానంగా అనిపించింది..

అక్కడ నిలబడి వాళ్ళందరి మొహాలు చూడలేక తన క్యాబిన్లోకి వెళ్లి డోర్ వేసుకుంది.

*****

“ఏయ్..రీటా.. నీకేమైనా పిచ్చా ఏంటిదంతా.. నాన్సెన్స్..” అన్నాడు విక్రమ్ కోపంగా తన వంక చూస్తూ.

"ఇన్నేళ్లుగా నేను నచ్చనప్పుడు, హఠాత్తుగా ఇంకొక అమ్మాయి నీకు ఎలా నచ్చుతుంది? నాలో లేనిది, దానిలో ఉన్నదేంటి? నాకు ఇప్పుడే తెలియాలి.." అంది కోపంగా.

"ఏంటే నీకు తెలిసేది? నాకు తిక్క రేగితే నాలోని అస్సలు విక్రమ్ బయటికి వస్తాడు.. తెలుసు కదా నీకు.." అన్నాడు పిడికిలి బిగిస్తూ.

"సార్ మీరు ఆగండి.. కోపం తెచ్చుకోకండి.. నేను డీల్ చేస్తాను.." అంటూ ఆపాడు శాస్త్రి.

ఇద్దరి వంక కోపంగా చూస్తూ,

"చూస్తాను నేను కూడా.. ఎలా జరుగుతుందో ఈ పెళ్లి.. నన్ను వాడుకుని మోసం చేసి ఇప్పుడు ఇంకొక పెళ్లి చేసుకుంటున్నావని కంప్లైంట్ ఇస్తాను పోలీస్ స్టేషన్ లో.."అంది.

అంతే ఇక ఆ మాటకి చెంప చెల్లుమనిపించాడు విక్రమ్. అసలే తెల్లగా ఉన్న ఆ అమ్మాయి చెంప ఎర్రగా కందిపోయింది.

"ఏయ్ పిచ్చా నీకేమైనా? ఏం వాగుతున్నావ్ బతకాలని లేదా?" అంటూ తనని బయటకి లాక్కునితీసుకెళ్ళాడు శాస్త్రి బలవంతం గా.

చెంప పై చేయి అడ్డు పెట్టుకుని వెనక్కి వెనక్కి తిరిగి విక్రమ్ వంకే చూస్తూ బయటకి వెళ్ళింది రీటా.

కంపెనీ గేట్ అవతలి వరకు లాక్కెళ్లి బయట వదిలేసి,

"ఇంకోసారి సర్ జోలికి వస్తే నువ్వు వెళ్ళేది పోలీస్ స్టేషన్ కే.. జాగ్రత్త.." అంటూ బెదిరించి లోపలికి వెళ్ళాడు శాస్త్రి.

*****

అసలు అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాక అయోమయంగా చూస్తున్న మధు దగ్గరికి వెళ్ళాడు శాస్త్రి.

"ఏం కంగారు పడొద్దు మధు.. ఆమె నీకంటే ముందు సార్ దగ్గర పనిచేసిన రీటా. ఆమెకి సార్ అంటే పిచ్చి.. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని

వెంటపడింది. సార్ కి అలాంటివేవీ ఇష్టం ఉండదు.టార్చర్ భరించలేకే తీసేసారు జాబ్ నుండి.. తర్వాతే నువ్వు జాయిన్ అయ్యావు.. అంతకుమించి ఏమీ లేదు.. నువ్వు ఏం భయపడొద్దు ఓకేనా.." అంటూ చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

ఏంటి ఇది హడావుడిగా ఏదేదో చెప్పి వెళ్ళిపోయాడు. చాలా అడుగుదామనుకున్నాను..అనుకుని, మళ్ళీ అంతలోనే, "అయినా నాకెందుకు ఇదంతా.. రెండు సంవత్సరాలు ఉండి పోయేదాన్ని.. ఆయనని ఎవరు ప్రేమిస్తే నాకేంటి.." అనుకొని తన పనిలో తను పడిపోయింది మధు.

"సార్ షెడ్యూల్స్ అన్ని శాస్త్రి సార్ కి ఎక్స్ప్లెయిన్ చేశాను.. ఇంక నేను వెళ్లొచ్చా ఇంటికి? " అడుగుతున్న మధు వంక చూసి,

యా.. ష్యూర్ వెళ్లొచ్చు మధు.. అంటూ చెప్పి,

"రేపు గుడికి వచ్చేయండి డైరెక్ట్ గా మీ అమ్మ నాన్నలను తీసుకుని.." అన్నాడు సింపుల్ గా.

"అలాగే సర్.. కాకపోతే నాన్న కొంతమంది దగ్గరి చుట్టాలని పిలిచారు.. వాళ్ళు కూడా వస్తారు పెళ్లికి."

"అదేంటి ఎవరిని పిలువొద్దని చెప్పాను కదా.

నేనే పిలవలేదు ఎవరిని.. చివరికి నా పేరెంట్స్ నీ కూడా రావద్దని చెప్పాను.. నువ్వేంటిలా? ఇలాంటి పెళ్లి గురించి ఎంత తక్కువ మందికి తెలిస్తే అంత మంచిది తెలీదా నీకు?" అన్నాడు కోపం గా..

అతని కోపం చూసి భయం వేయలేదు మధుకి.ముందేఎక్స్పెక్ట్ చేసింది కాబట్టి..

"మా నాన్నకి నా పెళ్లి గొప్ప గా చేయాలని కోరిక సర్.. ఐనా గుళ్ళో పెళ్లి కి ఒప్పించాను. కానీ కనీసం దగ్గరివాళ్ళని కూడా పిలవకుండా అంటే.. ఆయన ఒప్పుకోలేదు.. అందుకే తప్పలేదు.. ఏది ఏమైనా జరిగే నష్టం అయితే నాకే కదా. వదిలేయండి. " అంటూ వెళ్ళిపోయింది.

“ఏంటి ఈ అమ్మాయి? చాలా మారిపోయింది. వామ్మో జాగ్రత్త గా ఉండలిరా విక్కి..” అనుకున్నాడు విక్రమ్.

*****

" ఏంటి ఇంత సడెన్ గా పెళ్లి అని ఫోన్ చేశారు?లవ్ మ్యారేజ్ ఆ? "వచ్చి రాగానే నిలదీశాడు మాధవ్ తండ్రిని.

"ఏదైతే ఏంటి రా? మంచి సంబంధం ఐతే చాలు కదా.." అన్నాడు నరసింహ నెమ్మదిగా.

"అవునవును.. కూతురు విషయానికి వచ్చేసరికి ఏం చేసినా కరెక్టే అనిపిస్తుంది. అదే నన్నయితే ఎన్ని మాటలు అన్నావ్ అప్పుడు?" అంటూ వాదన మొదలుపెట్టాడు.

"అప్పటి పరిస్థితి వేరు.. ఇప్పటి పరిస్థితి వేరు. అయినా అదేం నాకు చెప్పా పెట్టకుండా వెళ్లి పెళ్లి చేసుకొని రావట్లేదు. నాకు చెప్పే, అన్ని మాట్లాడే, నా చేతుల మీదుగానే పెళ్లి చేసుకుంటుంది. నిన్ను ఆరోజు తిట్టింది కూడా లవ్ మ్యారేజ్ ఎందుకు చేసుకున్నావు అని కాదు కనీసం నా చేత్తో అక్షింతలు కూడా వేయలేకపోయానని బాధతో." అన్నాడు.

నాన్నా.. ఎందుకు అనవసరంగా ఇప్పుడు ఆవేశపడుతున్నావు? అన్నయ్యా, వదినా జర్నీ చేసి అలసిపోయి ఉంటారు.. మీరు ఫ్రెష్ అప్

అయ్యి రండి. బోంచేద్దురుగానీ.. అన్ని తర్వాత మాట్లాడుకుందాం అంది మధు సర్ది చెప్తూ.

మూతి తిప్పుతూ కావ్య, కోపంగా చూస్తూ మాధవ్ లోపలికి వెళ్ళారు.

తండ్రి, ప్రాణాలతో పోరాడి వచ్చాడని తెలిసి కూడా, అతని ఆరోగ్యం గురించి అడగకుండా, ఇలా వాదనలు చేయడం చూసి చాలా బాధేసింది రేణుక కి.

కానీ ఏం మాట్లాడలేక మౌనంగా తలవంచుకుంది.

*****

పెళ్లికి వచ్చిన కొంతమంది బంధువులను, మాధవ్ వాళ్ళని తీసుకుని గుడికి వెళ్లారు మధు పేరెంట్స్.

విక్రమ్ పేరెంట్స్, బామ్మ తో కలిసి ఇంటి దగ్గర నుంచి బయలుదేరాడు.

రాజేశ్వరి ముందే చెప్పి ఉంచడంతో, వీళ్ళు వెళ్ళేటప్పటికే గుళ్లో అన్ని ఏర్పాట్లు చేసి ఉంచారు. సింపుల్గా అయినా చాలా చక్కగా అలంకరించారు పెళ్లి మండపం నుండి ప్రతి ఒక్కటి.

పెళ్లి కూతురికి పెళ్లి కొడుక్కి ఎవరికి ఇచ్చిన గదులలో వారి వాళ్ళు ఉన్నారు.

తన గదిలోకి వెళ్ళగానే గబుక్కున తలుపు వేసుకొని,శాస్త్రికి ఫోన్ చేశాడు విక్రమ్.

“ఎక్కడున్నావ్ శాస్త్రి? వస్తున్నావా లేదా?”

“నేనెందుకు సర్ మధ్యలో.. ఎవరూ లేకపోతే ఆఫీసులో పనులు ఎలా అవుతాయి..”

"ఒక గంట నువ్వు ఆఫీసులో లేకపోతే ఆఫీసునెవ్వడు ఎత్తుకెళ్లడు.. ఇక్కడ అసలే అందరూ ఇది నిజమైన పెళ్లిగా ఫిక్స్ అయిపోయారు. ఆ మధు ఏమో ఎవ్వరిని పిలవద్దంటే చుట్టాలని వెంటేసుకుని మరీ వచ్చింది. "

"ఇది కాంట్రాక్టు పెళ్లి అని తనకి నాకు కాకుండా తెలిసిన వ్యక్తిని నువ్వు ఒక్కడివే.. నువ్వు ఖచ్చితంగా రావాలి.. ఎప్పుడు పక్కకే ఉండాలి నువ్వు నాకు.."

"ఏంటి సార్ మీరు మరీను? ప్రతి దానికి డౌట్ పడతారు.."

"అవును మరి నా భయాలు నావి.. నువ్వు ఒక్కడివేగా ఈ విషయం గురించి తెలిసిన వాడివి.."

"పోనీ ఇంకో ఇద్దరికీ చెప్పేదామా సార్.. అప్పుడు మీకు ధైర్యంగా ఉంటుంది.."

"ఏంటి వెటకారమా? నోరు మూసుకొని తొందరగా వచ్చేయ్."

"వస్తున్నాను సర్.. ఇప్పుడే వస్తున్నాను.."

*****

విక్రమ్ మనసులో ఏమీ లేదు.అంతా బ్లాంక్.

ఇది కేవలం ఒక యాక్టింగ్ మాత్రమే అతని వరకు.. అందుకే ఎటువంటి ఉద్వేగాలు లేవు మనసులో..

కానీ మధు మనసులో అనేక రకాల ఉద్వేగాలు కలిసిపోయి అలజడిని సృష్టిస్తున్నాయి.

తన తల్లి కళ్ళల్లో కనబడే ఆనందం, తన తండ్రి మొహంలోని మెరుపు చూస్తుంటే ఏదో తప్పు చేస్తున్న ఫీలింగ్ తనని దహించి వేస్తోంది.

మరోపక్క విక్రమ్ ని చూస్తుంటే తనని పెళ్లి చేసుకుంటున్నాను అనే ఫీలింగ్ అనేది ఏదో తెలియని ప్రేమని అతని పట్ల కలిగిస్తుంది. ఎంత వద్దనుకుంటున్నా లోపల ఎక్కడో ఆ భావన తన నుంచి దూరం కావట్లేదు.

"పెళ్లి కూతుర్ని తీసుకురండి.." అని పిలుపు వినగానే మధునితన వదిన కావ్య, తన బెస్ట్ ఫ్రెండ్ కృతి కలిసి తీసుకుని వచ్చారు.

తను కొన్న పట్టు చీరలో పెళ్లికూతురులా ముస్తాబై తన పక్కన వచ్చి కూర్చున్న మధుని చూసి కొంచెం బాధ కలిగింది విక్రమ్ కి.

తన అవసరం కోసం అమాయకురాలైన ఒక అమ్మాయి ఫీలింగ్స్ తో ఆడుకుంటున్నాడా? అనే ఫీలింగ్ కలిగింది.

కానీ తనేది కావాలని చేయడం లేదని ఆమె అవసరం ఆమెది..నా పరిస్థితి నాది.. అని మళ్ళీ తనకు తాను సర్ది చెప్పుకున్నాడు.

పెళ్ళికొడుకు గెటప్ లో ఉన్న విక్రమ్ ని చూసి చూపు తిప్పుకోలేకపోయింది మధు.

ఇద్దరి కళ్ళు రెండు క్షణాలు కలుసుకున్నాయి.. ఆ కళ్ళల్లో ఏదో తెలియని భావం.

ఒకరికొకరు సహాయం చేసుకునే మిత్రుల్లా, చిరునవ్వు నవ్వుకుని కూర్చున్నారు.

చుట్టూ ఉన్న వాళ్లకి ఇదంతా డ్రామా అని తెలియదు కాబట్టి భావోద్వేగాలతో సంతోషోత్సాహాల మధ్య ఒక వేడుకగా జరిపించారు.

చూసేవాళ్ళకి చూడ చక్కని జంట కి జరిగిన అద్భుతమైన కళ్యాణం అది.

చేసుకునే వాళ్ళకి మాత్రం అది ఒక బొమ్మల పెళ్లి మాత్రమే.

కాని ఆ విధాత దృష్టి లో మరి ఇదేంటో?

*****

పెళ్లి పూర్తయ్యాక, అందరూ ఫొటోస్ దిగాక,

విక్రం పిల్లలు ఇద్దరు మధు చేయి పట్టుకుని వదలట్లేదు అసలు. మధు వాళ్లకి బాగా నచ్చేసింది అని అందరికీ అర్థం అవుతుంది వాళ్ళ మొహాలు చూడగానే. కాని విక్రమ్ అది గమనించలేదు.

"చెల్లి నిజంగా నా చెల్లి లానే ఉంది విక్కి..పెళ్లంటేనే తిట్టేవాడివి.. నీ అంతట నువ్వే పెళ్లి చేసుకుంటున్నావు.. అంటే మొదట ఆశ్చర్యపోయాను. కానీ ఇప్పుడు ఈ మధుని చూశాక నిజంగా నాకు నమ్మకం వచ్చింది. పైనుండి నా చెల్లెలే ఈ చెల్లిని పంపిందేమో.. తన భర్తని, పిల్లల్ని బాగా చూసుకోమని.. చూడు పిల్లలిద్దరు తన చేయిని వదలట్లేదు.." అని శ్రావణ్ చెప్పే వరకు విక్రమ్ గమనించనేలేదు.

పిల్లలు మధు చుట్టూ చేరిపోయి ఆమె చీరని ఒకరు,ఆమె చేయి మరొకరు పట్టుకునే ఉన్నారు.

ఒక్క క్షణం గుండె బరువుగా అనిపించింది విక్రమ్ కి.

ఒక్క సమస్యని అధిగమించడానికి మరిన్ని సమస్యలు కొని తెచ్చుకుంటున్నానా?అనుకున్నాడు తలపట్టుకుని..

*****

అత్తారింట్లో తన తొలి అడుగు మోపడం ప్రతి అమ్మాయికి కొత్త అనుభవం...

అనేక సందేహాలు, కొత్త కొత్త ఆశలు, ఎన్నో భయాల మధ్య ఒక కొత్త కుటుంబంలో, శాశ్వతంగా ఉండటానికి వెళ్లే సగటు ఆడపిల్ల అంతరంగంలో ఆ క్షణం లో రేగే అలజడులు ఎన్నో..

కానీ కేవలం రెండు సంవత్సరాల కోసంమాత్రమే ఉండటానికి వచ్చిన తను ఏ భయం లేకుండా హాయిగా ఉండాలా లేక ఈ ఇల్లు, ఈ బంధాలు అన్ని నామ మాత్రమే అని బాధపడాలా ఏమీ అర్థం కాని డోలాయమానస్థితిలో అత్తారింట్లోకి అడుగు మోపింది మధు.

లోపలకు అడుగు పెట్టి పెట్టగానే, “పదమ్మా దేవుడి దగ్గర దీపం పెట్టాలి. పూజ చేయాలి. దేవుడికి నైవేద్యం పెట్టాలి నీ చేతితో వండి. ఇంకా చాలా పనులు ఉన్నాయి నీకు.ఈ ఇంట్లో ఇంతవరకు నా తర్వాత వచ్చిన ఏ కోడలు కూడా పూజలు చేయడానికి రాలేదు. కనీసం నువ్వైనా ఆ బాధ్యత తీసుకో..” అంటూ మొదలుపెట్టిన రాజేశ్వరి మాటలు నవ్వు తెప్పించాయి ఓవైపు మధుకి.

పాపం పెద్దావిడ.. ఎన్ని ఆశలు పెట్టుకున్నారో నా మీద అని అంతలోనే బాధపడి,కనీసం తను ఉన్న ఈ రెండేళ్లయినా అందరిని ఆనందంగా ఉంచడానికి ప్రయత్నిస్తాను అనుకుంటూ పూజ గదిలోకి అడుగుపెట్టి దేవుడికి దండం పెట్టింది..

ఈ రెండేళ్లు నావల్ల ఎవరు బాధపడకుండా ఉండేలా చూడు దేవుడా..అలాగే మా నాన్న ఆరోగ్యం బాగై ఆయురారోగ్యాలతో ఉండేలా చూడు అని మొక్కి నైవేద్యం పెట్టింది దేవుడికి సంతృప్తిగా.

"వచ్చి రాగానే మీ అమ్మ చాదస్థంతో ఆ పిల్లని బెంబేలెత్తిస్తోంది పాపం..నేను ఆవిడ చెప్పినట్లు పూజలు చేయలేదని, అన్నీ కలిపి ఒకేసారి ఆ పిల్లతో చేయించొద్దని చెప్పండి.ఆమె ఎక్కడికి పోదు. జీవితాంతం ఇక్కడే

ఉంటుంది. కాబట్టి నెమ్మదిగా చేయించుకోమనండి ఆ వ్రతాలు, పూజలన్ని.." అంది రోజీ వెక్కిరిస్తునట్లుగా.

"సరే సరేలే.. నువ్వు అమ్మ విషయాలలో జోక్యం చేసుకోకు. ఆవిడ ఇప్పుడే కాస్త సంతోషంగా ఉంది. ఆవిడ సంతోషాన్ని మనం ఎందుకు దూరం చేయాలి చెప్పు.. ఆవిడకు నచ్చినట్లుగా చేసుకోనివ్వు.." అన్నాడు అసహనంగా.

"ఆవిడ ఇష్టం ఆవిడదే కానీ.. ఎదుటి మనిషి ఇష్టాలను పట్టించుకోవద్దా?"

"ఆ అమ్మాయి కూడా ఇష్టంగానే చేస్తుంది కదా.. ఎందుకు అనవసరంగా నువ్వు దీన్ని ఇష్యూ చేస్తావ్.?"

"సరే మీ ఇష్టం.తల్లి దగ్గర కి వచ్చారంటే పూర్తిగా తన వైపే మారిపోతారు" అంటూ వెళ్ళింది కోపం గా.

*****

"బాబు విక్కీ.. రేపు మనింట్లో పూజ ఉంది. ఏర్పాట్లన్నీ నేను చూసుకుంటాను. కానీ ఎక్కడికి వెళ్లకుండా ఇంట్లో ఉండడం మాత్రం నీ బాధ్యత." అంది రాజేశ్వరి.

"ఇదిగో బామ్మ.. పెళ్లి చేసుకోమని పోరు పెట్టారు కాబట్టి చేసుకున్నా.. ఇంకా పూజలు, వ్రతాలు, నోములు అంటే నావల్ల కాదు. ముందే చెప్తున్నా. అవి ఏమైనా ఉంటే నువ్వు, ఆ అమ్మాయి ఇద్దరు కలిసి చేసుకోండి.."

"అదేంట్రా అలా అంటావ్ అమ్మాయిని పెళ్లి చేసుకుంది నువ్వా? నేనా?"

"నన్ను విసిగించొద్దు బామ్మ.. ఏం చేయాలనిపిస్తే అది చేసుకో.. కానీ మధ్యలోకి నన్ను లాగొద్దు."

"ఇది మరీ బావుంది. నువ్వు లేకుండా పూజ ఎలా చేస్తాం రా. సరే నీ ఇష్టం రా. నిన్ను ఇబ్బంది పెట్టదలుచుకోలేదు. కానీ సత్యనారాయణ వ్రతం మాత్రం ఖచ్చితంగా చేయాల్సిందే. నీకు గుర్తుందో లేదో నీ భార్య నాస్తికురాలు అని చెప్పినా కూడా, అప్పుడు వినకుండా పట్టుబట్టి మరీ కూర్చోబెట్టాను పూజలో. ఈ ఒక్క పూజలో కూర్చో.. ఇక నిన్ను నేను ఇబ్బంది పెట్టను."

"అబ్బా.. నీ మొండితనం నీదే కానీ ఎదుటి వాళ్ళ పరిస్థితి అర్థం చేసుకోవు కదా.. తాతయ్య ఎలా భరించాడో ఏమో నిన్ను.." అని విసురుగా తన గదిలోకి వెళ్ళిపోయాడు..

అప్పటికే తన గదిలో చీర మార్చుకుంటున్న మధుని చూసి, గబుక్కున మళ్ళీ బయటకు వచ్చేసాడు..

వెంటనే అటుగా వెళుతున్న పనిమనిషి గంగపై కేకలు వేసి, "బుద్ధుందా లేదా గంగా నీకు? మధుని నా రూమ్ లోకి ఎందుకు పంపించావ్?" అంటూ అరిచిన అరుపులకు భయపడి, అసలు ఏం అడుగుతున్నాడో కూడా అర్థం కాకుండా అయోమయంగా బిత్తర చూపులు చూస్తూ, ఈయన పెళ్ళాన్ని ఈయన రూమ్లోకి కాకుండా ఇంకెవరి రూమ్ లోకి పంపించాలి.. అనుకుని, అదీ అదీ.. పెద్దమ్మ గారే పంపించారు బాబు.. అంది గందరగోళంగా తడబడుతూ.

అప్పటికే గబగబా చీర మార్చుకుని, విషయం పెద్దది చేయకూడదని బయటకు వచ్చి, “మీరు లోపలికి రండి నేను మాట్లాడుతాను... అంటూ నువ్వు వెళ్లి పని చూసుకో గంగా..” అంది.

గది లోపలికి వెళ్లి కోపం గా తలుపులు వేసి, "ఏంటి ఏం అనుకుంటున్నావు అసలు? నేరుగా నా గదిలోకి వచ్చేసావ్.. ఫిక్స్

అయిపోయావా నిజంగానే మనకి పెళ్లయిందని.. " అంటూ అరుస్తున్న విక్కీ వంక చూసి,

"అసలు పదేపదే ఆ ప్రశ్న అడుగుతూ మీరు ఎందుకు ఫిక్స్ అవుతున్నారో నాకు అర్థం కావట్లేదు.. నేను చాలా క్లారిటీగా ఉన్నాను. రెండు సంవత్సరాల తర్వాత మీరు ఉండమన్నా ఒక్కరోజు కూడాఇక్కడ ఉండను. కానీ మీరు ఎవరి దగ్గరయితే ఈ విషయం దాచాలనుకుంటున్నారో వాళ్లకే తెలిసేలా మీరు ప్రవర్తిస్తే.. మీకేమి సమస్య లేదు అంటే నాకు కూడా అస్సలు ఇబ్బంది లేదు.." అంది నిదానంగా.

ఆ మాటకి తను ఏం చేయబోయాడో అర్థమై సైలెంట్ అయిపోయాడు.

"నాకు మీ గదిలో ఉండటం ఏం సరదా కాదు.. కానీ బామ్మ గారు చెప్పారు కాబట్టి వద్దని చెప్పలేదు.. పైగా ఉండను నాకు వేరే గది కావాలి అంటే అందరూ వింతగా చూస్తారు.. అందుకే నేను సైలెంట్ గా వచ్చి చాలా చిరాకుగా ఉండడం వల్ల, మీరు వచ్చేలోగా డ్రెస్ చేంజ్ చేసుకుందామనుకున్నాను. అంతే.. దానికి కూడా నేను సారీ చెప్తున్నాను."

"ఇట్స్ ఓకే మధు.. నేనే అనవసరంగా ఆవేశపడ్డాను అసలు ఆలోచన లేకుండా. అని కాసేపు ఆగి, ఏం చేద్దాం మరీ?దీనికి ఒక పరిష్కారం ఉంటే బాగుండేది కదా.. ఇద్దరం ఒకే గదిలో అంటే.." అంటూ కాస్త ఇబ్బందిగా మధు వైపు చూశాడు.

వాళ్ల ఇబ్బందిని తొలగిస్తూ డాడీ.. అంటూ పరిగెత్తుకుని వచ్చారు పిల్లలిద్దరు.

విక్రమ్ కి ఎదురుగాకాస్త దూరంలో నిల్చుని ఉన్న మధు వైపు చూసి, “అన్నయ్యా.. ఆంటీ కూడా ఈ రోజు నుండి మన గదిలోనే మనతోనే

ఉంటుంది కదా.." అంటూ సంబరపడుతూ, మధు దగ్గరికి వచ్చింది పాప ఆద్య.

"ఆంటీ అనకూడదు మమ్మీ అనాలి అని జేజి చెప్పింది కదా." అన్నాడు బాబు అద్విత్.

"అవును కదా మర్చేపోయాను.." అంటూ నాలుక కరుచుకుని మధుని హగ్ చేసుకుంది ఆద్య.

పిల్లలిద్దరి ముద్దు ముద్దు మాటలు వింటుంటే, వాళ్ళ క్యూట్ ఫేసెస్ చూస్తుంటే తన ఆలోచనల అలజడులు అవిరైపోయి, మనసంతా కొత్త ఉత్సాహంతో నిండిపోయింది మధుకి.

వాళ్ళిద్దరి నోటి నుండి మమ్మీ అనే మాట వినేసరికి నిజంగానే అమ్మయినంత ఆనందం కలిగింది మధు కి.

కానీ నిజంగా వాళ్ల ప్రేమకి అర్హురాలినేనా నేను అన్న ఆలోచన ఆమెని మళ్ళీ ఆలోచనలో పడేసింది.

*****

"నాన్నా విక్కీ.. పంతులు గారిని అడిగి మంచి ముహూర్తం పెట్టించాలి తదుపరి కార్యక్రమం కోసం.. అప్పటివరకు అమ్మాయి నా గది లోనే పడుకుంటుంది ఓకే నా.." అన్న బామ్మ మాటలు వింటుంటేనే ఏదోలా అనిపించింది విక్రమ్ కి..

ఛా.. ఎన్నాళ్ళో ఇవన్నీ భరించడం అనుకుని,

"సరే.. " అంటూ వెళ్లిపోయాడు ఎక్కువ సేపు ఉంటే తన మొహం లో చిరాకు ని కనిపెడుతుందని.

మధు కి కూడా కాస్త రిలీఫ్ గా అనిపించింది.

నవ్వుతూ బామ్మ గదిలోకి వెళ్ళింది తన బ్యాగ్ తీసుకుని.

పిల్లలు మాత్రం నిరాశ గా చూసుకున్నారు ఒకరి మొహం మరొకరు.

*****

బామ్మ పక్కన పడుకుందే గాని అసలు నిద్ర పట్టలేదు మధు కి. బామ్మ నిద్రపోకుండా ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉంది. తన చిన్నప్పటి నుంచి మొదలుపెట్టి, తన పెళ్లి, కాపురం, తన పిల్లలు ఇలా అన్ని చెప్తూనే పోతుంది. అన్ని మామూలుగా ఊ కొడుతూ వింటున్న మధుకి, విక్రం గురించి వినగానే చాలా ఆసక్తి వచ్చేసింది తనకు తెలియకుండానే..

ఏం చెప్తుందా అని చెవులు రిక్కించి మరీ వింటోంది.

ఎందుకో ఆయన గురించి తెలుసుకోవాలని తనకు అంత ఆసక్తి? అర్థం కాలేదు..

"విక్రమ్.. వాడు అచ్చం వాడి తాతయ్య పోలికే మధు. అందుకే వాడంటే నాకు అంత ఇష్టం. రూపంలోనే కాదు, గుణంలో,అలవాట్లలో, అభిరుచుల్లో అన్నిట్లో అచ్చం తాతయ్యలాగే.

వాళ్ళ తాత కి కూడా నేనంటే పిచ్చి. వాడు కూడా అంతే. భార్యను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించాడు.

వాడు ఒక మంచి భర్త. ఆ పిల్లని ఎక్కడ చూసి ఇష్టపడ్డాడో తెలియదు కానీ ఆ పిల్ల అంటే వాడికి ప్రాణం.

నేను చెప్పిన మాట ఏది వినలేదు ఆ పిల్ల..అని కాస్త నాకు కోపమే కానీ, ఆ పిల్ల మాత్రం బంగారు బొమ్మ. రూపంలోనే కాదు, గుణంలో,

సంస్కారంలో ఆ పిల్ల మేలిమి బంగారం. అందుకే వాడికి నచ్చింది అనుకుంటా.

ఏ విషయంలో అయినా నా మాట వినేవాడు మొదటిసారి ఆ పిల్లని పెళ్లి చేసుకునే విషయంలోనే నా మాట కూడా లెక్క చేయలేదు.

అంతలా ఆ పిల్ల వాడిని ప్రభావితం చేసింది. ప్రియ ఒక అనాధ. కానీ ఆమె ఎప్పుడూ అలా ఫీల్ అవ్వలేదు. ఎదురైన ప్రతి మనిషిని తన సొంత మనిషి లాగానే భావించేది. చిన్నప్పటినుండి ఒంటరిగా పెరిగింది కానీ ఒంటరిదానినని ఎప్పుడూ అనుకోలేదు. ఎందుకో ఆమెకు దేవుడి మీద నమ్మకం లేదు. మనుషులనే నమ్మేది. మనుషులనే ప్రేమించేదిహ మనుషులని మాత్రమే పూజించేది. ఆ ఒక్క విషయము నాకు నచ్చేది కాదు. దైవం లేదని ఎలా అనుకుంటాం? అంత నాస్తికత్వం ఎందుకు ఆ పిల్లకి?ఇంత మొండితనం ఎక్కడి నుండి వచ్చింది? పెద్దలు చెప్పిన మాటైనా విని మారొచ్చు కదా.. అని కోపంగా ఉండేది.

అంతకుమించి ఆ పిల్ల మీద నాకు ఎటువంటి ద్వేషం లేదు. అప్పుడప్పుడు కాస్త గొడవ పడేదాన్ని అయినా ఆ పిల్ల నవ్వుతూ ఆ గొడవని నవ్వులాటగా చేసేది. నాకు మరింత కోపం వచ్చేది. నా బాధ తను అర్థం చేసుకోవట్లేదు అని.

నేను కోపంలో నాలుగు మాటలు అన్నా నన్ను నవ్వించేది. నా కోపం పోగొట్టేది. కానీ విక్కీకి ఇవి ఏం చెప్పేది కాదు. చాలా మంచి పిల్ల. భగవంతుడు వాడికి అన్యాయం చేసి, ఆ పిల్లని తీసుకెళ్లిపోయాడు." అంటూ కళ్ళు తుడుచుకుంది గొంతు కూడుకు పోతుండగా.

"అమ్మమ్మా ఏడవద్దు.. ప్లీజ్. " అంటూ ఓదార్చింది మధు.

"నిన్ను చూస్తే అచ్చం ప్రియ ని చూసినట్లే ఉంటుంది. ఎత్తు,పొడవు, రంగు,రూపు దాదాపు అన్ని ఒకేలా ఉన్నాయి. కాకపోతే నువ్వు కాస్త నెమ్మది ప్రియా చాలా చురుకు. అంతే తేడా.. " అంటూ నవ్వింది బామ్మ స్వచ్ఛంగా.

బదులుగా చిన్న నవ్వు నవ్వి, "ఇంతకీ ప్రియా గారు ఎలా చనిపోయారు అమ్మమ్మా?"ఎప్పటినుండో తెలుసుకోవాలనుకున్నదల్లా అడిగింది మధు.

"యాక్సిడెంట్.. తనకి కారు నడపాలని చాలా కోరికగా ఉండేది. విక్కీ నేర్పించాడు కానీ తను ఇంకా పూర్తిగా నేర్చుకోలేదు.. సొంతంగా ఎప్పుడు కారు నడపలేదు తను. విక్రమ్ పక్కన ఉన్నప్పుడు నడిపేది.

ఆరోజు విక్కీ ఆఫీస్ కి వెళ్ళాడు. వాడు వెళ్లిన కాసేపటికే ఫోన్ వచ్చింది వాడికి యాక్సిడెంట్ అయిందని. వాడి ఫోన్లో నుండే ఎవరో మాట్లాడి చెప్పారు. వాడికి ఏమైందో అనే కంగారులో తనే కారు తీసుకుని వెళ్ళింది.

విక్కీ అంటే ప్రాణం తనకి. వాడికి ఏమైనా జరిగి ఉంటుందనే ఊహ కూడా తన తట్టుకోలేకపోయింది. ఆ టెన్షన్లో చూసుకోకుండా వేగంగా వస్తున్న లారీని గుద్దేసింది.. " ఇంకా ఆపై చెప్పలేక మౌనంగా అదుపు లేకుండా వస్తున్న కన్నీటిని తుడుచుకుంది లేచి కూర్చుని..

"నిజంగానే సార్ కి యాక్సిడెంట్ అయిందా అప్పుడు?" అంది కంగారుగా.

"అవును వాడి తలకి దెబ్బ తగిలి స్పృహ కోల్పోవడంతో ఎవరో ఫోన్ చేసి చెప్పారు. వాడిని వెంటనే హాస్పిటల్కి తీసుకెళ్లారు. వాడు బానే ఉన్నాడు. కానీ వాడి కోసం వెళ్లిన ప్రియా తన ప్రాణాలను కోల్పోయింది.

అది విని తట్టుకోలేకపోయాడు విక్కి. పిచ్చివాడైపోతాడని భయపడ్డాను. కానీ వాడి పిల్లలిద్దరూ వాన్ని మామూలు మనిషిని చేశారు.

వాళ్ల కోసమే వాడు నవ్వే వాడు. వాళ్లకి తినిపించడానికే తను తినేవాడు. వాళ్ళని చూసుకోవడానికే బ్రతుకుతున్నాడు. కానీ ఈరోజు వరకి వాడు మనస్ఫూర్తిగా నవ్వడం నేను చూడలేదు. కేవలం పిల్లల కోసమేజీవం లేని బ్రతుకు బ్రతుకుతున్నాడు.

అది చూసి తట్టుకోలేక వాడికి మళ్ళీ పెళ్లి చేయాలని పట్టు పట్టాను. నన్ను అసహ్యంగా చూశాడు ఆ మాట అన్నప్పుడు.

నీకు ప్రియా అంటే నచ్చదు అందుకే తన చనిపోయినా నీకు బాధ లేదు.. అన్నాడు.

ఇంకా చాలా అన్నాడు కానీ నేను పట్టించుకోలేదు. నాకు కావాల్సింది నా మనవడి మొహంలో మునుపటి నవ్వు.. దానికోసం నేను ఎన్ని మాటలు అయినా పడతాను. ఎన్ని బాధలైనా భరిస్తాను. దృఢంగా అంటూ, మధు చేయి పట్టుకుని నాకు మాట ఇవ్వు.. వాడి మొహంలో మునుపటి సంతోషం తీసుకొస్తానని.. మునుపటి విక్రమ్‌లా వాన్ని నేను చూడాలి. వాడికి నువ్వే మరో ప్రియవి కావాలి.." అంటూ ఏడ్చింది.

తనకు తెలియకుండానే ఏడుపొచ్చేసింది మధుకి.

మనవడు అంటే ఇంత ప్రేమను దాచుకున్న బామ్మ, చనిపోయిన భార్య మీద ప్రేమను చంపుకోలేని భర్త.. కేవలం డబ్బే కాదు మంచి మనసున్న మనుషులు వీళ్ళు.. అని గ్రహించింది.

కానీ తను ఏమీ చేయలేదని, కేవలం డబ్బు కోసం వచ్చిన కిరాయి ఇల్లాలినని ఆ పెద్దావిడకి ఎలా చెప్పాలో అర్థం కాలేదు మధుకి.

అందుకే మౌనంగా ఉండిపోయింది.

*****

ఆ ఇంట్లోకి వచ్చి కేవలం ఒక్కరోజే అయినా ఇంట్లో మనుషులందరి మనస్తత్వాలు, వారి మధ్య ఉన్న ప్రేమ, అనురాగాలు పూర్తిగా అర్థమయ్యాయి మధుకి.

బామ్మకి విక్కీ అంటే మనసులో పిచ్చి ప్రేమ ఉన్నా, పైకి మాత్రం కసురుకోవడం, కోప్పడడం, ఒకరినొకరు కోపంగా చూసుకోవడం,

అలాగే అత్తయ్య,మావయ్యల మధ్య అంతులేని అనురాగం ఉన్నా,ఏదో చిన్న అసూయ దానిని అడ్డుకోవడం, బామ్మకి అత్తయ్య కి మధ్య కూడా నిగూఢంగా ఉన్న అభిమానం.. దానిని బయటపడనివ్వని వాళ్ళిద్దరి అహం, ఎవరికి వారే తామే గెలవాలనే పట్టుదల..

మొత్తంగా ఆ ఇంట్లో ఒకరంటే ఒకరికి అందరికీ ఎంతో ప్రేమ ఉంది. కానీ దానిని కోపం,అహం అనే పొర కింద దాచేసి, బయటపెట్టలేకపోతున్నారని అర్థమైంది మధుకి.

కానీ చాలా ముచ్చటగా అనిపించింది ఆ కుటుంబాన్ని చూస్తే..

కోటీశ్వరులు కదా.. ఎంత దర్పంగా, డాబుగా ఉంటారో? అసలు మాట అయినా సరిగా మాట్లాడతారో లేదో అనుకునేది. కానీ వారి మనసు ఎంత నిష్కల్మషమైనదో చూశాక వాళ్ళందరిపై ఎంతో అభిమానం పుట్టుకొచ్చింది మధుకి.

ముఖ్యంగా అందరికీ విక్రం అంటే ఉన్న ప్రేమని చూస్తే అసూయగా అనిపించింది. ఎంత అదృష్టవంతుడో కదా.. అనుకుంది మనసులో.

తను ఆలోచనలలో ఉండగానే,

"మధు టైం అవుతుంది పూజకి.. ఇంకా రెడీ అవ్వలేదా?" అంటూ తన గదిలోకి వచ్చిన బామ్మ ని చూసి..

"అయిపోయింది అమ్మమ్మా.. వస్తున్నాను." అని నవ్వింది ప్రేమగా.

"ఎంత ముద్దుగా ఉన్నావో తెలుసా..? నా దిష్టే తగిలేలా ఉంది.."

"ఇలా చక్కగా పట్టు చీర కట్టుకొని, పూలు పెట్టుకొని, నుదుటిన కుంకుమ దిద్దుకుని, దేవుడికి పూజ చేసే అమ్మాయిలంటే నాకెంత ఇష్టమో తెలుసా.. నా బంగారు తల్లివి నువ్వు.. చల్లగా ఉండు తల్లి.. నిండు నూరేళ్లు పిల్లా పాపలతో నా విక్రం బాబును సంతోష పెడుతూ, నువ్వూ సంతోషంగా ఉండు.." అంటూ తలపై చేయి వేసి ఆశీర్వదించింది.

బదులుగా, నవ్వి, "మీ ఆశీర్వాదానికి నిజంగానే పవర్ ఉందంటారా బామ్మా?" అడిగింది చిలిపిగా చూస్తూ.

"ఏ పిల్లా! ఏమనుకుంటున్నావ్ అసలు.. ? నేను అన్నాను అంటే జరిగి తీరంతుందంతే.. అంతేకాదు నేను జాతకాలను బాగా నమ్ముతాను. ఆరోజు ఆ అమ్మాయి జాతకం, విక్రమ్ జాతకం కలవలేదని పంతులుగారు స్పష్టంగా చెప్పారు.. మా వాడికి చెప్తే అసలు నమ్మలేదు. ఈ కాలంలో కూడా జాతకాలు ఏంటి అంటూ తీసి పడేశాడు.." అంది బాధ గా.

"మరి మా జాతకాలు కూడా చూపించారు కదా బామ్మ పంతులుగారు ఏం చెప్పలేదా?" అంది అనుమానంగా.

"ఎందుకు చెప్పలేదు.. చెప్పారు.." అంది సీరియస్ గా.

"కొంపదీసి మాది కాంట్రాక్ట్ మ్యారేజ్ అని చెప్పేసాడా ఏంటి ఆ పంతులు.." అని గుండెఝల్లుమంది మధు కి ఒక్కసారిగా.

"ఏం చెప్పారు బామ్మా? " అంది భయం భయంగా చూస్తూ

"చాలా దివ్యంగా కలిసాయి అని చెప్పారు.. మిమ్మల్ని ఎవ్వరు విడదీయలేరు అని కూడా చెప్పారు.. జీవితాంతం చూడ చక్కని జంటగా,

అన్యోన్యంగా,ఆది దంపతుల్లా కలిసి మెలిసి ఉంటారని చెప్పారు.." నవ్వుతూ అంది.

"నిజమా?" అని నోరు తెరిచి చూసి, అంతలోనే తేరుకొని కిసుక్కున నవ్వేసింది నవ్వాపుకోలేక.

"అదేం నవ్వడం? నేనేమైనా జోక్ చేస్తున్నానా..?

ఈరోజు పూజ అయిపోయాక పంతులు గారిని అడుగుతాను శోభనానికి మంచి ముహూర్తం ఎప్పుడు ఉందో? ఆ ముహుర్తం లోనేమీరిద్దరూ ఒక్కటవ్వాలి.. సంవత్సరం తిరగకుండానే నీ చేతుల్లో బిడ్డ ఉండాలి.. అర్థమైందా?" అంది ఆర్డర్ వేస్తున్నట్లుగా..

"ఏంటి ?" అంది షాక్ అవుతున్నట్లుగా చూసి..

"ఎందుకు అలా షాక్ అవుతున్నావ్? పిల్లలు వద్దా.. ఏంటీ నీకు?" అంది గదమాయిస్తున్నట్లు.

బదులుగా ఏం మాట్లాడకుండా సైలెంట్ గా తలవంచుకుంది.

"నీకు పిల్లలు పుడితే,వాడి పిల్లల్ని నువ్వు ప్రేమగా చూసుకోలేను అనుకుంటున్నావా? నేనైతే అస్సలు అనుకోవట్లేదు.. మొదటి రోజు పిల్లల్ని చూడగానే నీ కళ్ళల్లో కనిపించిన ప్రేమ, వాళ్లను దగ్గరికి తీసుకున్న విధానం.. నేను గమనించాను. నాకు తెలుసు నీ బిడ్డ కంటే కూడా వాళ్ళనే ఎక్కువ ప్రేమగా చూసుకుంటావు నువ్వు.. రాజ్యలక్ష్మి అంటే ఏమనుకుంటున్నావ్ పిల్లా? మనిషిని చూడగానే మనసును చదివేస్తాను నేను.. అలాంటి పిచ్చి భయాలేం పెట్టుకోకు.. నీ మీద నీ కంటే ఎక్కువ నమ్మకం నాకే ఉంది.. ఇద్దరు పిల్లలు ఉండగా నీకు పిల్లలు

ఎందుకు అని అనుకోకు నీకు పుట్టే బిడ్డ, నిన్ను విక్రం ని మరింత దగ్గర చేస్తుంది.." అంది బామ్మ.

బామ్మ మాటలకు నవ్వాలో, ఏడవాలో అర్ధం కాక ఏం మాట్లాడకుండా "వెళ్దామా బామ్మా, లేట్ అవుతుంది."అంది.

"నువ్వు పద.. వాడు తయారయ్యాడో లేదో చూసి వస్తాను.." అని విక్రమ్ దగ్గరికి వెళ్ళింది.

*****

"ఏ పూజలు వద్దన్నా బామ్మ ఎందుకు ఇలా పంతం పడుతుందో అర్ధం కావట్లేదు..గట్టిగా చెప్పి, తనని బాధ పెట్టలేడు.. తనంటే చిన్నప్పటినుండి ఎంతో ఇష్టం.. తను బాధ పడితే చూడలేను.."అనుకొని బామ్మ తనకు తెచ్చి ఇచ్చిన పంచె తీసి కట్టుకుంటున్నాడు విక్రమ్.

తెల్లని పంచె కట్టుకుని, అద్దం ముందుకు వెళ్లి నిల్చోగానే.. ప్రియాని పెళ్లి చేసుకుని వచ్చిన తెల్లవారి తామిద్దరూ కలిసి చేసిన మొదటి మరియు ఆఖరి పూజ గుర్తొచ్చింది.

తనని పెళ్లి చేసుకొని ఇంట్లో అడుగుపెట్టిన రోజేబామ్మ వల్ల జరిగిన పెద్ద గొడవ ఒక్కసారి మనసులో మెదిలి, గతంలోకి తీసుకెళ్ళింది విక్రం ని.

ఎంతగానో ఇష్టపడి, ప్రాణం లా ప్రేమించి, పెళ్లి చేసుకున్న అమ్మాయిని తీసుకొని, ఇంట్లోకి అడుగుపెట్టగానే, దేవుడి దగ్గర దీపం పెట్టమంది బామ్మ.

కానీ ప్రియా గురించి తనకు ముందే తెలుసు.. దేవుడు, పూజలు, లాంటివేవీ తను నమ్మదు.పూర్తి నాస్తికురాలు.

విషయం తను నాకు ముందే చెప్పడంతో బామ్మని వారించి,"కనిపించని దేవుడికి ఎందుకులే బామ్మా? నువ్వు ఉన్నావు కదా కళ్ళెదుటే.. నీ కంటే పెద్ద దేవుడు మాకు ఎవరు లేరు.." అంటూ నవ్వుతూ, ప్రియ కి సైగ చేసి బామ్మ కాళ్ళ మీద పడ్డారు ఇద్దరు కలిసి,ఆమె ఆశీర్వాదాల కోసం..

కాస్త సంతోషంగానే దీవించింది బామ్మ. కానీ ఆమెకు సంతృప్తి కలగలేదు. కొత్త కోడలు ఇంట్లో దీపం పెట్టి, నైవేద్యం పెట్టాలి. అదే ఈ ఇంటి ఆచారం.

నా కోడలు వచ్చినపుడు అది జరగానే లేదు. ఆ ఆచారం మరుగున పడటం నాకు ఇష్టం లేదు. కనీసం నీతో అయినా మళ్ళీ అది జరగాలి అని ఎంతగానో బ్రతిమలాడింది బామ్మ.

ఆ క్షణం బామ్మ ని చూస్తే ఓవైపు జాలి, మరోవైపు ప్రియ కి కలుగుతున్న ఇబ్బంది నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి.. ఎవరి వైపు మాట్లాడాలో ఎవరిని వారించాలో అర్థం కాలేదు. కాని చివరికి ప్రియ నే గెలిచింది. బామ్మ వచ్చి రాగానే గొడవ పెట్టలేక మౌనంగా వెనుదిరిగింది. కానీ ఆ మౌనం వెనుక ఇంకొక ప్రళయం రాబోతుందని ఊహించలేదు.

ప్రియ నా గదిలోకి వచ్చి ఇద్దరం మనస్ఫూర్తిగా సంతోషంగా మాట్లాడుకుంటుండగా, మళ్లీ వచ్చింది బామ్మ. ఈరోజు దీపం పెట్టలేదు నేను కూడా ఏమీ అనలేదు.. కానీ రేపు సత్యనారాయణ పూజ ఉంది. అది మాత్రం ఖచ్చితంగా చేయాలి అమ్మా.. అంటూ మళ్ళీ మొదలు పెట్టింది.

నేను ఎటువంటి పూజలు చేయను అని ప్రియ, చేయక తప్పదు అని బామ్మ చాలా సేపు వాళ్ళ వాదనలతోనే కాలం గడిచింది.

కాసేపయ్యాక సరే ఈ ఒక్కసారి కి మిమ్మల్ని బాధ పెట్టలేక, మీ మాట ఒప్పుకుంటున్నాను.కాని ఇంకెప్పుడు పూజలు, దేవుడు అంటూ నా

దగ్గరికి రావద్దు. ఈ షరతు కి మీరు ఓకే అంటే నేను రేపు పూజలో కూర్చుంటాను.. అంది ప్రియ.

నేను ఆశ్చర్యపోయాను ప్రియా పూజలో కూర్చుంటానని ఒప్పుకోవడమేంటి అని.. చాలా సంతోషం వేసింది నాకు కూడా. ఎదుటివారి సంతోషం కోసం తన అభిప్రాయాలను, భావాలను పక్కన పెట్టడం అనే విషయం బాగా నచ్చేసింది ప్రియలో.

ఆరోజు చక్కగా ఎరుపు రంగు పట్టు చీర కట్టుకుని, తల నిండా మల్లెలు తురుముకుని, నుదుటన కుంకుమ దిద్దుకొని, అచ్చం మహాలక్ష్మిలా తయారైన తన ప్రియని చూడగానే మనసంతా సంతోషంతో నిండిపోయింది విక్రమ్ కి.

“బొమ్మ నిన్నిలా చూస్తే ఎంత సంతోషిస్తుందో తెలుసా?” అన్నాడు ప్రియా తలపై చేయి వేసి.

"ఆమె సంతోషం కోసమే ఈ ఒక్కరోజు తనమాట వింటున్నాను.. కానీ ప్రతి రోజూ తన సంతోషం కోసం నేను మాత్రం బాధపడను. ముందే చెప్తున్నాను.. నేను ఎవరిని బాధ పెట్టను అలాగని నేను కూడా బాధపడను.." అంటూ నవ్వి అతని భుజంపై ఒరిగింది.

"అలాగే బంగారం నీకెలా నచ్చితే అలాగే ఉండు.." అంటూ తన చేయి పట్టుకుని పూజ జరిగే చోటుకి తీసుకెళ్లాడు.

తెల్లటి పంచలో విక్రమ్, పట్టుచీరలో ప్రియా ఇద్దరు పక్కపక్కన ఒకరి చేయి ఒకరు పట్టుకొని పైనుండి దిగుతుంటే, అచ్చం సీతారాములుఇలానే ఉండేవారేమో అనిపించింది ఒక్క క్షణం రాజ్యలక్ష్మి కి.

నా దిష్టే తగిలేలా ఉంది ఇద్దరికీ.. ఈరోజు పూజ అయిపోయాక చక్కగా దిష్టి తీయాలి అనుకుని నవ్వుకుంది.

"బామ్మా.. నీ సంతోషం కోసమే పూజలో కూర్చుంటున్నాను కానీ మనస్ఫూర్తిగా నేను పూజ చేయలేను. ఎందుకంటే నేను నమ్మని దాన్ని నేనెప్పుడూఫాలో అవ్వను. ప్లీజ్ ఇంకోసారి ఇలా మిమ్మల్ని నేను మోసం చేసేలా చేయకండి. నన్ను నన్ను లాగే ఉండనివ్వండి.." అని చెప్పి వెళ్లి పూజలో కూర్చుంది ప్రియ.

ఆ మాటతో రాజ్యలక్ష్మి కి చాలా బాధనిపించింది.

“విక్కీ రెడీ అయ్యావా పంతులుగారు వచ్చేసారు..” అంటున్న బామ్మ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు విక్రమ్.

*****

గంభీరంగా ఆరోజు ఇష్టం లేకపోయినా ప్రియా ఎలా పూజలో కూర్చుందో, ఈ ఒక్కసారికి తను కూడా అలాగే కూర్చోవాలని నిర్ణయించుకుని అయిష్టంగానే బయటకు వచ్చాడు విక్రం.

తను అక్కడికి వెళ్లేసరికి పూజలో కూర్చొని పంతులుగారు చెప్తున్నవన్నీ అక్కడ ఉన్నాయో లేదో సరిచూస్తున్న మధు ని చూసి ఒక్కసారి అలాగే షాక్ తో చూస్తూ ఉండిపోయాడు.

ఒక్క క్షణం అక్కడ ఉన్నది మధునా లేక ప్రియా నా అర్థం కాలేదు..

అచ్చం తన ప్రియ పూజ లో కూర్చున్నట్టుగానే ఉంది అచ్చం ప్రియలాగే కనిపించింది.

మళ్లీ అంతలోనే తేరుకొని, అది తన ప్రియ కాదు మధు.. అని గుర్తించి తన సంతోషమంతా ఆవిరైపోగా, ఎప్పటిలా నిస్తేజంగా వెళ్ళి కూర్చున్నాడు.

తన పక్కనే కూర్చున్న విక్రమ్ ని చూడగానే, జీవం లేని ఆయన మొహాన్ని చూసి, బామ్మ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి మధుకి.

ఎంత ప్రేమించారో ప్రియా గారిని.. పాపం ఆ దేవుడు ఎందుకు ఇలా చేస్తాడు? ఎక్కువగా ప్రేమించిన వాళ్ళని దూరం చేసి ఎందుకిలా బాధపెడతాడు.? అనుకుని, భారంగా నిట్టూర్చింది.

ఎంతో ఇష్టంగా పూజ చేస్తున్న మధు ని గమనించాడు విక్రమ్ మధ్య మధ్యలో.

"ఈమెకి ఎందుకు అంత ఇంట్రెస్ట్.. నేను అనుకున్నంత ఈజీ కాదేమో కాంట్రాక్ట్ మేరేజ్ అనేది. అనవసరంగా ఎక్కువ గా ఇన్వాల్వ్ అయిపోతుంది ఈమె.." అనుకున్నాడు విక్రమ్ విసుగ్గా.

పూజ అయిపోయాక పంతులు గారిని అడిగింది రాజ్యలక్ష్మి శోభన ముహూర్తం గురించి.

పంచాంగం తిరిగేసి రేపు రాత్రి 9 గంటలకు మంచి ముహూర్తం ఉందమ్మా.. అని పంతులు చెప్పాడు.

పూజ కి తన తల్లిదండ్రులని కూడా పిలవడంతో మధు అమ్మానాన్న లతో పాటు, అన్న వదినలు కూడా వచ్చారు. తన అత్తారిల్లు ఎలా ఉందో చూడడానికి.

ఆ ఇల్లు ఆ మనుషులు వాళ్ళ ఆస్తిపాస్తులు చూసి కళ్ళు తిరిగాయి కావ్యకి.

చూసావా అన్నట్లు మాటిమాటికి మాధవ్ కి సైగ చేస్తూ మూతి తిప్పుతూ ఉంది.

అసలు ఓర్చుకోలేక పోయింది అక్కడ ఉన్నంత సేపు.

మరోవైపు తన తల్లిదండ్రుల కళ్ళల్లో ఆనందం చూసి చాలా సంతోషంగా అనిపించింది మధుకి .

వాళ్లు చాలా సంతృప్తిగా ఉన్నారు ఈ పెళ్లి పట్ల.

పోనీలే ఈ రెండేళ్లయినా వాళ్ళు సంతోషంగా ఉండనీ.. ఆ తర్వాత ఏదో ఒకటి చెప్పి సర్ది చెప్పొచ్చు.. అనుకుంది మనసులో మధు.

*****

"చూసావా తల్లిలాగే పిల్ల.. ఆస్తి ఉన్నవాన్ని చూసి మరి కావాలని పెళ్ళాం చనిపోయి ఇద్దరు పిల్లలు ఉన్న వాళ్ళని ఏరి కోరి పెళ్లి చేసుకుంది..

లేకపోతే మంచి జాబు అందం వయసు అన్నీ ఉన్న మీ చెల్లికి రెండో పెళ్లి వారిని చేసుకోవాల్సిన అవసరం ఏంటి.. కేవలం ఆస్తి కావాలి తల్లి కూతుర్లకు." అంటూ దెప్పిపొడుస్తున్న కావ్య మాటలు మాధవ్లో అప్పటికే రగులుతున్న మంటలకు ఆజ్యం పోసాయి..

తను చెప్పే దాంట్లో అబద్ధం ఏమీ కనిపించలేదు.. "పోనీ వాళ్ళు ఎక్కడ చస్తే మనకేంటి.."అన్నాడు చిరాకుగా.

*****

ఇలా పూజ అయిపోగానే అలా ఆఫీస్ కి వెళ్ళిపోయాడు విక్రమ్.

ఇంట్లో కంటే ఆఫీసులోనే ఉండాలనిపిస్తుంది అతనికి.. ఇంటికి వెళ్తే చాలు ఏదోలా అనిపిస్తుంది.. తన ఇల్లు కాదేమో అన్న ఫీలింగ్ వస్తుంది. "ఒక్క మనిషిని కొత్తగా ఇంట్లోకి తీసుకొస్తే తన ఇల్లు తన ఇల్లులా అనిపించకపోవడమేంటి అసలు.. నేను ఎక్కువగా ఊహించుకుంటున్నానా? నేనే ఎక్కువగా భయపడుతున్నానాఅనవసరంగా?" అనుకున్నాడు మనసులో.

“ఏమైంది సార్ టెన్షన్ గా కనిపిస్తున్నారు?” అన్నాడు శాస్త్రి గది లోపలికి వస్తూ..

“ఏమో శాస్త్రి అంతా కంగారుగా ఉంది నాకు. ఏం జరుగుతుందో ఏమో అర్థం కావట్లేదు..” అన్నాడు దిగులుగా.

“అసలు మీ ప్రాబ్లం ఏంటి సార్? కాంట్రాక్టు మ్యారేజ్ గురించి చెప్పిందే మీరు ఇప్పుడు ఇలా మాట్లాడుతారు ఏంటి..”

“ఏమో శాస్త్రి తెలియదు అందరూ కలిసి ఎక్కడ ఇదే నిజమైన పెళ్లి అని నాకు అంట కట్టేస్తారోనని భయంగా ఉంది..”

“ఊరుకోండి సర్.. అగ్రిమెంట్ అంత పక్కాగా రాయిస్తే మళ్ళీ భయపడడం దేనికి.”

“అవును కదా..కానీ ఆ అగ్రిమెంట్ బయట పడితే నా పరువు పోతుంది కదా శాస్త్రి. ఎప్పట్లా అగ్రిమెంట్ ప్రకారం అమ్మాయి రెండు సంవత్సరాల తర్వాత తనంతట తనుగానే వెళ్లిపోయి విడాకులకు అప్లై చేస్తే ఎటువంటి సమస్య లేదు.. కానీ అలా కాదని నేను వెళ్ళనని మొండికేస్తే నేనేం చేయగలను చెప్పు అగ్రిమెంట్ అందరి ముందు పెట్టడం తప్ప.. కానీ అది బయటపెడితే అందరూ నా మొహంపై ఉమ్మేస్తారేమో.”

“మీరు అనవసరంగా ఎక్కువ ఆలోచిస్తున్నారు.. ఆ అమ్మాయి మీతో అలా ఏమైనా ప్రవర్తిస్తుందా? మీకు దగ్గర అవ్వాలని ఏమైనా చూస్తుందా.?”

“ఇప్పటికైతే ఏమీ లేదు కానీ ఎందుకో అలా అనిపిస్తుంది శాస్త్రి.”

“అంతా మీ భ్రమ. అలా ఏం జరగదు.. అసలే నా టెన్షన్ లో నేను ఉంటే మీరేంటి సార్?”

“నీ టెన్షన్ ఏంటి?”

"మధు చాలా మంచి వర్కర్..అన్ని ప్లాన్ చేసి షెడ్యూల్ పెట్టేది. ఇప్పుడు ఎవరు పర్సనల్ సెక్రటరీ లేకపోవడం వల్ల నా మీద బర్డెన్ పడుతుంది.. ఇంకొక సెక్రటరీని చూద్దామంటే అంత పర్ఫెక్ట్ అమ్మాయి దొరకట్లేదు."

"అదొకటుందా?ఇప్పుడు ఏం చేద్దామంటావు మరి?"

"ఎలాగో ఇంట్లో ఖాళీ గానే ఉంటుంది కదా.. మధు నీ కూడా రోజు మీతో పాటు ఆఫీస్ కి తీసుకొస్తే సరిపోతుంది కదా.. అనవసరంగా ఇంకొకరికి జీతం ఎందుకు? ఏమంటారు? ఎలా ఉంది నా ఐడియా?"

"నీ మొహంలా ఉంది.. అందరి దృష్టిలో ఇప్పుడు తను నా భార్య.. తనని ఎంత ఎక్కువ ఎక్స్పోజ్ చేస్తే అంత ఎక్కువ మందికి స్ప్రెడ్ అవుతుంది.."

"అంతే అంటారా సరే.. అయితే మళ్లీ ఇంటర్వ్యూకి పిలవక తప్పేలా లేదు.."

"నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో..నన్ను దొబ్బకు పో ఇక్కడి నుండి ?" అన్నాడు అప్పటికే చాలా చిరాకుగా ఉన్న విక్రమ్.

*****

ఆ రోజు కూడా బామ్మ గదిలోనే పడుకున్న మధు కి బామ్మ బాగా నచ్చేసింది. ఆమె మాటలు ఆమె ఆలోచనలు చాలా గొప్పగా అనిపించాయి. ఆమె పేరున ఉన్న కంపెనీ నీ ఎలా మొదలెట్టారు తాత గారు..కొడుకు చిన్నగా ఉన్నపుడేఆయన చనిపోతే, ఒక్కతే ఆ కంపెనీ నీ ఎలా నిలబెట్టింది, ఎలా వృద్ధిలోకి తీసుకొచ్చి పదింతలు గా చేసి కంపెనీ నీ కొడుకు చేతిలో పెట్టిన విషయాలు ఒక్కోటిచెప్తుంటే చాలా గర్వంగా అనిపించింది..

ఒక ఆడది తలుచుకుంటే ఏదైనా చేయగలదు అని నిరూపించిన బామ్మ గొప్పతనం మెచ్చుకోకుండా ఉండలేకపోయింది.

అన్నీ చెప్పి చివరిగా "మీ శోభనానికి రేపే మంచి ముహూర్తం ఉందన్నారు పంతులుగారు. నేను చెప్పింది గుర్తుంది కదా పిల్ల. సంవత్సరంలోగా బాబయినా పర్లేదు పాప అయినా పర్లేదు మీ ఇద్దరి ప్రేమకు గుర్తుగా ఒక సాక్ష్యం కనబడాలి నాకు.."అంటూ బాంబు పేల్చేసరికి బిత్తరపోయి చూస్తూ ఉండిపోయింది మధు.

"ఏంటమ్మాయి అలా చూస్తున్నావ్.. ఇంత నెమ్మదిగా ఉంటే వాన్ని తట్టుకోవడం చాలా కష్టం. విరక్తితో అలా ఉండిపోయాడే కానీ అంతకుముందు వాడు ఎంత హుషారుగా ఉండేవాడో తెలుసా.. వాడుంటే చుట్టూ సందడే సందడి. అందరినీ నవ్వించేవాడు ఇప్పుడు మళ్ళీ నీవల్ల వాడిలో హుషారు వస్తే చూడాలని ఉంది. నువ్వేమో ఇలా ప్రతిదానికి బిత్తరపోయి చూస్తూ ఆలోచిస్తూ ఉంటావు.. నీ వయసులో ఉన్న పిల్లలు ఎలా ఉన్నారు? ఎంత హుషారుగా ఉన్నారు? ఎందుకు ఇంత మూడీగా ఉంటావు ఎప్పుడూ ..గలగల మాట్లాడుతూ చక్కగా ఉండాలి అమ్మాయిలు.." అంది బామ్మ.

"అలాగే అమ్మమ్మ నువ్వు చెప్పినట్లే ఉంటానులే"అని నవ్వి ఆమె చేయి పట్టుకొని నిద్రపోతున్నట్లుగా కళ్ళు మూసుకుంది.. కానీ లోపల ఎన్నో తిరుగుతున్నాయి. సర్లే వీళ్ళు ఏ ముహూర్తం పెట్టుకుంటే మనకేంటి లోపల జరిగేది ఏమీ ఉండదు. గుర్రాన్ని నీళ్ల వరకు తీసుకెళ్తారు కానీ తాగించలేరు కదా.. మహా అంటే ముస్తాబు చేసి గదిలోకి తోసేస్తారు నన్ను.. తలుపు గడియ పెట్టాక ఎంచక్కా ఎవరికి వాళ్ళం నిద్రపోతాం.. దానికి నేను ఎందుకు టెన్షన్ పడటం.. అనుకుని హాయిగా ఆవులిస్తూ నిద్రపోయింది మధు.

*****

సాయంత్రం 6 గంటలకు ఇద్దరికీ నలుగు పెట్టి మరీ స్నానాలు పోసి, సాంబ్రాణి పొగలు వేసి ఎవరి గదుల్లో వారిని చక్కగా ముస్తాబు చేశారు..

మధు ని రెడీ చేయడానికి బ్యూటీ పార్లర్ నుండి బ్యూటీషియన్ కూడా వచ్చింది.

అవసరమా ఇదంతా అనిపించింది మధు కి. కానీ తన మొహంలో ఆ ఎక్స్ప్రెషన్ కనబడినాబామ్మ గుర్తుపట్టేసి పెద్ద క్లాస్ పీకుతుందని లేని సిగ్గు ని రప్పించి మరీ నటించింది.

తయారు చేస్తునంత సేపు పక్కనే కూర్చుని చూస్తూ సంబరపడ్డారు రోజీ,రాజ్యలక్ష్మి.

ఎంతసేపూ తనని చూసి సంబరపడుతున్నారే కానీ వాళ్ళిద్దరు మాత్రం ఒకరి మొహాలు ఒకరు చూసుకోవడానికి ఇష్టపడట్లేదు. అసలు వీళ్ళిద్దరికీ ఇంత వైరం ఎందుకు వచ్చిందో అని ఆలోచనలో పడిపోయింది మధు.

అంతలోనే ఒకసారి చూసుకోండి మేడం అంతా పర్ఫెక్ట్ గా ఉందా? అన్న బ్యూటీషియన్ మాటలతో అద్దంలో తనని తాను చూసుకొని అసలు ఇంత అందంగా ఉన్నానా నేను? అనుకుంది తనకు తానే..

“నేను ఇంత బాగా కూడాకనిపిస్తానని ఇప్పుడే తెలిసింది..”అని లోపల అనుకోబోయి, పైకే అనేసింది ..

ఆ మాటలకి ఇద్దరు నవ్వి, “బంగారు బొమ్మలా ఉన్నావ్..!” అన్నారు తెలియకుండానే ఇద్దరు ఒకేసారి..

మళ్లీ ఒకరి మొహాలు ఒకరు చూసుకొని మూతి తిప్పుకున్నారు అత్త కోడళ్ళు.

ఓకే మేడం నేను వెళ్తాను.. అని చివరిగా మళ్ళీ ఒకసారి పెర్ఫ్యూమ్ ని లైట్ గా స్ప్రే చేసి వెళ్ళింది బ్యూటీషియన్.

నిజంగా అద్దంలో తనను తాను చూసుకుంటూ ఉంటే తనమీద తనకే మోహం కలుగుతుంది. అంత అందంగా ఉంది.. తెల్లటి చీర, తల నిండా మల్లెపూలు.. మొహంలో ముందుగానే చూడాలనిపించే ఎర్రని పెదవులు, కళ్ళను మరింత పెద్దగా చూపిస్తున్న నల్లని కాటుక, నడుము, నాభి కనిపించేలా కట్టిన చీర వల్ల, తెల్లని జున్ను ముక్కలా కొద్ది కొద్దిగా కనిపిస్తూ, కనిపించకుండా దోబూచులాడుతున్న నడుం..

తనని తానే మైమరిచిపోయి అద్దంలో చూసుకుంటున్న మధుని చూసి,

పాపం ఈరోజు నా మనవడి పరిస్థితి ఏంటో? అంటూ కిసుక్కున నవ్వుతూ అక్కడనుండి బయటకు వెళ్ళిపోయిందిరాజ్యలక్ష్మి.

"ఆల్ ది బెస్ట్ మధు.. ఏం కంగారు పడకండి.. ఫ్రెండ్స్ లా అన్ని మనసు విప్పి మాట్లాడుకోండి. నా విక్రం చాలా మంచివాడు.. నువ్వు ఎంతో అదృష్టవంతురాలివి.. వాడిది చిన్న పిల్లాడి మనస్తత్వం.. అమ్మలా అర్థం చేసుకో అర్థమవుతాడు.." అంటూ తల నిమిరి వెళ్ళు.. వాడు వెయిట్ చేస్తూ ఉంటాడు.. అని మధుని బయటకి తీసుకువచ్చి, విక్రమ్ గది ముందు నిలబెట్టి తను వెళ్ళిపోయింది రోజీ నవ్వుతూ.

లోపలికి వెళ్లాలంటేనే ఏదో ఇబ్బందిగా అనిపించింది మధుకి. ఏం జరగదని తెలుసు.. కానీ సార్ ఎలా రియాక్ట్ అవుతాడో ఏంటో? అని భయపడింది. అయినా నా తప్పేముందని భయపడడానికి? నేనేమైనా కావాలని చేస్తున్నానా? అని అంతలోనే సర్దుకుని మెల్లిగా తలుపు తీసుకుని లోపలికి వెళ్ళింది.

లోపల అసలు ఏమీ పట్టనట్లుగా సోఫాలో పడుకుని ఫోన్లో గేమ్ ఆడుకుంటున్న విక్రమ్ ని చూసి.. తను ఊహించిందే కావడం వల్ల ఏమి షాకవ్వకుండా, తలుపు గడియ పెట్టి, పాల గ్లాస్ ని అక్కడే ఉన్న టేబుల్ పై ఉన్న, స్వీట్లు, పండ్ల పక్కనే పెట్టింది.

లోపల గదిని చాలా బాగా అలంకరించారు. మత్తెక్కించే పరిమళం, రూమ్స్ప్రే, అగరు బత్తుల సువాసన, బెడ్ ని అలంకరించిన మల్లెల ఘాటైన పరిమళం, లవ్ షేప్ లో అమర్చిన గులాబీ పూల అందం.. నిజంగా అందమంతా ఆ గదిలోనే ఉంది అనిపిస్తుంది.

అంతటి డెకరేషన్ ని ఎప్పుడు చూడని మధు, ఆశ్చర్యపోయి, మైమరిచిపోయి, గదినంతా పరిశీలిస్తూ నిలుచుంది.

అప్పుడు చూశాడు విక్రమ్ తనని..

అంతే..గభాలున లేచి కూర్చున్నాడు..

తన ఎదురుగా కనిపిస్తున్న ఆమె రూపం అతన్ని విభ్రాంతికి గురిచేసింది.

సంభ్రమాశ్చర్యాలతో, ఆమెని కన్నార్పకుండా చూస్తూ, తన ప్రియ తిరిగి వచ్చిందా? అని ఆశ్చర్యపోయాడు ఒక్క నిమిషం.. అసలు ఏమీ అర్ధం కాలేదు అతనికి. తన మెదడు ఒక్కసారిగా స్తంభించిపోయింది..

తర్వాత కాసేపటికి అతనికి అర్థమైంది..

తన ప్రియా చీర మధు కట్టుకుందని.

ఒక్కసారిగా తనకే తెలియకుండా,పట్టరాని కోపం వచ్చేసింది.

“మధు..” అని అరిచాడు గట్టిగా..

ఆనందంతో, ఆశ్చర్యంతో ఆ గది అందాలను ఆస్వాదిస్తున్న మధు ఆ అరుపుకి ఉలిక్కిపడి చూసింది అతన్ని ఏమైంది అన్నట్లు..

"ఏంటిది? నువ్వు నా ప్రియా చీర ఎందుకు కట్టుకున్నావ్?"గట్టిగా అరిచాడు మళ్ళీ.

విక్రమ్ ఏమంటున్నాడో అసలు అర్థం కాలేదు మధు కి. కాసేపటి తర్వాత అర్థమైంది తను కట్టుకున్న చీర అతని భార్యదని.

"ఇది ప్రియ గారిదా సర్..?" అమాయకంగా అడుగుతున్న మధుని కోపం గా చూసి,

"అసలేంటి నీ ఉద్దేశ్యం చెప్పు? నాకు డైరెక్ట్ గా చెప్పు ఇప్పుడే.. ఇక్కడే సెట్ అవుదాం అనుకుంటున్నావా? అందుకేనా ఇలా మేకప్ లు వేసుకొని, నా ప్రియా చీర కట్టుకొని, నా ముందు తిరిగితేనేను టెంప్ట్ అవుతానని అనుకున్నావా?ఇంత చీప్ గా నీ క్యారెక్టర్ ఉంటుందని నేనస్సలనుకోలేదు.." అంటూ అక్కడే సోఫాలో కూలబడ్డాడు తల పట్టుకుని.

ఒక్కసారిగా అతను అన్న మాటలన్నీ ముళ్ళల్లా గుండెల్లో గుచ్చుకునేసరికి, నొప్పితో విలవిలలాడిపోయింది మధు హృదయం.

నిస్సత్తువ గా అక్కడే కింద కూలబడి పోయి, "అసలు ఏమనుకుంటున్నారు సార్ నా గురించి? మీరు చెప్తేనే కదా నేను వచ్చాను.. మీరు చెప్పినట్లే కదా నేను వినాలి. అసలు ఈ చీర మీ భార్యదనే విషయం నాకు తెలియదు మీరు చెప్పేదాక. బామ్మ తీసుకొచ్చి ఈ చీర కట్టుకోమని ఇచ్చారు.. బ్యూటిషియన్ ని పిలిపించి మేకప్ చేయించారు.. అవన్నీ నేను ఏమైనా కావాలని చేస్తున్నానా? అసలు ఎందుకు ఇలా మాట్లాడుతున్నారు మీరు.? వెళ్ళిపోమంటే ఇప్పుడైనా

వెళ్ళిపోతాను సార్.. కానీ నా క్యారెక్టర్ గురించి తప్పుగా మాట్లాడకండి ప్లీజ్.

నాకు మిమ్మల్ని టెంప్ట్ చేయాల్సిన అవసరం అస్సలు లేదు.. దయచేసి ఆవేశపడి మీ మీద ఉన్న గౌరవాన్ని పోగొట్టుకోకండి.." అని తను అనాలనుకున్న మాటలన్నీ అనేసి, మోకాళ్లలో తల పెట్టుకొని వెక్కి వెక్కి ఏడ్చింది మధు.

*****

అప్పుడు కానీ ఆవేశంలో నుండి బయటకు రాలేదు విక్రమ్.

నెమ్మదిగా తల ఎత్తి మధు వైపు చూసాడు.

అంత దీనంగా ఏడుస్తున్న ఆమె వంక చూడాలంటేనే ఏదోలా అనిపించింది.

తను అన్న ప్రతి మాట నిజమే కదా కాంట్రాక్ట్ మ్యారేజ్ అనే ప్రతిపాదన నాదే.. నేను రమ్మంటేనే తను వచ్చింది. వచ్చిన రోజు నుండి బామ్మ ఎలా చెప్తే అలా చేస్తుంది. తనేంటి? నాకే తప్పట్లేదు బామ్మ చెప్పినట్లుగా చేయడం.. మధ్యలో తనని నిందించడం కరెక్ట్ కాదు కదా.. అనుకొని "ఐ యాం సారీ.." అన్నాడు మెల్లిగా వినిపించి, వినిపించకుండా.

ఏమి బదులివ్వకుండా, అతని మొహం కూడా చూడకుండా, సైలెంట్ గా అక్కడే అలాగే పడుకుంది తల కింద చేతులు పెట్టుకుని, కాళ్ళు ముడుచుకొని.

విక్రమ్ కూడా చప్పుడు చేయకుండా అదే సోఫాలో అలాగే పడుకున్నాడు..

అతని అంతరాత్మ అతనితోనే వాదన కి దిగింది.

"అసలు ఏంట్రా నీ సమస్య? ప్రతిదానికి ఆ అమ్మాయిపై అరుస్తావ్ ఎందుకు? నిజం చెప్పు ఆ అమ్మాయిని నిజంగానే ఎక్కడ ఇష్టపడతానో అని నీ మీద నీకే డౌట్ కదూ.. అది కప్పిపుచ్చుకోవడానికే ఆ అమ్మాయి మీద నింద మోపాలని చూస్తున్నావ్ ప్రతిసారీ.."

"ఛా.. ఆ అమ్మాయిని నేనేందుకు ఇష్టపడతాను? అసలు ఆ అమ్మాయి గురించి నాకేం తెలుసు? తానే కాదు అసలు ఏ అమ్మాయి మీద నాకు ఇష్టం కలగదు.. నా మనసులో ఇప్పటికీ నా ప్రియా నే ఉంది.మనసులోనే కాదు నా చుట్టూ ఉంది.. నా ఆలోచనలలో, నా ప్రతి అడుగులో తనుంది. అలాంటప్పుడు ఇంకొకరి మీద ఇష్టం ఎలా కలుగుతుంది నాకు?"

"మరి అంత నమ్మకం ఉన్న వాడివి.. ప్రతి దానికి ఆ అమ్మాయిని ఇక్కడే ఉండిపోతావా? నన్ను మార్చేస్తావా? టెంప్ట్ చేస్తావా? ఇలా ఎందుకు అడుగుతావు? నీ మనసులో నీ భార్యే ఉన్నప్పుడు.. తను ఎలా తయారైతే నీకు ఏంటి నష్టం?"

అంతరాత్మ మాటలకి సమాధానం దొరకక, నోరు మూసుకొని, సైలెంట్ గా పక్కకు తిరిగి పడుకున్నాడు. సోఫాలో పడుకోవడం అలవాటు లేక నిద్ర పట్టకపోవడంతో కళ్ళు తెరిచాడు.

ఎదురుగా దగ్గరికి ముడుచుకుని పడుకున్న మధు ని చూసి, నవ్వు వచ్చింది.

ఏడ్చి ఏడ్చితన మీద అలిగి పడుకోవటం వల్ల, ఇంకా అలాగే బుంగమూతి పెట్టుకున్నట్లుగా, ఉన్న తన మూతిని చూసేసరికి చిన్నపిల్లలా అనిపించింది. ఆమె అమాయకత్వం భలేగా అనిపించింది విక్రమ్ కి.

పాపం మంచి పిల్ల, వచ్చినప్పటి నుండి నాతో తిట్లు తింటుంది.. అనుకుని, ఇప్పటినుండి తనని ఏమీ అనకూడదు అనుకుని తన వైపు చూస్తూ ఉండిపోయాడు.

ప్రియా చీర కట్టుకున్న తను అచ్చం ప్రియా లానే కనిపిస్తోంది. ఆ పర్సనాలిటీ, రంగు,మొహంలో ఆ కళ అన్ని ప్రియా లాగే..

అలా తన వైపే తదేకంగా చూస్తుంటే, ఫ్యాన్ గాలికి చీర కొంగు చెదిరి తెల్లని ఆమె నడుం, లోతైన ఆమె నాభి కనిపించేసరికి, చటుక్కున తనకి తెలియకుండానే కళ్ళు మూసుకున్నాడు చేతులు అడ్డుపెట్టుకుని.

అంతలోనే మళ్లీ అతనికి తెలియకుండానే మెల్లిగా కళ్ళు తెరిచి చేతుల కింది నుండే మళ్ళీ అటువైపుచూశాడు.

గాలికి రెపరెపలాడుతున్న కొంగు వెనుక నుండి అతన్ని రమ్మని ఆహ్వానిస్తున్నట్లుగా రెచ్చగొడుతున్న ఆమె నడుము ని చూసి,

వామ్మో ఏంట్రా బాబు ఈ టార్చర్ నాకు..? అనుకుని లేచి కూర్చుని అక్కడే ఉన్న వాటర్ తీసుకుని గటగటా త్రాగేసి,ఏ.సి కూలింగ్ పెంచి, సోఫాలో అటువైపు తిరిగి పడుకున్నాడు.

కానీ సోఫా లో పడుకోవడం ఇబ్బంది గా అనిపించింది.బెడ్ పై పడుకుందామని అటు చూడగానే ఆ పూల డెకరేషన్ చూసి లేని పోని అలోచనలు రావడం తో మళ్ళీ లేచి కూర్చున్నాడు..

"ఛా ఎం జరుగుతోంది నాకు? ఇన్నేళ్ళు గా నా ప్రియ లేకపోయినా, తను నా పక్కనే ఉన్న ఫీలింగ్ ఎప్పుడూ.. అలాంటిది ఇపుడేంటి కొత్తగా.. ఈ వాతావరణం నన్ను రెచ్చగొడుతోందా లేక ఈ అమ్మాయి నీ చూసి ఇలా అవుతున్నానా? ఏమో?"

" ఏది ఏమైనా ఇది కరెక్ట్ కాదు రా విక్కి.. నీ ఆలోచనలు అస్సలు మంచివి కావు.. " అనుకుంటూ లాప్టాప్ ముందు పెట్టుకుని తన పెండింగ్ వర్క్స్ ఏమున్నాయో చూసుకుని, చేస్తూ కూర్చున్నాడు.అలాగైనా తన మూడ్ నీ ఆలోచనలని ఎలాగైనా డైవర్ట్ చేయాలని..

రెండు గంటల తర్వాత బాగా నిద్ర రావడం తో అలాగే సోఫాలో పడుకున్నాడు. లాప్ టాప్ పక్కనే పెట్టి..

ఏడ్చి, అలాగే నిద్ర పోయిన మధు కి తెల్లవారేదాక మెలకువ రాలేదు.రోజంతా పూజ పనులతోఅలసిపోయి ఉండటం తో బాగా నిద్ర పట్టేసింది..

లేచి, తను ఎక్కడ పడుకుందో చూసుకుని, కనీసం ఒక దుప్పటి ఐనా ఇవ్వలేదు కర్కోటకుడు.. అనుకుంటూ, ఎక్కడున్నాడు అని చూసిన మధు కి సోఫా లో ఒక వైపు కి తిరిగి పడుకున్న విక్రమ్ నీ చూసేసరికి చాలా బాధ గా అనిపించింది..

పాపం సోఫా లో నిద్ర పట్టలేదనుకుంటా.. అలవాటు లేక.. అందుకే వర్క్ చేసుకున్నట్లు ఉన్నారు సర్ అంటూ జాలి పడి, లాప్ టాప్ తీసి అన్ని సర్ది.. బాగా చల్లగా ఉండటం తో ముడుచుకుని పడుకున్న విక్రమ్ కి దుప్పటి కప్పి,ఎ.సి కొంత తగ్గించి, అక్కడి నుండి బయటకి వచ్చింది..

తనని చూసిన బామ్మ ఖచ్చితంగా గా రాత్రి ఏం జరగలేదని గుర్తు పడుతుందని తెలిసినా.. అలాగే వెళ్ళింది.. మళ్ళీ జుట్టు, బొట్టు చెరుపుకుని బామ్మ ని సంతోష పరచడానికి వెళ్లి, మళ్ళీ విక్రమ్ తో తిట్లు తినదల్చుకోలేదు ఇక..

"ఏదైతే అదయింది.. ఆమె ఏమైనా అడిగినా తన మనవడినే అడగమని చెప్తా.. కానీ నేను మధ్యలో ఇరుక్కోను ఇక.." అనుకుని ధైర్యం గా వెళ్ళింది హాల్ లోనే కూర్చున్న బామ్మ ముందుకి..

" గుడ్ మార్నింగ్ బామ్మా.."అంది నవ్వుతూ.

మధు నీ చూడగానే విషయం అర్థమైన బామ్మ

తను ఊహించిందే కావడంతో, పెద్దగా షాక్ అవ్వలేదు..

మనవడి గురించి, అతనికి భార్య అంటే ఉన్న ప్రేమ గురించి ఆమె కంటే ఎక్కువ ఎవరికి తెలియదు కాబట్టి అంత తొందరగా విక్కి, మధు నీ దగ్గరికి తీసుకోలేడు.. అనుకుని నిట్టూర్చింది.

"వీళ్ళిదరిని ఎలాగైనా దగ్గర చేసే శక్తి ని నాకు ఇవ్వు దేవుడా.." అని ప్రార్థించింది మనసులోనే...

*****

బామ్మ తనని అలా చూసి కూడా ఏమీ అనకపోవడం ఆశ్చర్యం గా అనిపించింది మధు కి.

సర్లే సంతోషం.. బామ్మ కూడా ఏమీ అనలేదు.. సార్ తో కూడా మాటలు అనిపించుకోవాల్సిన అవసరం రాలేదు అనుకుని తనలో తనే నవ్వుకుని, ఫ్రెష్ గా స్నానం చేసి, దేవుడి గదిలో కాసేపు కూర్చుంది.

ప్రతిరోజు పూజ చేయడం తనకి అలవాటు గనక .

*****

ఆలస్యంగా పడుకోవడంతో ఆలస్యంగా మేలుకున్నాడు విక్రమ్.లేచి చూసేసరికి సోఫాలోనే పడుకున్న తనకు దుప్పటి కప్పి ఉంది.పక్కన

లాప్టాప్ లేకపోవడం గమనించి,ఓ.. మధు చేసింది అన్నమాట ఇవన్నీ అనుకుని, పిచ్చి పిల్లా.. కోపం పోయినట్లుంది అప్పుడే.. అనుకుని నవ్వుకున్నాడు.

ఆఫీస్ కి వెళ్లాల్సిన పని ఉండడంతో, తన రూమ్ లోనే ఫ్రెష్ అప్ అయ్యి, బయటకు వచ్చి మంగ ని పిలిచాడు.

చెప్పండి విక్రం బాబు.. అంటూ వచ్చిన మంగతో "పిల్లలు లేచారా? త్వరగా లేపి, రెడీ చేసి, బ్రేక్ ఫాస్ట్ తినిపించి,తొందరగా స్కూల్ కి పంపించు.. హడావిడిగా పంపించి, బ్రేక్ ఫాస్ట్ స్కిప్ చేయొద్దు.." అంటూ ఎప్పట్లాగే జాగ్రత్తలు చెప్పి,

"మంగా.. అలాగే లోపల ఉన్న డెకరేషన్ అంతా తీసేసి, మళ్లీ ఎప్పటిలా నీటుగా అన్ని సర్దిపెట్టు.."అంటూ చెప్పి కిందికి వెళ్ళాడు బ్రేక్ఫాస్ట్ చేయడానికి.

తను వెళ్లేసరికి పూజ గదిలో నుండి హారతి పళ్లెంతో బయటకు వచ్చి బామ్మ కి, నాన్నకి హారతిస్తున్న మధు కనిపించింది..

తలస్నానం చేసి, చక్కగా చీర కట్టుకుని, చేతినిండా గాజులతో మహాలక్ష్మి లాగా కనిపిస్తోంది మధు.

మధుని చూసి బామ్మ మొహంలో కనిపిస్తున్న ఆనందం చూసి మధు ఇదంతా బామ్మ ని ఆనందపర్చడానికే చేస్తుందా లేక ఇంకేదైనా కారణం ఉందా..అనుకొని టిఫిన్ చేయడానికి నేరుగా డైనింగ్ టేబుల్ దగ్గరికి వెళ్లి కూర్చున్నాడు.

రెడీ అయి వచ్చి, బ్రేక్ఫాస్ట్ చేయడానికి వచ్చిన విక్రం ని చూసి, మధు వెళ్లి టిఫిన్ వడ్డించు వాడికి.. అలాగే మా అందరికీ కూడా అంటూ.. డైనింగ్ టేబుల్ దగ్గరికి నడిచింది రాజేశ్వరి.

అందరూ కూర్చున్నాక వెళ్లి అందరికీ టిఫిన్స్ వడ్డించింది మధు.

నవ్వుతూ తన ప్లేట్లో వడ్డిస్తున్న మధు ని తదేకంగా చూస్తూ, నిన్న రాత్రే కదా తన తప్పేం లేకపోయినా తిట్టాను.. అయినా కూడా ఎలాసంతోషంగాఉంటుంది? అసలు ఏంటి తన క్యారెక్టర్? నాకు అర్థం కావట్లేదు.. అనుకున్నాడు విక్రమ్.

నిజంగానే అమాయకురాలా? లేక నటిస్తోందా? శాస్త్రి చెప్పినట్లు ఆస్తి కోసం నటించే వాళ్ళు, చంపే వాళ్లు కూడా ఉంటారు కదా.. మన జాగ్రత్తలో మనం ఉంటే మంచిది. అనుకున్నాడు.

తన వైపే సీరియస్ గా చూస్తున్న విక్రమ్ ని చూసి ఏమైంది అన్నట్లుగా కళ్ళెగరేసింది మధు.

ఏం లేదన్నట్లు తల అడ్డంగా ఊపి బ్రేక్ఫాస్ట్ చేసేసి వెళ్లిపోయాడు ఆఫీస్ కి.

*****

“అమ్మో..అమ్మో.. ఎలా డెకరేట్ చేసినవి అలాగే ఉన్నాయి.. ఎక్కడ పెట్టినవి అక్కడే ఉన్నాయి.. వాళ్ళ మధ్య ఏం జరగలేదు” అంది పరుగెత్తుకుని వచ్చి ఏదో కొత్త విషయం కనిపెట్టినట్లుగా రాజ్యలక్ష్మి తో మంగ.

“సర్లే ఆ విషయం ఆ పిల్ల మొహం చూడగానే నాకు అర్థమైంది. వాడికి ప్రియా అంటే ఎంత ఇష్టమో నీకు కూడా తెలుసు కదా.. అంత తొందరగా ఈ పిల్లతో ఎలా ఉంటాడు?”

“కానీ అలా అయితే పెళ్లి ఎందుకు చేసుకున్నట్లు అమ్మ..పెళ్లి చేసుకున్నారు అంటే ఎంతో కొంత ఇష్టమో లేదా ఇంకా ఏదో ఉండాలి కదా.. పెళ్లి చేసుకుని ఇలాఎన్నాళ్ళు ఉంటారు?”

“వాడు పెళ్లి చేసుకున్నాడు అంటే ఒక అడుగు ముందుకు వేసినట్లే కొత్త జీవితం స్టార్ట్ చేయడానికి.. ఇక మిగతావి అన్ని అవే జరిగిపోతాయి కాకపోతే కాస్త నెమ్మదిగా..” అంటూ నవ్వి పిల్లల్ని పంపించావా స్కూల్ కి ? అంది.

ఇపుడే వెళ్లారు అమ్మా.. అని,

“అమ్మా.. పిల్లల్ని మధు అమ్మ గారికి బాగా దగ్గర చేస్తే సర్ కూడా అమ్మకి దగ్గరవుతారు కదా..” అంది .

“అదే నా ప్రయత్నం కూడా రేపటినుండి పిల్లల పనులన్నీ తనకే అప్పగిద్దాం.”

*****

చాలా బోరింగ్ గా ఉంది మధు కి. ఇలా ఖాళీగా కూర్చోవడం అస్సలు అలవాటు లేదు తనకి. అన్ని పనులు చేయడానికి మనుషులే ఉన్నారు ఇక్కడ.

విక్కి ఆఫీస్ కి, పిల్లలు స్కూల్ కి వెళ్ళాక తను ఖాళీగా కూర్చోవాలంటే చాలా బోర్ గా అనిపించింది.

తమ గది లో డెకరేషన్ అంతా తీసేసి,నీట్ గా సర్దుతున్న మంగ దగ్గరికి వెళ్ళి, నేను కూడా హెల్ప్ చేస్తాను.. అంటూ తనకు నచ్చినట్లుగా రూమ్ ని కొత్తగా సర్దింది మధు.

“అరే భలే సర్దారమ్మా.. ఇప్పుడు చాలా కొత్తగా, అందంగా కనిపిస్తుంది ఈ గది. మీరు భలే తెలివైనవారమ్మా.. అందుకే నచ్చారు మా విక్రమ్ బాబు కి.. అంత ఈజీ కాదు మా సార్ కి నచ్చడం అంటే..” అంటూ నవ్వింది మంగ.

అవునా.. అంటూ నవ్వింది మధు.

“నిజం అమ్మా.. మా సార్ ఆడవాళ్ళ జోలికి అసలు వెళ్లరు.. సార్ కు పెళ్లి కాకముందు నుండే నేను ఇక్కడ పని చేస్తున్నాను.. ఎంతోమంది ఆడవాళ్లు కాలేజీలో తర్వాత ఆఫీసులో సార్ కి పరిచయమే కానీ ఎవరిని అయినా హద్దులు దాటనివ్వలేదు. అలాంటివారు హఠాత్తుగా ఒకరోజు ప్రియమ్మ గారిని ఇంటికి తీసుకొచ్చారు .

ఆ అమ్మాయి అంటే ఇష్టమని తననే పెళ్లి చేసుకుంటానని మొండి పట్టు పట్టారు..

ఎంతోమంది కోటీశ్వరుల పిల్లలు, మినిస్టర్ల పిల్లలు పెళ్లి చేసుకుంటామని రెడీగా ఉన్న సమయంలో ఎవరో ముక్కు మొహం తెలియని అనాధ పిల్లని తీసుకువచ్చి ఆమెనే పెళ్లి చేసుకుంటాను అన్న విక్రమ్ బాబుపై మండిపడ్డారు అందరు ఇంట్లో.. కానీ ఆయన వణకలేదు జంకలేదు.

ఉండమంటే ఉంటాను.. లేదంటే నేను కూడా వెళ్ళిపోతానని బెదిరించారు..

చాలా ప్రయత్నాల తర్వాత తప్పక వాళ్ళిద్దరికీ పెళ్లి చేశారు.. కానీ ప్రియా అమ్మగారు చాలా మంచివారు.. మంచివాళ్ళనే దేవుడు తొందరగా తీసుకెళ్లిపోతాడు.. అప్పటినుండి విక్రమ్ బాబు పరిస్థితి చూస్తే నిజంగా చాలా బాధేస్తుంది అమ్మ.

అసలు ఈ రోజుల్లో భార్య చనిపోకముందే మరో పెళ్లి చేసుకునే మగాళ్లున్నారు.. అలాంటిది ఇంత పెద్ద ఆస్తిపరుడు, అందగాడు, వయసులో ఉన్న వాడు చనిపోయిన భార్యని తలుచుకుంటూ,ఆమెని మర్చిపోలేక, పిల్లల కోసమే ఒంటరిగా బ్రతుకుతున్నాడు అంటే ఎంత గొప్పవాడు..

కనీసం ఒక్క ఆడదానితో కూడా తనకి సంబంధంలేదు.. నిజంగా దేవుడిలాంటోడే.. అలాంటోడు నీ మెడలో తాళి కట్టాడు అంటేనే మీరు మహా అదృష్టవంతురాలమ్మా.. ఆయన మిమ్మల్ని దగ్గరికి తీసుకోవట్లేదని బాధపడకండి.. మనిషి చాలా మంచోడు.. ఒక్కసారి ఆ మనసులో మీ పట్ల ప్రేమ మొదలైంది అంటే దాన్ని ఎవరు ఆపలేరు ఆయన ప్రేమించడం మొదలు పెడితే వాళ్ళని ప్రాణంగా చూసుకుంటారు అమ్మా.." అంటుంటే ఆమె కళ్ళల్లో నీళ్లు చూసి మధు కళ్ళల్లో కూడా నీళ్లు వచ్చాయి తనకు తెలియకుండానే..

"అంత అదృష్టం నాకు లేదు లే.."అనుకుని, చిన్నగా నవ్వి అక్కడ నుంచి వెళ్ళిపోయింది మధు.

*****

"సర్ మనం ఎన్నో ఏళ్ళు గా ఎదురు చూస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ మనకే వచ్చింది సర్.." అంటూ తన ముప్పయ్ రెండు పళ్ళు బయట పెట్టి మరీ, తన సంబరాన్ని ప్రదర్శిస్తూ చెప్పాడు శాస్త్రి, విక్రమ్ ఆఫీస్ లోకి రాగానే..

అర్థం కానట్లు చూస్తున్న విక్రమ్ చేతిలో ఆ ప్రాజెక్ట్ పేపర్స్ పెట్టాడు శాస్త్రి.

వాటి వంక ఓసారి చూసి.. నిజమా అన్నట్లు ఆనందంగా అడిగాడు విక్రమ్.

అవును అంటూ తలూపి "అలాగే కొత్త సెక్రెటరీ నీ కూడా తీసుకున్నాను సర్.. మంచి అమ్మాయి పైగా మనకి కావాల్సిన క్వాలిఫికేషన్స్ అన్నీ ఉన్నాయి" అంటూ, పద్మా అని పిలిచాడు..

పంజాబీ డ్రెస్ లో అమాయకం గా ఉన్న 22 ఏళ్ల అమ్మాయి సర్ అంటూ కంగారుగా వచ్చింది.

"ఈ అమ్మాయే సర్.. చూడటానికి అమాయకం గా ఉన్నా, వర్క్ లో పెర్ఫెక్ట్ సర్."అన్నాడు శాస్త్రి ఉత్సాహం గా.

"ఒకే శాస్త్రి గో అహెడ్.. ఆఫీస్ లో అందరికీ చెప్పు.. ఈ ప్రాజెక్ట్ చాలా ఇంపార్టెంట్ అని, సక్సెస్ఫుల్ గా కంప్లీట్ అయ్యేదాకా అందరినీ సీరియస్ గా వర్క్ పై మాత్రమే శ్రద్ధ పెట్టమను" అంటూ చెప్పి,

ఈ విషయం నాన్నకి చెప్తే చాలా సంతోషిస్తారు. అని ఫోన్ చేశాడు విక్రమ్..

అపుడే అందరూ హాల్ లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

విక్రమ్ ఫోన్ చేస్తున్నాడు అంటూ,

నిజమా.. గ్రేట్ నాన్నా.. కంగ్రాట్స్.. అని, "అమ్మా.. మన కంపెనీ కి ప్రపంచం లో నే నంబర్ ఒన్ కంపెనీ నుండి డీల్ వచ్చింది.. ఈ దెబ్బ తో ఇక ఇక్కడ మన కంపెనీ నంబర్ 1 అవ్వడం ఖాయం.." అంటూ ఎగిరి గంతేసినంత పని చేసాడు క్రిష్ణ.

"అవునా.. చుసావారా.. మధు వచ్చిన వేళా విశేషం అంటూ ఆకాశానికి ఎత్తేసింది బామ్మా మధు నీ.. కొంతమంది కాలు పెడితే అలా ఉంటుంది" అంది ఓరగా రోజీ వైపు చూస్తూ..

తల పట్టుకుంది రోజీ.

మధు బొమ్మ మాటలు పెద్ద గా పట్టించుకోలేదు కానితనకి చాలా సంతోషం గా అనిపించింది..

అది తను పని చేసే కంపెనీ కాబట్టి..

సర్ కి కంగ్రాట్స్ చెప్పాలనిపించింది.. ఫోన్ చేసింది వెంటనే..

కంగ్రాట్స్ సర్.. అన్న మధు గొంతు లో సంతోషం వినిపించింది.. "థాంక్యూ మధు.. అని ఇందులో నీ పాత్ర కూడా ఉంది.. ఈ విజయం లో నీకూ భాగముంది . ఒక్క మీటింగ్ కూడా కేన్సిల్ కాకుండా చాలా సక్సెస్ఫుల్ గా అన్ని మీటింగ్స్ అరేంజ్ చేశావ్.. నీ పెర్ఫెక్ట్ షెడ్యూల్స్ వల్లేఇది సాధ్యం అయింది.." అన్నాడు మెచ్చుకోలు గా.

విక్రమ్ తన గురించి పాజిటివ్ గా మాట్లాడటం చాలా ఆనందం గా అనిపించింది మధు కి..

"థాంక్యూ సర్.. క్రెడిట్ ఇవ్వడం అవసరం లేని చిన్న చిన్న వాటిని కూడా గుర్తించి, మెచ్చుకోవడం మీ గొప్పతనం సర్"అంది గౌరవం గా.

"సరే నాకు పనుంది.. ఉంటాను." అని పెట్టేశాడు.

"సర్.. ఇంత గొప్ప ప్రాజెక్ట్ వచ్చినందుకైనా మంచి పార్టీ అరేంజ్ చేయాలి సర్.." అన్నాడు శాస్త్రి.

"చెయ్యి శాస్త్రి వద్దని ఎవరన్నారు? డబ్బు ఎంత కావాలో నీకు పంపిస్తా.. గ్రాండ్ గా అరేంజ్ చెయ్.."

"సర్ అలా కాదు సర్.. మీరు మూడేళ్లు గా ఇదే చెబుతున్నారు. నేను కూడా మీకు ఇష్టం లేదని నేనే దగ్గరుండి చూసుకుంటున్నాను ప్రతిసారీ..

కానీ ఈసారి మాత్రం మీరే దగ్గరుండి పార్టీ లో అన్నీ చూసుకుంటూ,గెస్ట్ లతో ఇంటరాక్ట్ అవ్వాలి...

పైగా మీకు పెళ్లి అయింది అని అందరికీ తెల్సు.. కానీ దానికోసం మీరు చిన్న పార్టీ ఐనా ఇవ్వలేదని మన స్టాఫ్ కూడా ఫీల్ అవుతున్నారు.. మంచి ప్రాజెక్ట్ వచ్చింది కదా. ఆ కంపెనీ వాళ్ళని కూడా పార్టీ కి ఇన్వైట్ చేస్తే మంచి రిలేషన్ ఏర్పడుతుంది సర్..మీరు లేకుండా పార్టీ ఇస్తే మర్యాద ఇవ్వలేదు అనుకుంటారు.."

"తప్పదా?"

"తప్పదు సర్.."

"సరే నేను పార్టీ టైమ్ కి వస్తాను.. కాసేపు ఉండి వెళ్ళిపోతాను.. అరేంజ్మెంట్స్ అన్ని నువ్వే చెయ్.."

అలాగే.. సర్ అంటూ.. హుషారుగా వెళ్ళాడు శాస్త్రి..

*****

ప్రియ చనిపోయిన దగ్గరినుండి పార్టీ లు, తాగడం అన్ని వదిలేశాడు విక్రమ్..

ఆఫీస్, ఇల్లు, పిల్లలు అంతే.. ఇన్నాళ్ల తర్వాత మళ్ళీ ఇవాళే పార్టీ కి అటెండ్ అవ్వబోతున్నాడు.

సాయంత్రానికి పార్టీ కి అన్ని ఆరెంజ్ చేశాను సర్.

ఒకే శాస్త్రి.. నేనుపార్టీ టైం కి వచ్చేస్తాను.

అని డైరెక్ట్ గా స్కూల్ కి వెళ్లి, పిల్లలని తీసుకుని ఇంటికి వచ్చాడు విక్రమ్.

విక్రమ్ రాగానే హాల్ లోనే ఎదురుచూస్తున్న అందరూ కంగ్రాట్స్ చెప్పారు..

"రేయ్ విక్కీ.. నీ గురించి,మన కంపెనీ గురించి నా టెన్షన్స్ అన్ని పోయాయి ఈరోజుతో.. మధు నీ పెళ్లి చేసుకోవడం అనే నీ నిర్ణయం తో నువ్వు చాలా మంచి పని చేశావ్ రా.. నిజంగా తన రాక మన జీవితాల్లో కొత్త వెలుగు నీ తీసుకొచ్చింది రా.." అంటూ హగ్ చేసుకున్నాడు విక్రమ్ తండ్రి కృష్ణ..

ఏం అర్థం కాలేదు విక్రమ్ కి..

ఆ లోపే బామ్మ కూడా "మా బంగారు తల్లి అడుగు పెట్టిన వేళా విశేషం రా కన్నా.. నీ జీవితం కొత్త గా మారబోతోంది.. నేను చెప్పాను కదా.. పంతులు గారు ముందే చెప్పారు.."అంటూ విక్రమ్ నుదుటన ముద్దు పెట్టింది.

"ఎనీవే.. ఇది మధు వల్ల జరిగినా జరగకపోయినా నువ్వు డెవెలప్ అవుతున్నావు.. మన కంపనీ కి, మంచి ప్రాజెక్ట్ దొరికింది. నువ్వు ఇంకా సక్సెస్ కావాలని కోరుకుంటున్నా విక్కీ..మీరిద్దరు సంతోషంగా ఉండాలి లైఫ్ లాంగ్.." అంది రోజీ..

అసలు ఏం జరుగుతుందో కాసేపటిదాకా అర్థం కాలేదు విక్కి కి.. ఏంటి వీళ్లంతా మధు ని తెగ పొగిడేస్తున్నారు..అనుకుని అయోమయం గా చూసాడు మధు వంక.

నవ్వుతూ, సంతోషం గా చూస్తోంది అందరి వైపు..

మధు.. వెళ్లి నువు చేసిన పాయసం తీసుకురా.. అంది బామ్మ..

అలాగే బామ్మా అంటూ,వెళ్లి స్వీట్ తీసుకొచ్చింది మధు.

ముందుగా విక్కి బాబు కి ఇవ్వు.. అన్న బామ్మ మాటతో, విక్రమ్ కి ఇచ్చింది.

మధు నే సూటి గా చూస్తూ తీసుకున్నాడు..

తర్వాత అందరికీ ఇచ్చింది. పిల్లలు చాలా ఇష్టం గా తిన్నారు చాలా బాగుంది మమ్మీ.. నువ్వు చేసిన పాయసం.. అంటుంటే స్వీట్ నోట్లో పెట్టుకున్న విక్రమ్ కి పొలమారింది .

మెల్లిగా నాన్నా వాటర్ తాగు.. అంటూ ఇచ్చింది బామ్మ..

ఇంక అక్కడ ఉండలేక, తన రూం లో కి వెళ్ళిపోయాడు విక్రమ్.

కాసేపటి తర్వాత పిల్లలతో పాటు తన గది లోకి వచ్చిన మధు నీ చూసి, నీతో మాట్లాడాలి అన్నాడు సీరియస్ గా..

"పిల్లలకి స్నానం పోయమని చెప్పారు బామ్మా.."అంది బెరుకుగా చూస్తూ.

అవన్నీ మంగ చూసుకుంటుంది.. అని "పిల్లలూ.. మంగ ఆంటీ దగ్గరికి వెళ్ళండి నాన్నా.." అన్నాడు విక్రమ్.

"లేదు మాకు మమ్మీ నే పోయాలి.. ఇన్నాళ్లు మమ్మీ లేదు కాబట్టి మంగాంటీ పోసింది" అంది ఆద్య ముద్దు ముద్దు గా..

"చెప్పిన మాట వినాలి.. మీరు ఆంటీ దగ్గరికి వెళ్తారా లేదా?"అన్నాడు కోపంగా.

అతని కోపానికి పిల్లలు భయపడి ఏడవటం మొదలుపెట్టడం తో మధు కి బాధ గా అనిపించి..

"నేను మంగ కే అప్పగించి వస్తాను.. పిల్లల్ని ఏం అనకండి.." అని వాళ్ళని ఎత్తుకుని కిందికి తీసుకెళ్ళింది. ఇద్దరికీ చెరొక చాక్లెట్ ఇచ్చి.. నాకు వేరే పని ఉంది.. మీరు రెడీ ఐ వచ్చేయండి. తర్వాత మనం ఆడుకుందాం ఓకే నా.. అంటూ నచ్చచెప్పి వెళ్ళింది విక్రమ్ దగ్గరికి..

*****

"ఏంటి సర్ అంత కోపం ఎవరిమీద? ఎందుకు?" అంది.

"నీ మీదే.. అసలేం చేస్తున్నావ్ నువ్వు? తెలుస్తోందా నీకైనా..?"

"ఏం చేశాను.. చెప్పండి.. నాకేం తెలియట్లేదు. మీకేం కనిపిస్తుందో అది చెప్పండి."

"ఇంట్లో అందరూ చేసే హడావిడి చూస్తూ మురిసిపోతున్నావ్. నువ్వు ఇంటికి వచ్చిన కోడలివి అని ఫీల్ అవుతున్నావా.. నువ్వు వచ్చావు కాబట్టే అదృష్టం వచ్చిందని, కాంట్రాక్టు రద్దు చేసుకొని పర్మినెంట్గా ఇక్కడే ఉండనివ్వాలని చూస్తున్నావా.."

"బామ్మ ఎప్పుడు ఏదో ఒకటి అంటూనే ఉంటుంది. వాటన్నింటిని నేను వ్యతిరేకించలేను. ఆవిడ అన్నంత మాత్రాన నేను ఇక్కడే ఉండిపోను." అంది విసురుగా.

"అసలు ఆవిడతో అవన్నీ అనిపించేది నువ్వే కదా.. ఆవిడకి నచ్చిన పనులన్నీ చేస్తూ, ఆవిడని బాగానే బుట్టలో వేసుకుంటున్నావ్.. చూసానులే పొద్దున పూజలు చేసి హారతులు ఇచ్చి.. కాక పట్టడానికేగా ఇవన్నీ.."

"హలో సర్.. నాకు ఎవ్వరిని కాకా పట్టాల్సిన అవసరం లేదు.ప్రతిరోజు నేను ఇంట్లో పూజ చేసుకుంటాను. పూజ చేయడం చిన్నప్పటినుండి నా అలవాటు.నాలా నేను ఉండటం కూడా తప్పే అంటే దానికి నేనేం చేయలేను సర్..

పోనీ ఒక లిస్టు రాసి ఇవ్వండి.. మీ ఇంట్లో ఉన్నన్ని రోజులు నేను చేయాల్సిన పనులు ఏంటి? చేయకూడని పనులేంటి? అని.. రోజూ ఆ పేపర్ చేతిలో పట్టుకుని చదువుకుంటూ, ఏం చేయాలో అది మాత్రమే చేస్తాను..

మనం రాసుకున్న అగ్రిమెంట్లో మీరు రాసిన నిబంధనలన్నింటికీ నేను లోబడే ఉంటున్నాను.. అలాగే మీకు కొత్తగా ఇంకా ఏమైనా కావాలంటే కూడా యాడ్ చేయండి.. అవన్నీ చదువుకునీచేయకుండా ఆగుతాను.."

"ఏంటి వెటకారమా?"

"సార్ ప్లీజ్.. నన్ను విసిగించకండి. నన్ను ఏం చేయమంటారో చెప్పండి చేస్తాను."

"నా పిల్లలతో మమ్మీ అని పిలిపించుకోకు.. పిల్లలకి దూరంగా ఉండు. బామ్మకిష్టమైన పనులు చేయొద్దు. బామ్మతో ఎక్కువగా మాట్లాడొద్దు.. వాళ్లతో మంచి రిలేషన్ పెంచుకోవద్దు."

"గొడవపడమంటారా నన్ను? మీ పిల్లల్ని తిట్టమంటారా? లేక కొట్టమంటారా? దగ్గరికి వస్తే. అది కూడా చెప్పి పుణ్యం కట్టుకోండి."

"ఏంటి నామీదకే ఎదురు తిరుగుతున్నావా? ఇంట్లో వాళ్ళందరి సపోర్ట్ చూసుకొని."

"సార్ నాకు ఎవరి సపోర్ట్ అవసరం లేదు.. బేసిగ్గా నాకు చిన్న పిల్లలంటే ఇష్టం. అలాంటిది వాళ్లే వచ్చి మీద పడుతుంటే, దూరంగా తోసేసే అంత క్రూరు రాలిని నేను కాదు."

"అంటే నేను రాక్షసుడిలా కనిపిస్తున్నానా నీ కళ్ళకు?"

"అది మీకే తెలియాలి.."

"మధూ.. నేను నీ బాస్ ని. నేను చెప్పినట్లు నువ్వు చేయాలి అంతే.."

"మీరు చెప్పినట్లు మీ భార్యగా నటించడానికే వచ్చాను. నటిస్తున్నాను.. అంతేకానీ ప్రతి చిన్న విషయం మీరు చెప్పినట్లు చేయాలి. అంటే నావల్ల

కాదు. ఎందుకంటే నేను మనిషిని.. మిషిన్ ను కాదు.. నాకు కొన్ని ఎమోషన్స్ ఉంటాయి. వాటిని నేను కంట్రోల్ చేసుకోలేను. మీకు అవన్నీ ఇష్టం లేకపోతే నన్ను వెంటనే పంపించేయండి. మీ ఇంట్లో వాళ్లకి ఏమైనా చెప్పుకోండి కారణాలు.."

"శాస్త్రి... మంచి అమ్మాయి.. చెప్పినట్లు వింటుంది అన్నావ్.. తీరా ఈ అమ్మాయిని చూస్తే ఇలా.." అని పైకే అని, కోపంగా బయటికి వెళ్లిపోయాడు విక్రమ్.

విక్రమ్ వెళ్ళిన వైపే చాలాసేపు కోపంగా చూసి, అక్కడే సోఫాలో పడుకుంది కాసేపు ఏడుస్తూ..

*****

పార్టీ చాలా గ్రాండ్ గా ఏర్పాటు చేశారు.

కొత్త ప్రాజెక్టు వచ్చిన కంపెనీ వాళ్లకి థాంక్స్ చెప్పి స్టార్ట్ చేశాడు విక్రమ్ పార్టీని..

"మీరు కూడా కంపెనీ ఇవ్వాలి మాకు.. పార్టీ ఇచ్చి మమ్మల్ని తాగమంటే మాకు బాగోదు.." అన్నాడు కొత్త కంపెనీ మేనేజర్ మిస్టర్ రావు..

చాలాసార్లు అడిగాక బాగోదని ఒక గ్లాస్ తాగాడు విక్కీ.

అపుడే ఆఫీస్ లో ఎవరో అన్నారు..

" సర్ పెళ్లి అయిందో లేదో.. ఎంతదృష్టంకలిసి వచ్చింది.. "

అంతే ఆ మాటలు చెవిలో పడగానే,ఇంట్లో జరిగిందీ, మధు మాట్లాడినదంతా గుర్తొచ్చి, ఇక ఆగాలనిపించలేదు.. గ్లాసుల మీద గ్లాస్ లు ఖాళీ చేస్తూనే ఉన్నాడు.

అప్పటికే శాస్త్రి గమనించి, "సర్ మీరు ఇప్పటికే ఎక్కువ తాగారు.." అని మెల్లిగా చెవిలో చెప్పాడు..

"పర్లేదు నేను బానే ఉన్నా.. ఇంకా తే వో.." అన్నాడు విక్రమ్. అప్పటికే మాటలు ముద్ద ముద్దగా వస్తుంటే

"సర్ వద్దు.."మళ్ళీ అన్నాడు శాస్త్రి..

"ఏ ఏంట్రా నాకే చెప్తున్నావా నీతులు? అందరూ నాకే చెప్పే వాళ్ళు అయ్యారా?"అంటూ కోపంగా అరవడం తో..

అందరి లో అవమానంగా అనిపించి.. అక్కడినుండి వెళ్ళిపోయాడు శాస్త్రి..

స్టాఫ్ అందరూ ఆశ్చర్యం గా చూస్తూ, గుసగుసలు మాట్లాడుకోవడం చూసి, బాధనిపించి, మౌనంగా కూర్చున్న శాస్త్రి దగ్గరికి కొత్త సెక్రటరీ పద్మ వచ్చింది.

"బాధపడకండి.. సార్ కి నేను నచ్చ చెప్పి తీసుకొస్తాను కార్ దగ్గరికి.. మీరు రెడీగా ఉండండి సర్ కార్ లో.. ఇంటికి తీసుకెళ్లండి సార్ ని.." అనడంతో,

"వద్దులే పద్మా.. సార్ నిన్నేమైనా అంటే మళ్ళీ బాధపడతావు. అసలే చాలా సెన్సిటివ్." అన్నాడు శాస్త్రి

"ఏం పర్లేదు సార్.. మీరు, సర్ ఇలా ఇంతమందిలో అవమాన పడటం కంటే అది ఏం పెద్ద విషయం కాదు."

అని విక్రమ్ దగ్గరికి వెళ్ళింది.

"సార్.. ఇప్పటికే చాలా ఆలస్యమైంది.. ఇంటిదగ్గర పిల్లలు ఎదురు చూస్తూ ఉంటారు. రండి.. సార్.." అంటూ మెల్లిగా నచ్చ చెప్పడానికి ప్రయత్నించింది.

పిల్లలు.. అనే మాట వినేసరికి ఈ లోకంలోకి వచ్చాడు విక్రమ్. మెల్లిగా లేచి నిలబడి నడవడానికి ప్రయత్నించాడు.. కానీ అంతలోనే తూలి పడబోయాడు.

వెంటనే పద్మ, పడకుండా పట్టుకుని, నడిపించుకుని మెల్లగా తీసుకెళ్లింది.

అప్పటికే శాస్త్రి కారులో రెడీగా ఉండడంతో విక్రమ్ ని కార్లో కూర్చోబెట్టింది పద్మ..

ఇంటికి తీసుకెళ్లాడు శాస్త్రి.

దగ్గరికి వెళ్ళాక, మధుకి ఫోన్ చేసి,

" మధూ.. సార్ కొంచెం పార్టీలో ఎక్కువగా తాగారు.. రాజ్యలక్ష్మి మేడం చూస్తే, పెద్ద గొడవ చేస్తుంది. జాగ్రత్తగా లోపలికి తీసుకెళ్ళి పడుకోబెట్టు.. దగ్గరికి వస్తున్నాను.." అని చెప్పాడు.

సరే అని మధు శాస్త్రి వచ్చేదాకా వెయిట్ చేసి, వచ్చిన తర్వాత నెమ్మదిగా మెయిన్ డోర్స్ తీసి బయటకు రాబోతుంటే, అక్కడే పడుకున్న మంగ ఈ టైంలో ఏంటమ్మా? అని అడిగింది లేచి.

ఏం లేదు.. నువ్వు పడుకో. అని చెప్పి బయటకు వెళ్లి, తూలుతున్న విక్రమ్ ని జాగ్రత్త గా తమ గదిలోకి తీసుకెళ్తుండగా, నోరు తెరిచి ఆశ్చర్యం గా చూస్తున్న మంగ నీ చూసి,

ష్.. సైలెంట్ గా పడుకో. బామ్మ కి ఏం చెప్పొద్దు అని బెదిరిస్తున్నట్లు చెప్పి, విక్రమ్ బరువంతా తనమీదే వేస్తుండటం తో ఆ భారాన్ని మోయలేక, పళ్ళు బిగపట్టి, నెమ్మది గా అడుగులో అడుగు వేసుకుంటూ, బెడ్ రూం తలుపులు తోసి, బెడ్ దాకా తీసుకెళ్ళింది ఆపసోపాలు పడుతూ..

“ఇంత బరువుంటారా.. వామ్మో..” అనుకుంది మెల్లిగా బెడ్ మీద పడేసి..

అక్కడే పక్కన కూలబడింది ఆయాసపడుతూ..

తన ఆయాసం పోయాక, నెమ్మదిగా అతని షూస్ విప్పుతూ,అతని పక్కనే పడుకున్న పిల్లలని చూసింది.

ఇప్పటిదాకా డాడీ డాడీ.. అని జపం చేసి చివరికి తను చెప్పే కథలు వింటూ, నవ్వి నవ్వి పడుకున్న వాళ్ళ మొహాలు ఇంకా నవ్వుతున్నట్లే ఉన్నాయి..

వాళ్ళని చూడగానే, తన మొహం లోకి కూడా నవ్వు వచ్చింది.

మళ్ళీ విక్రమ్ మొహం చూడగానే, పిల్లల కి అతనికి పెద్ద తేడా ఏం కనిపించలేదు మధు కి. ఏమి తెలియని పసి పాపల్లానే కనిపించారు ముగ్గురు ఆ క్షణం మధు కి..భలే ముద్దుగా అనిపించారు ముగ్గురు..

నన్ను చెడామడా తిట్టి, ఫుల్లు గా తాగి, ఊగుతూ వచ్చిన ఈ జెంటిల్మెన్ చిన్న బాబు లా అనిపించిన తన ఊహలకు మళ్ళీ తనే నవ్వుకుని, నెమ్మది గా అతని పై దుప్పటి కప్పి, అక్కడి నుండి వెళ్ళడానికి లేచి నిలబడింది.

ముగ్గుర్నీ తృప్తి గా చూసుకుని వెళ్ళబోతుండగా, సడెన్ గా తన కొంగు పట్టుకుని లాగినట్లు అనిపించడం తో, గిరుక్కున వెనక్కి తిరిగి చూసింది.

ఎప్పటిలాగే కళ్ళు మూసుకుని హాయి గా నిద్రపోతున్న విక్రమ్ నీ చూసి, అతని చేతి లో ఉన్న తన కొంగు చూసి షాక్ అయింది.

*****

విక్రమ్ చేతిలో తన కొంగును పట్టుకోవడం చూసి, షాక్ అయి, నెమ్మదిగా విడిపించుకోవడానికి ప్రయత్నించింది మధు.

కానీ అస్సలు వదల్లేదు విక్రమ్..

అతని మొహం వైపు చూస్తేనేమో కళ్ళుమూసుకునే ఉన్నాడు..

కష్టపడి అతని చేతుల్ని విడిపించడానికి ప్రయత్నిస్తుండగానే, హఠాత్తుగా మధు చేతులు పట్టుకుని తన మీదికి లాక్కున్నాడు అతను.

ఆ హఠాత్పరిణామానికి నివ్వెర పోయింది మధు. అసలు ఏం జరుగుతుందో అర్థం కాలేదు కాసేపటి దాకా..

ఆమెకి అర్థం అయ్యేసరికే ఆమెను పూర్తిగా తన మీదకు లాక్కొని చేతులతో బంధించేశాడు లేవకుండా.

అతని ఊపిరి ఆమెకు వెచ్చగా తగులుతోంది..

ఆమె శరీరమంతా అతని మీదే ఉంది.. అతని స్పర్శ ఆమెను నిలువెల్లా దహించి వేస్తోంది.

ఏదో తెలియని మత్తు ఆమెను ఆవరిస్తున్నట్టుగా అనిపించింది.

ఆ మత్తు నుండి తేరుకొని, అతని నుండి విడిపించుకోవడానికి ప్రయత్నిస్తుంటే, ఇంకా గట్టిగా ఆమెను హత్తుకుని..

"ఎక్కడికి వెళ్తావు నన్ను వదిలేసి?"అన్నాడు ముద్దముద్దగా..

అతని మాటలు విని ఏంటి ఇది అందిఅతని వైపు చూసి..

కానీ అతని కళ్ళు మూసుకునే ఉన్నాయి.. మత్తులో ఉన్నాడేమో అని మెల్లిగా ఆమె నడుముని చుట్టుకున్న తన చేతులు రెండిటిని విడదీయడానికి ప్రయత్నించింది.

కానీ అస్సలు ఆమె వల్ల కాలేదు.

మెల్లిగా అతనే తన చేతుల్ని విడిపించాడు.

హమ్మయ్య అనుకునే అంతలోనే అతని చేతులు ఆమె శరీరాన్ని కోరికతో తాకడం మొదలెట్టాయి.

అతను ఏం చేస్తున్నాడో అర్థమయ్యి, అరిచేలోపే ఆమె పెదవుల్ని అతని పెదవులు మూసిపేసాయి..

ఏంటి ఇతనిని ఎలా అర్థం చేసుకోవాలి అన్న ఆమె ఆలోచనలన్నీ ఆదిలోనే తుంచేస్తూ, అతని ముద్దు ఆమెలో కొత్త పరవశాన్ని కలిగించింది.

ఆమెకి తెలియకుండానే అతనికి సహకరిస్తోంది ఆమె శరీరం..

అది అతనిపై అంతర్లీనంగా ఆమెకు ఉన్న ప్రేమో.. లేదా ఆమె శరీరానికి కలిగిన సుఖమో అర్థం కాలేదు..

ఆమె మనసు ఓ వైపు వద్దంటూనే మరోవైపు అతని మొహాన్ని ఇష్టంగా చూస్తోంది..

అంతలోపే ఆమెపైకి చేరిన అతను.. నెమ్మదిగా ఆమె చీర పైట తొలగించి, ఆమె గుండెల్లో తలపెట్టి ఆమె మనసు కోసమేమో బహుశా వెతుకుతున్నాడు.

నాకు తెలియకుండానే నా మనసులో నువ్వు చేరిపోయావు అన్నట్లు.. ఆమె అతని తలని తన గుండెలకు అదుముకుంది..

అప్పుడు వినిపించాయి అతని నోటి నుండి..

"ఐ లవ్ యూ ప్రియా..

లవ్ యూ సో మచ్.."అనే తూటాల లాంటి మాటలు..

ఆ మాటలు మధు చెవిలో పడగానే.. టక్కున ఆమెలోని అంతరాత్మ నిద్ర లేచింది.

“ఏం చేస్తున్నాను నేను.. అతను అంటే స్పృహలో లేకుండా తన భార్య అనుకుని నాతో ఇలా చేస్తున్నాడు.. కానీ నేను స్పృహలోనే ఉన్నాను కదా.. తనని అడ్డుకోకుండా అతనికి సహకరిస్తున్నాను ఏంటి? నిజంగానే నాది అంత చీప్ క్యారెక్టరా?”అనుకుని,

వెంటనే ఆమె బలమంతా ఉపయోగించి అతన్ని పక్కకు తోసి, అక్కడి నుండి లేచి దూరంగా పరిగెత్తింది.

బాగా మత్తులో ఉండడంతో అతను, ప్రియా ఎక్కడికి? నన్ను వదిలి మళ్లీ వెళ్తున్నావా? అంటూ మత్తులోనే పిలిచి పిలిచి,మత్తు వల్ల లేవలేక అలాగే నిద్రపోయాడు.

కానీ రాత్రంతా నిద్ర పట్టలేదు మధుకి.. అసలు ఇలా ఎలా చేయగలిగాను నేను? నిజంగానే నేను అతనిని ప్రేమిస్తున్నానా? నాకు తెలియకుండానే నాలో అతని మీద ప్రేమెలా పుట్టింది..? నిజంగానే మా మధ్య జరగరానిది ఏదైనా జరిగి ఉంటే ఎలా ఉండేది..

ఆలోచిస్తుంటేనే తన మీద తనకే అసహ్యంగా అనిపించింది.. అందుకేనేమో బహుశా సార్ ఊరికే నన్ను అనుమానిస్తూ, తిడుతుంటారు.. అనుకుంది కోపంగా.

అప్పటికి అర్ధరాత్రి 12 అవుతుంది.. అసలు నిద్ర పట్టట్లేదు ఆలోచనలతో.

అక్కడే సోఫాలో పడుకుని విక్రమ్ వైపు,పిల్లల వైపే చూస్తూ ఉండిపోయింది.

మధ్యమధ్యలో ప్రియ.. అంటూ కలవరిస్తున్న విక్రమ్ కలవరింతలు మరింత కలవరపెట్టాయి మధు ని.

అప్పుడే పక్కనే పెట్టిన తన ఫోన్ లో మెసేజ్ సౌండ్ వినిపించడంతో చేతిలోకి తీసుకుంది.

వాట్సాప్ లో ఎవరో కొన్ని ఫోటోలు సెండ్ చేశారు.

ఏంటబ్బా అని ఓపెన్ చేస్తే.. విక్రమ్ ఎవరో అమ్మాయితో క్లోజ్ గా ఉన్న ఫోటోలు.. ఇద్దరు హగ్ చేసుకున్నట్లు..కార్లో ముద్దు పెట్టుకుంటున్నట్లు ఉన్నాయి..

అమ్మాయి మొహం స్పష్టంగా కనిపించడం లేదు.

ఛీ.. ఏంటివి? నాకు పంపించారు ఎవరు?

అయినావిక్రమ్ సార్ అమ్మాయిల జోలికే వెళ్లరని, చాలా మంచివారని అందరూ ఊదరగొడుతున్నారు కదా.. అలాంటి సార్ ఒక అమ్మాయితో ఇలా ఎందుకు క్లోజ్ గా ఉంటారు..

కానీ ఫోటోలో స్పష్టంగా కనిపిస్తోంది..

"మరి ఇన్ని రోజుల నుండి నాతో ఎప్పుడు తప్పుగా బిహేవ్ చేయలేదే..?" అని మళ్లీ విక్రమ్ ని సమర్థిస్తోంది ఆమె అంతరాత్మ.

"అవును.. ఒకవేళ నీతో తప్పుగా బిహేవ్ చేస్తే, మీది కాంట్రాక్ట్ మ్యారేజ్ అనే విషయం నువ్వు చెప్తే అతని పరువు పోతుంది కదా.. అలా కాకపోయినా నువ్వు తనతోనే పర్మనెంట్ గా ఉండిపోతాననే ప్రమాదం కూడా ఉంది కదా.. అందుకే నీ దగ్గర జాగ్రత్తగా ఉంటున్నాడేమో.." అంటూ మరోవైపు

"సార్ మంచి వారు కాదా.."

"కాదు చాలా మంచివారు.."

ఇలా ఆమెలో ఆమెకే జరిగిన సంఘర్షణ తలనొప్పి తెచ్చింది..

మళ్లీ ఆ ఫోటోలను ఒకసారి స్పష్టంగా చూసింది.

అది ఇప్పుడు వేసుకున్న డ్రెస్సే అంటే ఇందాకే జరిగింది ఈ విషయం..

బహుశా పార్టీలో ఎవరో అమ్మాయి ఉంటారు..

అప్పుడు గుర్తొచ్చింది.. ఇందాక జరిగిన విషయం..

సార్ మత్తులో ఉండి, నాలాగే ఆ అమ్మాయిని కూడా ప్రియా అనుకోని అలా ఉన్నారేమో..

అయినా ఇవన్నీ ఫోటోలు తీసి కావాలని నాకు పంపడం అంటే.. సార్ వెనకాల ఏదో కుట్ర జరుగుతుంది.. కావాలని సార్ కి నాకు మధ్య గొడవ జరగాలని చూస్తున్నారా.. మా ఇద్దరికీ గొడవ జరిగితే వాళ్లకి ఏంటి ఉపయోగం..

ఈ విషయం సార్ కి రేపు చెప్పాలి.. అనుకొని కళ్ళు మూసుకుని పడుకుంది.

కానీ విక్రమ్ స్పర్శ పదేపదే గుర్తొస్తూ, తొలిముద్దులోని తీపిదనం పదేపదే ఆమెకు గుర్తుకు తెస్తూ నిద్రను దూరం చేస్తుంది..

మమ్మీ.. ఇంకా లేవలేదు ఏంటి మమ్మీ?అంటూ పిల్లలు పిలుస్తుండగా మెలకువ వచ్చింది. మధుకి.

అప్పటికి గంటయిందేమో తను పడుకొని అంతే..

కళ్ళు తెరవడానికి చాలా కష్టంగా అనిపించింది.. భారంగా కళ్ళు తెరిచి, మీరు కిందికి వెళ్ళండమ్మా.. మంగ మిమ్మల్ని రెడీ చేస్తుంది..అని పిల్లలను కిందికి పంపించింది..

బాగా నిద్ర వస్తుంది పడుకోవాలనిపించింది.. కానీ ఈ సమయం దాకా పడుకుంటే బాగోదని, నెమ్మదిగా తను కూడా లేచి కిందికి వెళ్ళింది ఫ్రెషప్ అయి.

ఎప్పటిలాగే పూజ గదిలోకి వెళ్ళిపోయి ఒక అడుగు వెనక్కి వేసింది మళ్లీ.. సార్ అన్నదే నిజమవుతుందా.. నిజంగానే నేను అందర్నీ ఇంప్రెస్ చేస్తూ ఈ విషయాన్ని ఇంకా కాంప్లికేట్ చేస్తున్నానా అని ఆలోచించి.. వెనక్కి రాబోతుంటే

ఏమైంది మధు.. పూజ కాలేదా ఇంకా.. అంటూ వచ్చిన బామ్మ ని చూసి ఇప్పుడే వెళ్తున్నాను బామ్మా.. అని లోపలికి అడుగేసింది ఏదైతే అది అయిందని..

పూజ అయిపోయాక, ఎక్కడ విక్రమ్ వస్తాడో అని హడావిడిగా అందరికీ హారతి ఇచ్చేసి హమ్మయ్య అనుకుని సైలెంట్ గా కూర్చుంది హాల్లో.

"విక్రమ్ బాబు ఇంకా రావట్లేదు ఏంటమ్మా బ్రేక్ఫాస్ట్ చేయడానికి?వెళ్లి చూడు.."అని పంపించింది బామ్మ.

కానీ మధుకి అతని దగ్గరికి వెళ్లాలంటేనే తెలియని భయంగా ఉంది .

తప్పదా అన్నట్లుగా చూసి సరే అని తలాడించి పైకి వెళ్ళింది.

"ఏంటో ఈ పిల్ల.. మొగుడు దగ్గరికి వెళ్ళమంటే ఉత్సాహంగా వెళ్లాలి గాని.. ఏదో సింహం దగ్గరికి వెళ్ళమన్నట్టుగా వెళ్తుంది.." గొణుక్కుంది రాజ్యలక్ష్మి తనలో తానే..

*****

భయం భయంగా మధు లోపలికి వెళ్లేసరికే, ఫ్రెష్ అప్ అయ్యి రెడీ అయ్యి బయటకు రాబోతున్న విక్రమ్ కనిపించాడు.

అతడిని చూడగానే ఏదో తెలియని ఫీలింగ్ వచ్చేసింది మధు కి.ఎప్పట్లా బాస్ లా కాకుండా కొత్తగా కనిపిస్తున్నాడు తన కళ్ళ కి.

"వస్తున్నారా? ఇంకా రావట్లేదు ఏంటా అని వచ్చాను నేనే.. రండి."అంటూ వెనక్కి తిరిగింది కిందికి వెళ్ళడానికి.

"మధు.." అని పిలిచాడు ఇబ్బందిగా..

గొంతులో ఏదో తేడా అనిపించింది.

అలాగే నిలబడి, అతని వైపు తిరిగి చూడకుండా ఏంటి?అంది.

"రాత్రి నిన్నేమైనా ఇబ్బంది పెట్టానా?"అడిగాడు నెమ్మదిగా.

ఆ ప్రశ్నకు షాకై వెనక్కి తిరిగి చూసింది.

అతని మొహంలో ఏదో గిల్టీ ఫీలింగ్ కనిపిస్తోంది..

"అదేం లేదు ఎందుకలా అడిగారు?" అంది.

"ఎందుకో అలా అనిపించింది.. మత్తులో ఉన్నాను కదా.. ఏది సరిగ్గా గుర్తులేదు."అందుకే అడిగా..

"లేదు.." అంది మెల్లిగా.. రాత్రి జరిగినది మనసులో మెదులుతుండగా..

"నిజంగానా..?"అన్నాడు మళ్ళీ అనుమానంగా..

"అవును.. మీ మనసులో మీ భార్య ఉన్నంతకాలం.. మీరు ఎవరిని ఇబ్బంది పెట్టరు.. అలా ఫీల్ అవ్వకండి మీరు.." అని చెప్పి, తొందరగా రండి.. బామ్మ చూస్తున్నారు.. అంటూ కిందికి వెళ్ళిపోయింది.

ఏదో తెలియని గందరగోళం లోనే విక్రమ్ కిందికి వెళ్ళిపోయాడు.

టిఫిన్ చేసేసాక,

"విక్కిఈరోజు వెళ్తున్నాం నాన్నా మేము.. ఇక్కడ అంతా జాగ్రత్త.. సంతోషం గా ఉండు కన్నా.."అంటూ అతని తల నిమిరి, నుదుటి పై ముద్దు పెట్టింది రోజీ.. విక్రమ్ ఆఫీస్ కి వెళ్ళేటపుడు..

"అలాగే మా.. టేక్ కేర్.." అంటూ వెళ్లాడు.

తర్వాత వెళ్ళేముందు రోజీ మధు నీ తన గదికి పిలిచి మాట్లాడింది.

"అమ్మా మధు.. విక్రమ్ బాబు నీ, పిల్లల్నీ బాగా చూసుకో తల్లి.. వాళ్ళ బాధ్యత నీకే అప్పగించి వెళ్తున్నా..

ఇక నా విక్కి బంగారం.. వాడి మనసు చాలా మంచిది.. అలాంటి వాళ్ళకే దేవుడు సంతోషాలను ఇచ్చినట్లే ఇచ్చి దూరం చేస్తాడు. కానీ తర్వాత తప్పు తెల్సుకుని మళ్ళీ దగ్గర చేస్తాడు. అందుకే వాడి లైఫ్ లో ఇపుడు నిన్ను ఇచ్చాడు.. సంతోషం గా ఉండు తల్లి.. అంటూ, నీకు ఏ సమస్య, ఇబ్బంది వచ్చినా ఈ అత్తయ్య నీకు తోడుగా ఉంటుందని మర్చిపోకు.." అని మధు నుదుటిన ముద్దు పెట్టింది.

"అత్తయ్యా..మీరుచాలా మంచివారు. కానీ బామ్మ ఎందుకు మీతో కోపం గా ఉంటుంది. బామ్మ కూడా చాలా మంచివారు.మీ ఇద్దరు నవ్వుతూ మాట్లాడుకోవడం చూడాలని ఉంది"అంది మధు.

"అత్తయ్య కి నా మీద ఎటువంటి కోపం లేదమ్మా.. ఆమె కోపం నా మతం మీద.." అంటూ నవ్వి, "నువ్వు ఇవన్నీ ఏం పట్టించుకోకు.. అత్తయ్య కి నువ్వు బాగా నచ్చావ్.. ఆమె నిన్ను బాగా నమ్ముతోంది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుని, ఈ ఇంటిని నందనవనం చేయాలి నువ్వే.." అని చెప్పి ఇక వెళ్ళిపోయింది రోజీ.

*****

రోజులు గడిచిపోతున్నాయి.

విక్రమ్ మధు మీద అకారణంగా తిట్టడం, గొడవపడటం కూడా తగ్గించేసాడు.

మధు పిల్లలకి బాగా దగ్గరయింది.. పిల్లలు చాలా సార్లు అడిగేసరికి, లంచ్ టైం లో స్కూల్ కి వెళ్లి, అన్నం తినిపించి వస్తోంది..

విక్రమ్ తన ఆఫీస్ పనుల్లో బిజీగా ఉన్నాడు. పిల్లల బాధ్యత మధు చూసుకుంటుందనే ధీమా అతనికి తెలియకుండానే వచ్చేసింది.

*****

"శాస్త్రి.. ఏంటి ఇదంతా.. అంత పెద్ద కంపెనీ వాళ్ళతో మీటింగ్ ప్లాన్ అంటే ఎంత పర్ఫెక్ట్ గా ఉండాలి.. ఈపాటికి మూడు సార్లు ఇలాగే జరిగింది.. ఒక్క మీటింగ్ షెడ్యూల్ కూడా కరెక్ట్ గా ప్లాన్ చేయట్లేదు ఆ అమ్మాయి.." గట్టిగా అరిచాడు విక్రమ్.

"సర్ అదీ.. అమ్మాయి మంచిదే సర్.. కానీ కన్ఫ్యూజ్ అయినట్లుంది.." నసిగాడు శాస్త్రి.

"ఏంటి శాస్త్రి? అస్సలు తెలివి లేకుండా మాట్లాడతున్నావు. ఆ కన్ఫ్యూజ్ విలువ ఎంతో తెలుసా.. 500 కోట్ల ప్రాజెక్ట్.. నేను సమయానికి గుర్తు చేయకపోతే ఆ ప్రాజెక్ట్ మిస్ అవడమే కాకుండా, మనకి ఎంత చెడ్డ పేరు వచ్చేది.. అసలు ఆ అమ్మాయి ఏమనుకుంటోంది?తన వర్క్ అది కదా.."

"సర్ పాపం సర్.. మంచి అమ్మాయి.. ఇన్నోసెంట్.. ఈ ఒక్కసారికి వదిలేయండి. నేను చెప్తాను లెండి తనకి గట్టిగా.." అని రిక్వెస్ట్ చేయడం తో వదిలేశాడు..

*****

"బావ్మా నేను కంపెనీ వర్క్ మీద ఢిల్లీ వెళ్తున్నా.. ఈరోజే, ఇపుడే వెళ్ళాలి. ఎక్కువ సమయం లేదు. నా బట్టలు అవీ కొన్ని సర్ది, శాస్త్రి వస్తాడు అతనికి ఇవ్వు.. నేను 4రోజులు అక్కడే ఉండి రావాలి." అని చెప్పి పెట్టేశాడు ఫోన్.

వీడెంటి ఇలా హఠాత్తుగా పెట్టుకున్నాడు ఎపుడైనా 2 రోజుల ముందే ప్రిపేర్డ్ గా ఉండేవాడు.. అనుకుని, మధు నీ పిల్చి చెప్పింది విషయం .

అయ్యో ఇలా సడెన్ గా చెప్పారు ఏంటి? అనుకుని అలాగే బావ్మా, అని పరుగు పరుగున వెళ్లి సర్ మీటింగ్స్ కి వేసుకునే డ్రెస్సెస్ నీ గుర్తు తెచ్చుకుని అందులో తనకు నచ్చినవి పక్కకు పెట్టి బ్యాగ్ లో సర్దింది గబగబా.. ఏం తిన్నారో ఏమో అని, తినడానికి కూడా కొన్ని చిప్స్, కుకిస్ పెట్టింది.. అప్పటికే శాస్త్రి వచ్చి పిలుస్తుండటం తో గబగబా బ్యాగ్ తెచ్చి శాస్త్రి కి ఇచ్చింది మదు.

ఫోన్ చేసి "మీ బట్టలతో పాటు తినడానికి చిప్స్, కుకీస్ పెట్టాను ఆకలేస్తే తినండి.." అని చెప్పింది

తన కేరింగ్ కి థాంక్స్ చెప్పి పెట్టేశాడు.

*****

సాయంత్రం అయ్యేసరికి ఇంటికి వచ్చే విక్రమ్ ఇంట్లో కనపడకపోయేసరికి ఏదో తెలియని బెంగ గా అనిపిస్తోంది మధుకి..

ఏంటో ఈ మాయ.. అసలు సర్ అంటే నాకెందుకు ఇంత ఇష్టం పెరిగిపోతుంది..

ఈ పిచ్చి మనసుకి ఎందుకింత ఆరాటం.. అందదనీ తెలిసినా ఆశ పడుతుందెందుకో?

అని బెడ్ రూం లో గోడకు తగిలించి ఉన్న విక్రమ్, ప్రియ ల పెళ్లి ఫోటో చూస్తూ.. పక్కన తన ఫోటో ఉన్నట్లు ఊహించుకుంది..

అంతలోనే సారీ ప్రియ గారు.. మీరు చాలా లక్కీ.. మీరు లేకపోయినా ఆయన మనసులో ఇంకా బ్రతికే ఉన్నారు..ఎప్పటికీ ఉంటారు కూడా.. అనుకుంది.

అపుడే మధు.. మధు.. అంటూ బామ్మ అరుపులు వినిపించాయి.. హాల్ లో నుండి..

ఏమైందీ ఇలా అరుస్తున్నారు? అనుకుని కంగారుగా కిందికి వచ్చేసరికి సోఫా లో కూర్చుని గుండె దగ్గర చేయి పట్టుకుని విలవిలాడుతోంది బామ్మ..

బామ్మా, బామ్మా ఏమైందీ మీకు? అంది కంగారు గా.

మాట్లాడటానికి ఆయాసపడుతూ టీవీ వైపు చూపించింది .

టీవీ లో విక్రమ్ ఎవరో అమ్మాయి తో క్లోజ్ గా ఉన్న ఫొటోస్ నీ పదే పదే చూపిస్తూ, ఏవేవో చెప్తున్నారు యాంకర్..

ప్రముఖ పారిశ్రామిక వేత్త రాసలీలలు.. అనే హెడ్ లైన్ తో..

ఒక్కసారిగా షాక్ అయి ఆ ఫొటోస్ చూసి అవి ఆ రోజు తనకి పంపిన ఫొటోస్ అని అర్ధం అయ్యి, బామ్మకి చెప్దామనుకునే లోగా బామ్మ స్పృహ కోల్పోయింది.

వెంటనే తేరుకుని బామ్మా బామ్మా.. అంటూ ఓవైపు ఛాతి పై ఒత్తుతూ, మరో వైపు పక్కనే ఉన్న ఫోన్ తీసుకుని, వాచ్ మెన్ కి, డ్రైవర్ కి ఫోన్ చేసి పిల్చింది.

హడావుడి గా కార్ లో ఎక్కించుకుని హాస్పిటల్ కి తీసుకెళ్లే దారి లో కూడాఅలాగే ఒత్తుతూ, మరో వైపుచెంపలపై తడుతూ లేపడానికి ప్రయత్నించింది మధు.

*****

బామ్మ లో ఎటువంటి చలనం లేకపోయేసరికి దుఃఖం తన్నుకొచ్చింది మధుకి..

కాళ్ళు చేతులు ఆడనట్లుగా అనిపించింది.

విక్కి కి ఫోన్ చేయబోయేది మళ్ళీ ఆగిపోయింది.. సర్ మీటింగ్ లో ఉండి ఉంటారు. రేపు బయల్దేరుతారు.. ఇపుడు సర్ కి చెప్పి, టెన్షన్ పెడితే ఏం లాభం? అనుకొని వెంటనే మధు వాళ్ళ అమ్మకి ఫోన్ చేసి చెప్పింది.

తన అమ్మా నాన్నా ఇద్దరు బయల్దేరి, మధు హాస్పిటల్ కి వచ్చేసరికే ఉన్నారు.

ఐ సి యూ లోకి తీసుకెళ్లాక, మధు అమ్మ ని పట్టుకుని భోరున ఏడ్చేసింది.

పిచ్చి పిల్ల ఏం కాదు ఏడవకు.. అంటూ ధైర్యం చెప్పారు ఇద్దరు..

కాసేపటికి డాక్టర్ వచ్చి చాలా క్రిటికల్ గా ఉంది రెండు సార్లు వచ్చింది హార్ట్ స్ట్రోక్.. ఇంకోసారి వస్తే కష్టం.. స్టంట్ వేయాలి ఇప్పుడైతే.. అని చెప్పి వెళ్లారు.

ముగ్గురు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు..

డబ్బులు కట్టాలి మధు. నీదగ్గర ఏమైనా ఉన్నాయా? అడిగాడు మధు తండ్రి..

తన దగ్గర డబ్బులు ఎందుకు ఉంటాయి..

వెంటనే ఏదో గుర్తొచ్చినట్లు రోజీ కి ఫోన్ చేసింది మధు. విషయం అంతా చెప్పి ఏడ్చింది.

అయ్యో ఎలా ఉన్నారు ఇపుడు అత్తయ్య.. అంటూ ఏడ్చింది రోజీ కూడా.

విషయం అంతా అర్థమై, ఎంత ఖర్చయినా నేను పంపిస్తాను నీకు..అత్తయ్య జాగ్రత్త. ఈయన కూడా వేరే స్టేట్ వెళ్లారు.. ఇక్కడ లేరు. కానీ నేను బయల్దేరి వచ్చేస్తాను. అని చెప్పింది ఏడుస్తూనే..

అత్తయ్య అలా ఏడవటం చూసి, మధు ధైర్యం చెప్పింది రోజీ కి..

తను పంపిన డబ్బులు పే చేసి, ఆపరేషన్ కి సైన్ చేసింది.

ఆపరేషన్ జరిగే అంత సేపు, చాలా టెన్షన్ టెన్షన్ గా గడిపింది..

మధు పేరెంట్స్ పక్కనే ఉన్నారు.. ఏమైనా తిన్నావో లేదో పొద్దున నుండి.. కొంచం తినివద్దువు గానీ రా.. అని ఎంత చెప్పినా వినకుండా, "బామ్మ కి బాగుందని డాక్టర్ చెప్పేదాకా నాకు ఏం వద్దు అమ్మా.. ప్లీజ్.. తినాలనిపించట్లేదు.. అర్దం చేసుకోండి." అని కూర్చుంది సైలెంట్ గా..

అపుడే విక్రమ్ నుండి ఫోన్ వచ్చింది..తనకి ఎలా తెలిసింది.? అనుకుంది కంగారు గా. అంతలోనే మళ్ళీ మామూలుగా చేస్తున్నారేమో అనుకుని, లిఫ్ట్ చేసింది..

"హాయ్ మధు.. మన మీటింగ్ సక్సెస్ గా కంప్లీట్ అయింది.. నెక్స్ట్ 2 ఇయర్స్ వరకు వాళ్ళ ఆర్డర్స్ అన్నీ మనకే వచ్చేలా అగ్రిమెంట్ కూడా జరిగింది. చాలా పెద్ద సక్సెస్ ఇది... అని, ఎందుకో ముందుగా నీతోనే చెప్పాలనిపించింది.." అన్నాడు సంబరం గా.

అతనికి మనస్ఫూర్తిగా గా కంగ్రాట్స్ చెప్పి, బామ్మ విషయం చెప్పాలా వద్దా? అనుకుని

"ఎప్పుడు బయల్దేరుతున్నారు?" అడిగింది.

"రేపు మార్నింగ్ ఇంకొకరిని కలిసే పని ఉంది.. అది అయిపోయాక ఈవినింగ్ వస్తా.."

ఇక అతని మూడ్ ని పాడు చేయాలి అనిపించలేదు..సరే టేక్ కేర్.. అంది.

"పిల్లలు ఎలా ఉన్నారు? ఏడుస్తున్నారా? స్కూల్ కి వెళ్ళారా?"

"హా బాగున్నారు.. వెళ్లారు.." అంది ముక్తసరిగా.

"ఏమైందీ? డల్ గా ఉన్నావు.."

"లేదు బానే ఉన్నాను సర్.."

"ఓకే.. బామ్మ ఏం చేస్తోంది.. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయట్లేదు.."

"చూసుకోలేదు అనుకుంటా. పడుకున్నారు.." టక్కున అబద్ధం చెప్పేసింది..

"సరే తర్వాత మాట్లాడతాను లే.." అని బై అన్నాడు.

ఫోన్ పెట్టేసి, దేవుడా..బామ్మ కి ఏం కాకూడదు.. ఆరోగ్యంగా ఉండేలా చూడు.. అని దండం పెట్టుకుంది మనసులోనే..

ఆపరేషన్ సక్సెస్ అయింది. కానీ 24గంటలు అబ్జర్వేషన్ లో ఉంచాలి. కాబట్టి ఐ సి యూ లోనే ఉంచాము.. అప్పటివరకు ఏమీ చెప్పలేను.. అన్నారు డాక్టర్..

కంగారు గా అనిపించింది మధు కి.. "ఒకసారి చూడొచ్చా.." అడిగింది దీనంగా.

"వెళ్ళండి కానీ డిస్టర్బ్ చేయకండి.."అన్నాడు డాక్టర్.

లోపలకి వెళ్లి బామ్మ దగ్గర కాసేపు కూర్చుంది ఆమె చెయ్యి పట్టుకొని.

మధు పేరెంట్స్ కూడా చూసి,

“మధు.. పిల్లలు స్కూల్ నుండి వచ్చే టైం అయ్యింది.. నువ్వు వెళ్ళి చూసుకో..ఇక్కడ మేము ఇద్దరం ఉంటాం లే..” అంది మధు తల్లి.

“అవును అమ్మా పిల్లల గురించే మర్చిపోయా” అని తనని తనే తిట్టుకుని, కానీ నాన్న ఇక్కడ ఎలా ఉంటాడు? రాత్రి ఎలా పడుకుంటాడు? నువ్వు నాతో వచ్చేయ్ నాన్నా మా ఇంటికి.. అమ్మ ఇక్కడే ఉంటుంది. డ్రైవర్ నీ కూడా ఇక్కడే ఉండమంటా..

“అవును మీరు తనతో వెళ్ళండి ఇంటికి. తను కూడా ఒక్కతే ఉండాలి కదా పిల్లలతో..”

“సరే పదమ్మా..”అంటూ మధు తో ఇంటికి బయలుదేరాడు నరసింహ.

డ్రైవర్ని అక్కడే ఉండమని, వాచ్మెన్ ని తీసుకుని కారులో డైరెక్ట్ గా స్కూల్ కి వెళ్ళింది.. పిల్లలను తీసుకొని, ఇంటికి వెళ్లి వాళ్లకి ఫ్రెష్ అప్ చేయించి, స్నాక్స్ పెట్టింది.

వాళ్ళ నాన్న కి కూడా తినమని స్నాక్స్ పెట్టాక,

"నువ్వు కూడా తినమ్మా పొద్దున్నుండి ఏం తినలేదు కదా.. ఇప్పుడు బామ్మకి ఏం పర్వాలేదని చెప్పారు కదా. డాక్టర్ ఆపరేషన్ సక్సెస్ అయింది అన్నారు కాబట్టి ఏం కాదు..బాధ పడకు.. పిల్లల్ని చూసుకోవాలి బామ్మ ని చూసుకోవాలంటే నీ ఆరోగ్యం కూడా బాగుండాలి కదా”

“ఏమైంది అమ్మా బామ్మ కి..” అన్నారు పిల్లలిద్దరూ ఒకేసారి.

“బామ్మ కి కొంచెం ఆరోగ్యం బాలేదు నాన్నా..” హాస్పిటల్ లో ఉన్నారు.

“అయ్యో మరి బామ్మ దగ్గర ఎవరున్నారు?” అడిగాడు అద్విత్.

“అమ్మమ్మ ఉంది నాన్నా అంటే మా అమ్మ.”

“అవునా మరి డాడీ కి చెప్పావా?”

“లేదు నాన్న.. డాడీ కి చెప్తే కంగారు పడతారు.. రేపు వచ్చేస్తారు కదా..”

వాళ్ల మధ్య సంభాషణని మౌనంగా వింటున్న నరసింహ ముచ్చట పడ్డాడు.. రెండో పెళ్లివాడు, పిల్లలు ఉన్నవాడిని చేసుకుంటాననంటున్నందుకు, అపుడు బాధపడ్డా,ఇపుడు వాళ్ళ మధ్య అన్యోన్యత చూసి చాలా సంతోషంగా అనిపించింది.

పిల్లలే ఇంత ప్రేమగా ఉంటుంటే, భర్త ఎంత ప్రేమగా ఉండి ఉంటాడు.. అనుకుని మురిసిపోయాడు.

నేను నా కూతురికి ఏమి ఇవ్వకపోయినా, ఆ భగవంతుడు దానికి అన్ని ఇచ్చాడు..అని ఆ దేవుడికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

నాన్నా.. మీరు గదిలో పడుకోండి అని చెప్పి, వాచ్మేన్ ని పిలిచి హాస్పిటల్ లో ఉన్న డ్రైవర్ కి, వాళ్ళ అమ్మకి ఇద్దరికీ క్యారేజ్ పంపించింది..

పిల్లలను తీసుకెళ్లి నిద్రపుచ్చాక, అమ్మకి ఫోన్ చేసి డాక్టర్స్ మళ్లీ ఏమైనాచెప్పారా? అని అడిగింది.

“సిస్టర్స్ వచ్చి గంట గంటకి చెకప్ చేస్తున్నారమ్మా.. ఏమి సమస్య లేదు అంతా బానే ఉంది..” అని చెప్పిన తర్వాత కొంచెం కుదుటపడింది మనసు..

“ఈ ఇంటితో, బామ్మతో, విక్రమ్ సార్ తో, పిల్లలతో ఇంత కనెక్షన్ ఏంటి నాకు? ఇలా అయితే నేను వీళ్ళని విడిచిపెట్టి ఎలా ఉండగలుగుతాను?” అని వస్తున్న ఆలోచనలను అదుపు చేసుకుంటూ, నిద్రపోవడానికి ప్రయత్నించింది చాలా సేపు.. కానీ ఆలోచనలే విజయం సాధించాయి..

“ప్రేమించడం మాత్రమే తెలుసు నాకు.. నటించడం తెలియదు.. అని మనసుకు సర్ది చెప్పుకొని, ఏదైతే అది అయింది కానీ.. ఉన్నన్ని రోజులు నేను నటించలేను. ఆ తర్వాత నేను ఎంత బాధ పడ్డా పర్వాలేదు. వాళ్ళకి దూరంగా ఉండడానికి ఎంత కష్టపడ్డా పర్వాలేదు..” అనుకున్నాక కొంచెం ప్రశాంతంగా అనిపించి, కాసేపు నిద్రపోయింది..

*****

తెల్లవారుతుండగానే రోజీ నుండి ఫోన్ వచ్చింది.

లిఫ్ట్ చేసి జరిగిందంతా చెప్పింది మధు.

“థాంక్ గాడ్..ఆపరేషన్ అయితే సక్సెస్ అయింది కాబట్టి అత్తయ్య గారికి ఏమీ కాదు.. నేను ఇప్పుడే ఫ్లైట్ దిగాను.. వస్తున్నాను.” చెప్పింది రోజీ..

“కార్ పంపించమంటారా అత్తయ్య..” అనగానే,

“అవసరం లేదమ్మా.. నేను క్యాబ్లో వస్తున్నాను. ఆల్రెడీ దిగాను..” అని చెప్పింది.

పిల్లలకి స్నానాలు చేపించి, బ్రేక్ఫాస్ట్ చేయించి, స్కూల్ కి పంపించమని మంగకి చెప్పి..

తను స్నానం చేసి, హాస్పిటల్ కి కారులో బయలుదేరింది తండ్రి తో కలిసి..

రోజీ ఇంటికి వచ్చి స్నానం చేసి వస్తానని చెప్పడంతో హాస్పిటల్ అడ్రస్ షేర్ చేసింది తనకి..

*****

మధు హాస్పిటల్ కి వెళ్ళిన కాసేపటికే రోజీ వచ్చింది.. ఆమె నుదుట్టిన కుంకుమ చూసి, ఆశ్చర్యపోయింది మధు.

“అత్తయ్య ఎక్కడ?” అంది వచ్చి రాగానే..

ఐ సి యు ముందు కి తీసుకెళ్ళి చూపించింది మధు.

రాజేశ్వరి దగ్గరికి వెళ్ళి, తన బాగ్ లో నుండి పాకెట్ తీసి, అందులోని బొట్టు తీసి పెట్టి,దేవుడిని ప్రార్థిస్తూ

కళ్ళుమూసుకుంది.

క్రిస్టియన్ కావడం వల్ల బామ్మ ఎంత ఫోర్స్ చేసినా ఎప్పుడు బొట్టు పెట్టుకోని రోజీ, బొట్టు పెట్టుకుని, గుడికి వెళ్ళి, పూజ చేయించి మరీ బొట్టు తెచ్చి బామ్మ కి పెట్టడం ఆమెకి బామ్మ అంటే ఉన్న ఇష్టాన్ని స్పష్టం చేసింది..

చాలా ఆనందం గా అనిపించింది మధుకి.. కష్టం వచ్చినప్పుడే ప్రేమలు బయటపడతాయేమో అనుకుంది..

కాసేపటి తర్వాత డాక్టర్ చెక్ అప్ కి వచ్చారు..

“ఆమె కి ఇపుడు ఏ ప్రమాదం లేదు. కాసేపయ్యాక వేరే రూం కి షిఫ్ట్ చేస్తాం..” అన్నారు డాక్టర్ నవ్వుతూ.

హమ్మయ్య.. అని ఊపిరి పీల్చుకున్నారు అందరూ.

చాలా సంతోషపడింది రోజీ..

విక్రమ్ కి, కృష్ణ కి ఫోన్ చేసి చెప్పింది రోజీ..

“ఇపుడే ఫ్లైట్ ఎక్కుతున్నాను మమ్మీ.. ఇదంతా జరిగితే నాకెందుకు చెప్పలేదు మధు. నిన్న కూడా కాల్ చేశాను తనకి..” అని అరిచాడు కాసేపు..

"చెప్తే నువ్వు వచ్చి ఏం చేస్తావు కన్నా.. నీ పనులు ఆగిపోకూడదు అని తనే నీ బాధ్యత తీసుకుని దగ్గరుండి చూసుకుంది అత్తయ్యని. ఇపుడు అత్తయ్య ప్రాణాలతో ఉన్నారంటే అది మధు వల్లే.. యు హేవ్ టు థాంక్స్ హర్.."అని మందలించడంతో సైలెంట్ అయ్యి ఫోన్ కట్ చేశాడు..

*****

ఫ్లైట్ లో ఉన్నంత సేపు మధు గురించి అమ్మ చెప్పిన మాటలే గుర్తొస్తుంటే, తన గురించే ఆలోచించాడు..

"మధు.. ఎవరు నువ్వు.. ఎందుకింత లా నన్ను కలవరపెడుతున్నావు? నిన్ను తిట్టినా నేనే బాధ పడతాను మళ్ళీ.. నువ్వేమో నా ఫ్యామిలీ లో భాగం ఐపోయావు.. నిన్ను వదిలి నా ఫ్యామిలీ ఉండగలదా?.. నీకెందుకు అసలు వాళ్ళంటే అంత అభిమానం.. నువ్వు మంచిదానివి.. అందర్ని ఇలాగే ఇష్టపడతావు... నీకు ఇంకా మంచి భవిష్యత్తు ఉండాలి.. మన కాంట్రాక్ట్ అయిపోయాక కూడా నీకు ఏదైనా చేయాలి నేను.. ఖచ్చితంగా గా నువ్వు కోరుకున్నట్లు నీ లైఫ్ ఉండేలా చూస్తాను.." అనుకుని తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు .

*****

బామ్మ కి స్పృహ రావడం తో ముందుగా మధు నే వెళ్లమంది రోజీ..

మధు వెళ్లి బామ్మ పక్కనే కూర్చుని,

"చాలా కంగారు పెట్టేసావు బామ్మా.." అంది ఆమె చేయి పట్టుకొని నవ్వుతూ..

చిన్నగా నవ్వి, "పోతాను అనుకున్నావా.. అంత తేలికగా పోయే ప్రాణం కాదులే ఇది.. నీ కొడుకు ని ఎత్తుకోవాలి కదా ఇంకా.." అంది.

“అలా మాట్లాడొద్దు బామ్మా.. మీరు ఈ ఇంటిని నడిపించే సారథి. మీరు లేకపోతే ఎక్కడి వాళ్ళు అక్కడే ఆగిపోతారు.”

“ఏమో మధు.. నేనంటే అందరూ మర్యాద ఉన్నట్లే ఉంటారు.. కానీ ఎవరికి నేనంటే లెక్క లేదు..” అంది కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే.

“ఎందుకు అలా అనుకుంటున్నావు బామ్మా..”

“విక్రమ్.. వాడంటే పంచ ప్రాణాలు నాకు చిన్నప్పటినుండి. ప్రతి క్షణం వాడి సంతోషం కోసమే ఆలోచిస్తాను.. అలాంటిది.. ఈరోజు వాడి గురించి టీవీ లో చూశాక.. నా విక్రమ్ కాదేమో వాడు అనిపిస్తుంది..” అంది గొంతు పూడుకు పోతుంటే..

“బామ్మా.. మీరు టీవీ లో చూసింది నమ్ముతున్నారా.. మీ పెంపకాన్ని నమ్ముతున్నారా..ఆయన మీ మనవడు బామ్మా.. ఎప్పటికీ తప్పు చేయడు.” అంది మధు గట్టిగా..

“నీ భర్త ని వెనకేసుకు రాకు మధు.. అంత చక్కగా ఫొటోస్ కనపడుతుంటే ఇంకా ఎందుకు బుకాయిస్తావు..”

“బామ్మా.. బామ్మా.. నీకు ఎలా చెప్తే అర్థమవుతుంది..ఆయన ప్రియ గారిని ఎంతలా ప్రేమించాడంటే,ఆమె చనిపోయినా ఇంకా ఉన్నట్లే ఆయన దృష్టి లో..

ఆరోజు కొంచెం ఎక్కువగా తాగారు. ఆ మత్తు లో తూలి పడి పోతుంటే, ఆ అమ్మాయి పట్టుకుంది.. ఆ పిల్ల వాళ్ళ కొత్త సెక్రెటరీ అంట.. ఆ ఫొటోస్ ఎవరో కావాలనే తీసి నాకు పంపారు అదే రోజు.. మమ్మల్ని విడదీయాలని వాళ్ళ ప్లాన్. కానీ నేను నమ్మలేదు.. తెల్లవారే ఆయనకి చెప్పేశా కూడా.షాక్ అయ్యారు.. బాధ పడ్డారు. ఎవరు ఇలా కావాలని చేస్తున్నారు అని..

ఆ తర్వాత ఇన్నాళ్ళకి మీడియా కి ఇచ్చారు.. కారణం మన కంపెనీ మంచి లాభాలతో దూసుకెళ్తోంది. పెద్ద పెద్ద ప్రాజెక్ట్స్ వస్తున్నాయి. కాబట్టి ఎలాగైనా, బురద చల్లాలని వాళ్ళ ప్రయత్నం.

మీ విక్కి ని మీరే అర్థం చేసుకోకపోతే ఎలా బామ్మా?" అంది గద్దిస్తూ..

మధు మాటలకి ఆలోచనలో పడిపోయింది బామ్మ.

"మీరేం ఆలోచించకండి.. 6 నెలల క్రితం వచ్చిన నేనే నమ్ముతున్నాను ఆయన ని. అలాంటిది మీరు అనుమానించి బాధ పెట్టకండి.." అని చెప్పి,

"బామ్మా.. నీకిలా అయిందని తెలిసి, అత్తయ్య ఎంతో టెన్షన్ పడి వెంటనే ఫ్లైట్ ఎక్కి వచ్చేశారు."

"ఎవరు రోజీ నా?" అంది రాజ్య లక్ష్మి ఆశ్చర్యంగా.

"అవును బామ్మా.. అత్తయ్య పైకి అలా ఉంటుంది కానీ మీరంటే ఎంత ఇష్టమో నాకు కూడా నిన్నే తెలిసింది.. విలవిలలాడిపోయారు మీకు ఇలా అయిందని చెప్పినప్పటి నుండి.."

"ఇపుడు రోజీ వచ్చిందా ఇక్కడికి.." అంది నమ్మలేనట్లుగా.

"ఆ రావడమే కాదు. మీకోసం గుడికి వెళ్ళి, మొదటిసారి ఆమె నమ్మకాలను, మతాన్ని పక్కన పెట్టి, బొట్టు పెట్టుకుని మీకోసం పూజ చేయించి, మీకోసం కూడా బొట్టు తెచ్చి పెట్టారు.." అంది నవ్వుతూ.

"నిజమా!" అంది నమ్మలేనట్లుగా కళ్ళ రెండు నీళ్లతో నిండిపోగా..

"నిజం.. ఇంతమంది ప్రేమని పొందిన మీరు చాలా అదృష్టవంతులు బామ్మా.. అత్తయ్య నీ లోపలికి పంపిస్తాను.. కొప్పడకుండా మాట్లాడండి.." అంది లేచి.

*****

“అత్తయ్యా.. బామ్మ మీతో మాట్లాడాలి అంట..” వెళ్ళండి అంది మధు.

“నాతోనా?” అంది ఆశ్చర్యంగా.

“అవును మీతోనే తొందరగా వెళ్ళండి .”

మెల్లిగా లేచి, బామ్మ దగ్గరికి వెళ్ళింది రోజీ.

రోజీ నీ ఆమె నుదుటిన బొట్టుని చూడగానే బామ్మా కళ్ళలో నుండి కన్నీళ్లు వర్షిస్తునే ఉన్నాయి.

“ఎన్ని సార్లు తిట్టానో ఎన్ని సార్లు గొడవ పడ్డామో బొట్టు పెట్టుకోమని.. నా ఆరోగ్యం కోసం తన నమ్మకాన్ని పక్కన పెట్టింది.. తన నమ్మకాలను ఒక్కరోజు కూడా నేను గౌరవించకపోయినా...” అనుకుంది.

“ఎప్పుడొచ్చావు..” అంది నెమ్మదిగా.

“ఇందాకే గంటవుతుంది.. మీకు ఇపుడు ఎలా ఉంది?” అంది.. ఎప్పుడూ గర్జించిన సింహం లా ఉండే అత్తయ్య ఇలా హాస్పిటల్ బెడ్ పై పేషంట్ లా ఉండటం తట్టుకోలేక.

“బాగుంది.. నీ చేతి తో నాకోసం బొట్టు పెట్టావు కదా.. తగ్గిపోయింది..” అంది నవ్వుతూ.

మొదటిసారి అత్తయ్య తనతో నవ్వుతూ మాట్లాడం చూసి చిన్న పిల్లలా సంబరపడింది రోజీ..

“మీకే కాదు.. నేను కూడా ఈరోజు మీకోసం పెట్టుకున్నాను..” అంది రోజీ..

“చూసాను.చాలా అందం గా ఉన్నావు..” అని రోజీ చెయ్యి పట్టుకుని, “నా కోసం అంత దూరం నుండి ఒక్కదానివి రావడం ఏంటి.. ఇక్కడ వీళ్లంతా లేరా?” అంది మందలిస్తున్నట్లుగా.

“ఏమో అత్తయ్యా.. మీకు ఇలా అయిందని తెలిశాక కాళ్ళు ఆగలేదు.. వెంటనే బయల్దేరి వచ్చేశా..” అంది చిరునవ్వుతో..

“పిచ్చి పిల్లా.. నీ మనసు బంగారం అని నాకు తెల్సు.. ఏదో ముసలి దాన్ని.. పైగా దైవ భక్తి ఎక్కువ.. అందుకే వేరే మతం అని కాస్త కోపం తో తిట్టేదాన్ని..అవన్నీ మనసులో ఏం పెట్టుకోకు . నాకోసం నువ్వు వెళ్ళే మార్గాన్ని మార్చుకోకు.. నువ్వు నీలాగే ఉండు .. నాకు నా నమ్మకాలు ఎంత ముఖ్యమో నీకూ అంతే గా.. అంటూ నవ్వి నాకేం కాదు.. ఇంక కంగారు పడటం ఆపి కృష్ణ కి కూడా చెప్పు.. అర్థమైందా?” అంది బెదిరిస్తున్నట్లుగా..

“మా సింహం మళ్ళీ గర్జిస్తోంది.. ఇంక నాకెందుకు కంగారు..?” అని నవ్వి, రెస్ట్ తీసుకోండి అత్తయ్యా.. అని చెప్పి వచ్చింది..

*****

కాసేపటి తర్వాత, విక్రమ్  డైరెక్ట్ గా హాస్పిటల్ కి వచ్చాడు..

మధు దగ్గరికి వచ్చి, “ఎలా ఉంది బామ్మా?” అన్నాడు..

“బాగున్నారు.. ఇపుడే రూం కి షిఫ్ట్ చేసారు.. మీరు వెళ్లి మాట్లాడి, అత్తయ్య నీ తీసుకుని ఇంటికి రండి..

నేను వెళ్తున్నాను. పిల్లలు వచ్చే టైం అయ్యింది. వాళ్ళని స్కూల్ నుంచి తీసుకుని ఇంటికి వెళ్తా..” అని చెప్పి వెళ్ళింది మధు.

“బామ్మా..” అన్న విక్రమ్ గొంతు విని మెల్లిగా కళ్ళు తెరిచింది.

“పెళ్లిన పనులన్నీ అయిపోయాయా నాన్నా..”అంది ప్రేమగా తల నిమురుతూ..

“ఆ బామ్మా.. మన కంపెనీ ఎన్నడూలేని లాభాల బాట పట్టింది. మరి నువ్వేంటి? ఏం టెన్షన్ పెట్టుకున్నా వ్? ఎందుకిలా జరిగింది సడెన్ గా?”

“ఏం టెన్షన్ లేదు నాన్నా.. వయసు పెరిగిన కొద్దీ అపుడప్పుడు గుండె ఇలాగే మొరాయిస్తూ ఉంటుందిలే పని చేయను అని.. రిపేర్ లు చేసుకుంటూ ఉండాలి అపుడపుడు..”అంది నవ్వుతు..

“కానీ విక్కి బాబు..నేను ఈరోజు నీతో ఇవన్నీ మాట్లాడుతున్నాను అంటే కేవలం ఆ పిల్ల మధు వల్లేరా. మధు లేకపోతే ఈరోజు నేను ఉండేదాన్ని కాదేమో..

పాపం పిల్ల అటు పిల్లల్ని చూసుకుంటూ, ఇటు నన్ను.. ఒక్కతే ఎంత టెన్షన్ పడింది. తను మధు కాదేమో అని నా డౌట్ రా..”

“ఏంటి బామ్మా?” అన్నాడు అర్థం కానట్టు..

“తను నీ ప్రియ నే.. మళ్ళీ మధు లా వచ్చిందేమో అనిపిస్తుంది రా నిజంగా..”

మౌనం గా తల దించుకుని వింటున్నాడు విక్రమ్..

“తనను బాగా చూసుకోవాలి రా.. ఎపుడు తన కళ్ళలో కన్నీళ్లు రానివ్వకు.. నీ ప్రియ లాగే చూసుకో.. తను కోహినూర్ వజ్రం లాంటిది రా.. చాలా అరుదు గా దొరుకుతుంది.. నీకోసం ఆ దేవుడే పంపాడు.. కాపాడుకోవడం నీ బాధ్యత.” అంది బామ్మ..

“అలాగే బామ్మ.. నీ ఆరోగ్యం జాగ్రత్త. ఎక్కువగా స్ట్రెయిన్ తీసుకోకు.. రెస్ట్ తీసుకో.. పడుకో కాసేపు..” అని చెప్పి వెళ్ళాడు అక్కడ ఎక్కువ సేపు ఉండలేక...

మధు పేరెంట్స్ కూడా వెళ్లి మాట్లాడి వచ్చారు రాజ్యలక్ష్మి తో.

*****

బయటకు వచ్చి, “ఎప్పుడొచ్చావు అమ్మా.. అంత దూరం నుండి రాకపోతే ఏమయ్యేదీ? మేము ఉన్నాం గా..” అన్నాడు రోజీ తో..

“ఏమో రా బామ్మా కి ఎలావుంటుందో అని చాలా కంగారు గా అనిపించింది.. అక్కడ ఉండాలనిపించలేదు ఇక.” అంది.

“ఐనా మధు కి బుద్ది లేదు.. నీకు చెప్పకుండా ఉండాల్సింది కదా..”అన్నాడు.

“షటప్ విక్కి.. ప్రతిసారీ ఆ పిల్లని ఏదో ఒకటి అంటావు.. నేను గమనిస్తూనే ఉన్నాను.. ఆ పిల్ల దగ్గర ఒక్క రూపాయి ఐనా ఉందా? పోని బ్యాంక్ అకౌంట్ ఉందా? అందులో మనీ ఉన్నాయా..? మరి ఎలా అవుతాయి రా ఇవన్నీ.. అందుకే నాకు ఫోన్ చేసింది..” అంది మందలిస్తూ..

సైలెంట్ గా ఉన్నాడు విక్రమ్.

“ఆ పిల్ల మన కుటుంబం కోసం ప్రాణం పెడ్తుంది రా.. అందరి సంతోషం కోరుకుంటుంది..

వీలుంటే తనని సంతోష పెట్టాలిఅంతే కానీ ఇలా బాధపెట్టకూడదు రా.. చాలా తప్పు కన్నా..” అంది.

“నాకు తెలియక కాదమ్మా.. కానీ మీరంతా తన మీద ఎంత ఎక్కువ ప్రేమని పెంచుకుంటే, తర్వాత అంత బాధ పడతారు అని నా బాధ.”. అనుకున్నాడు మనసులో..

“బామ్మ దగ్గర నేను ఉంటాను నువ్వు ఇంటికి వెళ్ళి ఫ్రేషప్ అవ్వు..” అంది రోజీ..

అలాగే అంటూ ఇంటికి బయల్దేరాడు.

ఇంటికి వెళ్లేసరికి పిల్లలకి ఫ్రెష్ గా స్నానం పోసి, స్నాక్స్ పెట్టింది మధు.కూర్చుని సంతోషం గా తింటున్న పిల్లల్ని చూసేసరికి చాలా హ్యాపీ గా అనిపించింది విక్రమ్ కి.. పిల్లల్ని చూడక 4 రోజులయి ఉటుంది.. కానీ వాళ్ళు ఎప్పటిలా ఇంత హాపీ గా ఉన్నారు అంటే మధు వాళ్ళని అంత బాగా చూసుకుంది అనుకుని మనసులో నే థాంక్స్ చెప్పుకున్నాడుఆమె తన ఎదురు గానే ఉన్నా..

*****

విక్కి ఫ్రెష్ అయ్యాక స్నాక్స్ తీసుకుని వాళ్ళ గదిలోకి తీసుకెళ్ళింది మధు.

“తినండి సర్.. ఎప్పుడు తిన్నారో ఏమో ఆకలేస్తుంది..” అంది.

“అందరి ఆకలి తీర్చే అన్నపూర్ణవా నువ్వు..” అన్నాడు నవ్వుతూ..

వెటకారం గా అన్నాడో, మాములు గా అన్నాడో అర్ధం కాక,అయోమయం గా చూస్తూ నిలబడింది.

“నేనేమీ తిట్టట్లేదు లే.. ఇలా రా కూర్చో..” అన్నాడు పక్కకి జరిగి.

“ఏంటో ఈయన అర్థమే కాడు ఒకసారేమో బాగుంటాడు.. ఒక్కోసారి చిందులు తొక్కుతాడు” అనుకుని, నెమ్మదిగా కూర్చుంది.

“మధు.. నిజం గా నిన్ను బాధ పెట్టి ఉంటే సారి.. కానీ ప్రతిసారీ నేను నిన్ను తిట్టడం వెనుక, నీ మీద కోపం లేదు.. నువ్వెక్కడ మా వాళ్ళ కి అలవాటైపోతావో, తర్వాత నిన్ను మర్చిపోలేక, వాళ్ళెంత బాధ పడతారో అన్న ఆలోచన తప్ప ఇంకేం లేదు మధు..” అన్నాడు చిన్నపిల్లాడిలా సంజాయిషీ చెప్తూ..

“నాకు తెల్సు సర్. కానీ నేను దూరం గా ఉండలేను సర్ అది నా వీక్నెస్..” అంది

“హ్మ్మ్.. అందుకే నేను ఒక నిర్ణయం తీసుకున్నాను మదు..” అన్నాడు నెమ్మదిగా.

“చెప్పండి సర్..”

“మన అగ్రిమెంట్ 2 ఇయర్స్ అనుకున్నాము కదా..”

“అవును..”

“దాన్ని ఇక్కడికే ముగిద్దాం అనుకుంటున్నా..”

“సర్..”

“అవును మధు.. నేను ఎంత తప్పు చేశానో నాకు అర్థమైంది.. నా స్వార్థం కోసం ఒక ఆడపిల్ల నీ ఇలా అగ్రిమెంట్ పేరు తో పంజరం లో బంధించి, ఒక ఫ్యామిలీ లో బలవంతం గా ఇరికించడం కరెక్ట్ కాదు.. అందుకే నీకు ఈ బంధనంనుండి విముక్తి కల్గిద్దాం అనుకుంటున్నా.. ఇక ఈరోజు నుండి నువ్వు , ఎవరి కింద ఉండనక్కర్లేదు. నీకు నచ్చినట్లు గా, నచ్చిన లైఫ్ జీవించొచ్చు..”

“కానీ మీరు 2సంవత్సరాలు అని డబ్బులు ఇచ్చారు కదా.” అంది అయోమయంగా.. తనేం అంటుందో తనకే అర్థం కాకుండా..

“అవును కానీ అదే నాకు చాలా గిల్టీ గా ఉంది..ఇప్పటికే నిన్ను నా కళ్ళ ముందు చూసినప్పుడల్లా ఏదో తప్పు చేసిన భావన నన్ను వెంటాడుతోంది..”

“అయితే ఇపుడు నేను ఇక్కడ ఉండనవసరం లేదా ?”

“అవును నువ్వు మీ ఇంటికి వెళ్ళి ఉండొచ్చు.. ఎప్పటిలానే.. హ్యాపీగా..”

“నన్ను చూడలేకపోతున్నారు అన్న మాట సర్. అందుకే ఎక్కడ ఇక్కడే శాశ్వతం గా ఉంటాను అంటానేమో అని భయపడి తరిమేస్తున్నారు.” అనుకోగానే తనకు తెలియకుండానే తన కళ్ళు వర్షించడం మొదలెట్టాయి..

“నీకు ఇంకో సర్ప్రైజ్ మధు..”అన్నాడు విక్రమ్ ఉత్సాహం గా.

“మీరు షాక్ లే కాకుండా సర్ప్రైజ్ లు కూడా ఇస్తారా? ఏంటో చెప్పండి..” అంది విరక్తి గా.

“నువ్వు యూ యస్ వెళ్లి చదువుకోవాలని అనుకున్నావంట కదా.. మీ నాన్న చెప్పారు ఆ మధ్య. నీకునేనే పూర్తి బాధ్యత తీసుకుని, యు ఎస్ కి పంపిస్తున్నాను. చదువుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసి.. అంతే కాదు నీ చదువు అయిపోగానే అక్కడే ఉన్న మన కంపెనీస్ లో నువ్వే మేనేజర్ వి.. అక్కడ నాన్నకి సపోర్ట్ గా ఉండొచ్చు..” అన్నాడు సంబరం గా.

“ఓహ్ ఐతే దేశం కూడా దాటిస్తున్నారన్న మాట ఎక్కడ మళ్ళీ వస్తానో అని..” అనుకుంది కోపం గా..

“చాలా గొప్ప సర్ప్రైజ్ సర్..” అంది వెటకారంగా.

అది అర్థం చేసుకోకుండా, “కదా..” అన్నాడు విక్రమ్చిన్న పిల్లాడిలా.

"ఏంటో, ఈయనకి నా మనసు లో ఏముందో, నాకేది ఇష్టమో అవసరం లేదు.. కానీ నాకేదో గొప్ప సహాయం చేస్తున్నట్లు ఫీల్ అవుతున్నారు.. ఎంత భార్య చనిపోతే మాత్రం ఇంకో అడదాని మనసు కూడా అర్థం చేసుకోనంత మొద్దుబారిపోయారా?" అనుకుంది.

"మధు.. బామ్మ డిశ్చార్జ్ అయి వచ్చాక వెళ్లువ్ అప్పటివరకు ఇక్కడే ఉండు.." అన్నాడు .

"సరే మంచిది సర్.. చాలా సహాయం చేశారు నాకు.." అంది లేచి నిలబడి..

"నువ్వు నాకు నా కుటుంబానికి చేసిన దానితో పోలిస్తే ఇదెంత మధు.." అన్నాడు విక్రమ్..

విక్రం వైపు సీరియస్ గా చూసి, "అవును.. మీరు.. మీ కుటుంబం.." అని, "థాంక్యూ ఫర్ ఎవ్రిథింగ్ సర్.." అని వెళ్ళిపోబోయింది అక్కడినుండి గట్టు తెగిన సెలయేరులా వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక..

"హేయ్ మధు ఆగు.. ఏమైందీ నీకు.. మొదటిసారి నిన్ను కోప్పడకుండా ఇంత మంచిగా మాట్లాడినా నీ మొహం లో సంతోషం లేదు.. డల్ గా ఉన్నావు.. నీకు ఇంకా ఏమైనా కావాలంటే చెప్పు మధు.. మొహమాట పడకుండా." అన్నాడు విక్రమ్.

వెనక్కి తిరిగి అతని మొహం చూడలేక పోయింది మధు.. చూస్తే తను ఏడుస్తున్న విషయం తెలిసిపోతుందని..

"ఏం చెప్పాలి సర్ మీకు? ఎలా చెప్పాలి.. ? ఒక్క మాట.. ఒకే ఒక్క మాట.. నేనంటే నీకు ఇష్టమేనా? ఇక్కడే ఉండి పోతావా?అని అడిగి చూడండి.. మీకు ఊపిరి కూడా ఆడనంత గట్టిగా హత్తుకుని, నా ప్రేమనీ చూపిస్తాను...

అంతే గానీ ఇంకేం కావాలి చెప్పు? అంటే ఎలా చెప్పాలి నాకు మీరే కావాలి అని.." అనుకుని మౌనం గా వెళ్ళిపోయింది అక్కడినుండి..

విక్రమ్ కి మధు ప్రవర్తన ఏమీ అర్థం కాలేదు.. సంతోషపడుతుంది అనుకుంటే ఇలా డల్ ఐపోయిందేంటి అనుకున్నాడు.

*****

బామ్మ డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చాక ఒకరోజు విక్రమ్ అన్నాడు బామ్మతో..

"బామ్మా.. ఇపుడు నీకు బాగానే ఉంది కదా.. మధు వాళ్ళ నాన్నకి కాస్త హెల్త్ బాలేదంట.. మధు వెళ్తానంటుంది.. నీకేం పర్లేదు కదా.." అన్నాడు మెల్లిగా.

"అయ్యో ఏమయింది రా పాపం నరసింహ కి? మొన్న బానే మాట్లాడాడు కదా నాతో.." అంటూ కంగారు పడింది.

"సివియరేం కాదులే అనవసరం గా గాభరాపడకు. మధు వెళ్లి చూసుకుంటుంది.. హాస్పిటల్ కి తీసుకెళ్తుంది.." అన్నాడు.

"అలాగే రా వెళ్ళమను.. నువ్వు కూడా వెళ్ళు.. పాపం పిల్ల ఒక్కతే మళ్ళీ ఏం తిరుగుతుంది? మొన్నటిదాకే కదా నాకోసం తిరిగింది.."

"అలాగే బామ్మా.." అని విక్రమ్ అనేలోపే,

"పర్లేదు బామ్మా.. ఆయన కి చాలా ముఖ్యమైన పనులుంటాయి కదా నేనే వెళ్తాను.."అంటూ బ్యాగ్ తీసుకుని వచ్చింది పై నుండి..

ఆ బ్యాగ్ చూసి "ఏంటమ్మా చాలా రోజులు ఉంటావా అక్కడ..? నాన్న కి ఏమైందీ?" అంది కంగారు గా..

"అదేం లేదు బామ్మా.. నేను ఈ మధ్య వెళ్ళలేదు కదా. కొన్నాళ్ళు ఉండి వస్తా.."అంది.

"అలాగే తల్లి జాగ్రత్త.."

"మీ ఆరోగ్యం జాగ్రత్త.. సమయానికి టాబ్లెట్స్ వేసుకోండి.. ఫుడ్ కూడా మంచిగా తినండి.." అంటూకాళ్ళకి నమస్కరించింది..

"పిల్లా పాపలతో కలకాలం చల్ల గా ఉండు తల్లి.." అని ఆశీర్వదించింది.

"హా హా.." అని నవ్వుకుంది మధు తనలో తనే...

బామ్మ జాగ్రత్త.. అని విక్రమ్ కి చెప్పి, పిల్లలకి ఇద్దరికీ ముద్దులు పెట్టి,"అల్లరి చేయకండి.. చక్కగా చదువుకోండి.. రాత్రి తొందరగా పడుకోవాలి.. పొద్దున తొందరగా లేవాలి.. అర్థమైందా?"అంటూ చెప్పింది.

"నువ్వు తొందరగా వచ్చేయ్ మమ్మీ.. లేదంటే మేమే వచ్చేస్తాం.." అంది ఆద్య..

నవ్వి అలాగే.. అని కళ్ళనుండి రాబోతున్న కన్నీటిని అతి కష్టమ్మీద ఆపుకుంటూ, ఇంటిని చివరిసారిగా చూసుకుని, వెళ్ళబోతు "మంగా.. ఇల్లు,పిల్లలు, బామ్మా, విక్రమ్ సర్ జాగ్రత్త." అంది.

"ఏంటమ్మా.. అప్పగింతలు చెప్తున్నట్లు చెప్తున్నారు. తొందరగా రండి.. మీరు లేకపోతే ఇల్లంతా బోసిపోతుంది.. బామ్మా,పిల్లలు, నేను,సర్ అందరం మీకోసమే ఎదురు చూస్తుంటాం.."అంది.

"మీరంతా చూస్తారేమో కానీ.. సర్ ఐతే చూడరు"అనుకుని విక్రమ్ వైపు చూసింది..

తన వైపే చూస్తున్న చంటి పిల్లాడిలా అనిపించాడు.. వెళ్ళొస్తా అనబోయి, అంతలోనే వెళ్తున్నాను సర్.. అని మెల్లి గా చెప్పి, గడప దాటి బయటకు వచ్చి మళ్ళీ ఒకసారి చివరి గా ఆ ఇంటి వైపు చూసింది.

బయట ఉన్న డ్రైవర్ కి, వాచ్మెన్ కి కూడా బామ్మా నీ అపుడపుడు చూస్తూ ఉండండి.. అని జాగ్రత్త లుచెప్పి వెళ్తుంటే ఆశ్చర్యం గా చూశారు వాళ్ళు.

*****

"ఇంత సడెన్ గా వచ్చావేంటే" అంది మధు వాళ్ళ అమ్మ లోపలికి వెళ్ళగానే..

"ఏం రాకూడదా ఏంటి?"

"అది కాదురా బామ్మ కి ఆరోగ్యం బాలేదు కదా పాపం అందుకే.."

"ఇపుడు బానే ఉన్నారు.. మిమ్మల్ని చూసి చాలా రోజులైంది కదా..అందుకే మీతోనే కొన్ని రోజులు ఉందామని వచ్చాను.." అంది

"అదేంటి మధు అలా అంటావు నువ్వు అక్కడ లేకపోతే బామ్మకి, అల్లుడికి, పిల్లలకి ఎంత ఇబ్బంది చెప్పు.." అంది రేణుక.

"అబ్బా అమ్మా ఆపుతావా నీ నస.. అక్కడ అన్ని పనులు చేయడానికి మనుషులు ఉన్నారు. నా అవసరం అక్కడ ఎవరికి లేదు.."

"ఇదేంటి మధు.. ఇలా వింతగా మాట్లాడుతోంది.. మొన్నటివరకు బామ్మ గురించి, పిల్లల గురించి ఎంత కంగారు పడింది.." అనుకున్నాడు నరసింహ.

"ఏమైంది రా అంతా బానే ఉందా? ఏదైనా గొడవ పడ్డావా అల్లుడి తో.." అన్నాడు నెమ్మది గా

"ఏంటి గొడవ నా?" అంటూ అరిచింది రేణుక గట్టిగా..

కోపం గా చూస్తున్న మధు వైపు చూసి, "ఏంటే ఆ చూపు.. నిజంగానే అల్లుడు బాబు తో గొడవ పడలేదు కదా.."

"ఏం పడితే ఏంటట ఇపుడు?" అంది మధు చిరాకుగా చూస్తూ..

"పిచ్చి పట్టిందా... బంగారం లాంటి అల్లుడితో గొడవేంటే?" అంది రేణుక కోపం గా.

"రేణు.. ఇపుడు తను గొడవ పడ్డానని చెప్పిందా? ఎందుకు అనవసరంగా ఆవేశపడతావు? వెళ్ళు.. వెళ్ళి మంచి నీళ్ళు తేపో.."అన్నాడు నరసింహ.

*****

మధు వెళ్లిన కాసేపటికేచాలా లోటు గా అనిపించింది విక్రమ్ కి, పిల్లలకి.

ఇక రాత్రి ఐతే కథ చెప్పమని విసిగించి, "నువ్వు చెప్పే కథలేం బాలేవు.. చెత్తగా ఉన్నాయి. మమ్మీ మంచి మంచి కథలు చెప్పింది.. అర్జెంట్ గా మమ్మీ నీ రమ్మను.." అని కేకలేసింది ఆద్య.

ఎలాగోలా కిందా మీదా పడి వాళ్ళని నిద్రపుచ్చేసరికి చుక్కలు కనిపించాయి విక్రమ్ కి..

మధుకి కూడా అక్కడ అసలు ఉండాలనిపించలేదు. మాటిమాటికీ ఆ ఇల్లు, విక్రమ్, పిల్లలు, బామ్మ గుర్తొస్తున్నారు.

రెండు రోజుల తర్వాత విక్రమ్ నుండి ఫోన్ రావడంతో అల్లుడు గారేనా అని ఆసక్తి గా అడుగుతున్న రేణుక కి కాదు ఫ్రెండ్ అని చెప్పి,సైలెంట్ గా మేడ పైకి ఎక్కింది..

"చెప్పండి సర్.."

"మధు.. ఎలా ఉన్నావ్?"

"నేనెలా ఉంటే ఈయనకేంటో.. ఇంట్లోంచి తరిమేసాక.. అనుకుని, బానేవున్నాను.. మీరు, బామ్మ, పిల్లలు ఎలా ఉన్నారు?" అంది.

"అందరం బాగున్నాం.. నేనొక విషయం చెప్దామని ఫోన్ చేశాను."

"చెప్పండి ఊరికే చేయరు గా మహానుభావులు.." అంది.

"అదే మధు.. మన అగ్రిమెంట్ నీ లాయర్ కి చూపించాను.అంతా పెర్ఫెక్ట్ గా ఉంది.. కాబట్టి అస్సలు ప్రాబ్లం లేదని, ఈ పెళ్లి పెళ్లే కాదు కాబట్టీ విడాకుల కోసం కోర్టు కి వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు.."

"ఓహ్ ఇంకేం.. చాలా సంతోషం సర్.."

"అవును మధు కోర్టు చుట్టూ తిరగాలేమో అని భయమేసింది.ఇక మన ఇంట్లోవాళ్ళకి ఎలాగోలా నచ్చచెప్తే సరిపోతుంది మధు. నువ్వు మీ ఇంట్లో ఎలా చెప్తామనుకుంటున్నావు?"

"అదే అర్థం కావట్లేదు సర్.. అమ్మ ఊరికే అడుగుతోంది ఏమైందన ఎలా చెప్పాలో అర్థం కావట్లేదు.."

"అందుకే ఒక ఐడియా ఇద్దామని ఫోన్ చేశాను.."

"అవునా ఏంటది చెప్పండి?"

"నేను మంచివాడిని కాదని, సైకో అని.. ఆడవాళ్ళతో ఎఫైర్ లు ఉన్నాయని చెప్పు.. అన్నాడు ఉత్సాహం గా.. అపుడు దెబ్బకి నిన్ను ఏం అనకుండా పువ్వుల్లో పెట్టి చూసుకుంటారు."

"చాలా బాగా చెప్పారు సర్.. మరి మీరు కూడా నా గురించి ఇలాగే చెప్తారా సర్.. చాలా మంది మగవాళ్ళతో తిరిగే బజారు ది అని.."

"మధు.." కంఠం తెగిపోతుంది అన్నంత గట్టిగా అరిచాడు..

"ఏమైంది సర్ ఎందుకు అంత కోపం?"

"నీ గురించి అలా అంటావేంటి పిచ్చా.. ఇలా మాట్లాడితే అస్సలు బాగోదు చెప్తున్నా.."

"మరి మీ గురించి అంటే బాగుంటుందా నాకు."

"అది కాదు నేనంటే పెళ్లి పెటాకుల జోలికి పోను కాబట్టి నా గురించి ఏం చెప్పినా ఏం కాదు కానీ నువ్వు అలా కాదు కదా.."

"మీ గురించి చెడు గా వినడమే నాకు నచ్చదు అలాంటిది నన్నే చెడుగా చెప్పమంటే నాకెలా ఉంటుంది మరి.."

"అది కాదు పిచ్చి.. మరి ఏమని చెప్తావు ఇంట్లో.."

"ఏదో వొకటి చెప్తాను లెండి.."

"సారీ నిన్ను చాలా ఇబ్బంది పెడ్తున్నాను అన్నాడు విక్రమ్."

"నేను నా అవసరం కోసమే ఒప్పుకున్నాను కదా సర్.. మీరేమి బలవంతం గా నాతో ఒప్పించలేదు గా.. ఏం పర్లేదు వదిలేయండి.." అంది.

"ఆ.. అన్నట్లు యూ ఎస్ లో నీ స్టడీ కోసం, డాడీ కి చెప్పాను.. మంచి కాలేజ్ లో సీట్ కోసం ట్రై చేయమన్నాను.."

"రేపటివరకు డీటైల్స్ అన్ని చెప్తాడు. నీ క్వాలిఫికేషన్ కి సంబందించిన సర్టిఫికెట్ ఫొటోస్ పంపు.." అన్నాడు.

అలాగే అంటూ.. "సర్ మీకేవరైనా శత్రువులు ఉన్నారా.. మీ పరువు తీయాలని మిమ్మల్ని బాధ పెట్టాలని చూస్తున్నారు ఎవరో.." అంది.

"ఎందుకు మధు.."

"మొన్న బామ్మకీ హార్ట్ ఎటాక్ రావడానికి కారణమేంటో తెలుసా.. ఆ రోజు నాకు ఎవరో పంపిన మీ ఫొటోస్ మీడియా కి ఇచ్చారు.. అవి టీవీ లో చూసి బామ్మ చాలా టెన్షన్ పడింది."

"అవునా?"అన్నాడు విక్రమ్ షాకింగ్ గా..

"సర్ నాకెందుకో మీ సెక్రెటరీ మీదే డౌట్ వస్తుంది.. మంచిదేనా ఆ అమ్మాయి?" అంది మధు.

"ఆ మంచిదే అమాయకురాలు.. పాపం"

"ఓకే సర్ జాగ్రత్త గా ఉండండి అందర్నీ గుడ్డిగా నమ్మకండి.. అలాగే అతిగా తాగకండి.." అంటూ చెప్పింది మదు.

*****

"అమ్మా.. నాన్నా.. నాకు యూ ఎస్ వెళ్లి చదువుకోవాలని ఉందని మీకు తెల్సు కదా.. దానికోసం సర్ అన్ని ఏర్పాట్లు చేశారు.. నేను ఇటునుంచి ఇటే యు ఎస్ వెళ్తున్నాను.." అంది మధు

"అదేంటి సడెన్ గా.. నువ్వు అలా వెళ్తే ఇంట్లో వాళ్ళు ఇబ్బంది పడతారు కదా.. "అంది మధు వల్ల అమ్మ.

"ఆ మాత్రం తెలియకుండానే సర్ పంపిస్తారా . అవన్నీ వాళ్ళకి తెల్సులే అమ్మ.. నా గోల్ నేను రీచ్ అవ్వబోతున్నాను సంతోష పడాలి మీరు.. నాకు కంగ్రాట్స్ చెప్పాలి.."అంది..

ఇద్దరు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు ఏం అర్ధం కాక..

*****

"మధు.. నువ్వు యు ఎస్ వస్తున్నావంట కదా.. చాలా హ్యాపీ గా ఉంది తల్లి.."

"మామయ్య అన్ని తెలుసుకున్నారు.. నీ మార్క్స్ పర్సంటేజ్ కూడా బాగుంది కాబట్టి మంచి కాలేజ్ లో సీట్ వచ్చే అవకాశం ఉందట.. నిన్ను ఎంత తొందర గా వీలైతే అంత తొందర రమ్మన్నారు.. కాలేజీ లు కూడా ఇంకో వారం లో ఓపెన్ అవుతున్నాయని, నువ్వు ఒకసారి వచ్చి చూసి ఏ కాలేజ్ నచ్చింది చెప్తే అందులో అడ్మిషన్ తీసుకుంటారట.." అంది రోజీ మధు కి ఫోన్ చేసి..

ఆమె గొంతులో తను వస్తున్నందుకు పట్టరానిఆనందం వినిపించి

"నాకు అంత అర్హత ఉందా అసలు?" అనుకుంది..

విక్రమ్ కి ఫోన్ చేసి.. విషయం చెప్పి "నేను రేపే బయల్దేరి వెళ్తా.. అమ్మ వాళ్ళు అడిగే ప్రశ్నలకి సమాధానాలు చెప్పలేకపోతున్నా.. కానీ నేను యు ఎస్ లో మీ పేరెంట్స్ దగ్గర మాత్రం ఉండలేను. వీలైతే కాలేజ్ కి దగ్గర ఎదైనా ఆకామడేషన్ చూడమనండి ప్లీజ్.." అంది.

"సరే మధు. నేనే రేపు ఫ్లైట్ ఎక్కిస్తాను.."అన్నాడు..

*****

బ్యాగ్ లో లగేజ్ అంతా సర్దుకుని, అయిష్టం గా అయోమయం గా చూస్తున్న తన పేరెంట్స్ నీ చూసి, నవ్వి, "ఎందుకు ఇలా అయిపోయారు మీరు? నేను బాగుంటాను నా ఫ్యూచర్ బాగుంటుంది అర్థం చేసుకోండి.." అని చెప్పి విక్రమ్ చెప్పిన ప్లేస్ కి ఆటో లో బయల్దేరింది..

మధుని కార్లో ఎక్కించుకొని ఎయిర్ పోర్ట్ కి తీసుకెళ్లాడు విక్రమ్.

ఎయిర్పోర్ట్ వచ్చాక మధు దిగబోతుంటే ఒక్క నిమిషం మధు.. అని ఆపి కొన్ని పేపర్స్ చేతిలో పెట్టి, "మనం ఆరు నెలల కింద చేసుకున్న అగ్రిమెంట్. రెండు సంవత్సరాలు అని రాసుకున్న మన అగ్రిమెంట్ ఆరు నెలలకే రద్దు చేసుకున్నామని నేను సంతకం పెట్టాను నువ్వు కూడా సంతకం పెడితే ఇక్కడితో మన అగ్రిమెంట్ పూర్తవుతుంది.. ఇక నీ దారి నీది నా దారి నాది.." అన్నాడు.

మధు విక్రమ్ వైపు కాసేపు చూసి సంతకం పెట్టి సైలెంట్ గా అతని చేతిలో పేపర్స్ పెట్టింది.

"నిన్నొక్కదాన్నే యూఎస్ కి మొదటిసారి పంపించలేక నా ఫ్రెండ్ శ్రావణ్ కూడా అక్కడ కి వెళ్లే పని ఉండడంతో వాడితో పంపిస్తున్నాను. నీకు తెలుసు వాడు.. మన పెళ్లికి కూడా వచ్చాడు" అంటూ చెప్పి.

హాయ్ రా అంటూ వచ్చిన శ్రావణ్ కి హాయ్ చెప్పి, "శ్రావణ్.. మధుని జాగ్రత్తగా మా ఇంట్లో దింపి వెళ్ళు.. డాడీకి అప్పగించు.." అని చెప్పి, "ఇంటికి వెళ్ళగానే ఒకసారి ఫోన్ చెయ్ మధు.." అని చెప్పి వెళ్లిపోయాడు.

*****

ఫ్లైట్లో తన పక్కనే కూర్చున్న శ్రవణ్, "మధు నీకు నా గురించి ఏం తెలియదు కానీ నాకు నీ గురించి అంతా తెలుసు."

"అంతా అంటే ఏం తెలుసు?"అంది ఆశ్చర్యంగా.

"నీ గురించి ఏం తెలుసో చెప్పేముందు నా గురించి కాస్త నీకు చెప్తాను.. నేను శ్రావణ్.. విక్రం బెస్ట్ ఫ్రెండ్ ని మాత్రమే కాదు.. వాడి మొదటి భార్య ప్రియా కి అన్నయ్యని.. అదేంటి ప్రియా అనాధ కదా అనుకుంటున్నావు కదూ.. అవును తను అనాధ.. కానీ విక్రమ్ పరిచయమైన తర్వాత ఆమె

నాకు చెల్లమ్మ అయింది. ఆ విధంగా తను నా సొంత చెల్లిగా నేను ఫిక్స్ అయ్యాను. తను కూడా అంతే.. నేను తన అన్నయ్యను అనే ఫిక్స్ అయింది.. ఆ విధంగా మేము ఇద్దరం దేవుడు కలిపిన అన్నా చెల్లెళ్లు అయ్యాం.

ప్రియ అంటే విక్రమ్ కే కాదు నాకు కూడా నా చెల్లెమ్మ అంటే ప్రాణం.. నిన్ను వాడు పెళ్లి చేసుకుంటున్నపుడు నీలో నాకు ప్రియనే కనిపించింది. అందుకే నువ్వు కూడా నాకు బాగా నచ్చావ్. నువ్వు అన్నయ్య అని పిలవచ్చు నన్ను."

"తప్పకుండా థాంక్యూ అన్నయ్య.." అంది నవ్వుతూ..

"ఇప్పుడు నీ గురించి నాకేం తెలుసో చెప్తాను విను."

"మీరిద్దరూ చాలా సీక్రెట్ గా దాచిన విషయం అదే మీ కాంట్రాక్ట్ మ్యారేజ్ గురించి నాకు తెలుసు.." అన్నాడు నెమ్మదిగా.

పక్కలో బాంబు పడ్డట్లు అదిరి పడింది.

"ఎలా తెలుసు ?"

"మీకు ఇద్దరికీ కాకుండా ఈ విషయం తెలిసిన మూడో వ్యక్తి ఉన్నాడు కదా వాడిని బాగా తాగిన తర్వాత నాలుగు పీకితే చెప్పాడు లే..

ఎలా తెలుసు అనేది చిన్న విషయం కానీ మీరు చేసింది మాత్రం చాలా పెద్ద తప్పు.."

"సారీ అన్నయ్య.. నా పరిస్థితి అలాంటిది సార్ చెప్పిన అగ్రిమెంట్ కి ఒప్పుకుంటే మా నాన్న ప్రాణం నిలబడుతుంది. అందుకే ఇలా చేయాల్సి వచ్చింది." తప్పు చేసిన దానిలా తలదించుకొని చెప్పింది గిల్టీగా.

"సరే నీ స్వార్థం నీది వాడే అవసరం వాడిది..

కానీ ఒకే ఒక్క మాట అడుగుతాను నిజం చెప్తావా మధు.."

"తప్పకుండా చెప్తాను.ప్రియా మేడం లాగే నేను కూడా మిమ్మల్ని నా సొంత అన్నయ్య లాగా అనుకుంటున్నాను.. అడగండి.."

"నిజంగా వాడు అంటే నీకు ఇష్టం లేదా.. ఈ ఆరు నెలలు కలిసే ఉన్నావు కదా.. వాడిపై నీకు కొంచమైనా ఇష్టం కలగలేదా?"

ఐదు నిమిషాలు మౌనంగా ఉండిపోయింది మధు.

"ఖచ్చితంగా చెప్తాను అన్నా కాబట్టి మీకు చెప్తున్నాను అన్నయ్య.. విక్రమ్ సార్ అంటే నాకు ఇష్టం.. చాలా చాలా చాలా ఇష్టం.. ప్రాణం.."

"ఎప్పుడు ఎందుకు ఎలా మొదలైందో తెలియదు..

కానీ ఆయనని ఆరాధించడం మొదలు పెట్టేసాను.

నాకు అస్సలు వెళ్లాలని లేదు ఆయనకు దూరంగా.. కానీ ఆయన మనసులో నేను లేనప్పుడు ఆయన దృష్టిలో నేను ఒక అగ్రిమెంట్ ని అయినప్పుడు, అంతకుమించి నేనేం చేయలేను కదా..అందుకే వెళ్ళక తప్పట్లేదు." అంది బాధగా.

"వాడికి ఒక్కసారైనా నీ ఇష్టాన్ని చెప్పావా?"

"చెప్పలేదు మీరు కూడా చెప్పొద్దు.. చెప్పి ఆయన దృష్టిలో నేను చీప్ క్యారెక్టర్ గా మిగిలిపోలేను..

ఆయన నాకోసం చాలా ఆలోచిస్తున్నారు.. ఇప్పుడు నా ఆలోచనలు ఇంత ఇదిగా ఉంటాయని ఆయన నన్ను తప్పుగా అర్థం చేసుకుంటారు.. అది నేను తట్టుకోలేను ప్లీజ్."

మాట్లాడలేక మౌనంగా ఉండిపోయాడు శ్రావణ్..

*****

మధుని ఫ్లైట్ ఎక్కించినప్పటి నుండి తనలో తానే మధనపడుతున్నాడు విక్రమ్. ఏదో మరిచిపోయినట్లుగా, ఏదో కోల్పోయినట్లు.. ఏదో లోటు తెలుస్తోంది..

ఇంటికి వెళ్లేసరికి ఫోన్ వచ్చింది ఆఫీస్ నుండి.

సార్ ఇక్కడ అంతా గొడవ గొడవగా ఉంది.ఎవరో మహిళా సంఘాలు అంట మన ఆఫీస్ అంతా ధ్వంసం చేస్తున్నారు. శాస్త్రి సార్ ని బాగా కొట్టారు కూడా..ఒకసారి న్యూస్ ఛానల్ చూడండి.. అని

వెంటనే న్యూస్ పెట్టాడు విక్రమ్.

"మొన్ననే తన కొత్త సెక్రటరీ తో రాసలీలలు నడిపిన ప్రముఖ పారిశ్రామికవేత్త విక్రమ్ సేన్, మరో కొత్త బాగోతం బయటపడింది. అంతకు ముందు సెక్రటరీగా పనిచేసిన మధుప్రియ అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడనే విషయం అందరికీ తెలుసు. కానీ అదంతా ఉత్తుత్తి పెళ్లి.. కాంట్రాక్ట్ మ్యారేజ్ అనే కొత్త మరియు చెత్త పద్ధతి ద్వారా ఆమెను భార్యగా అద్దెకు తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ అగ్రిమెంట్ రెండు సంవత్సరాలు.." అంటూ అగ్రిమెంట్ ఫోటో కూడా చూపిస్తూ యాంకర్ గడగడా చెప్తోంది.

మధ్యలో మహిళా సంఘాల నేతలు మాట్లాడుతున్నారు.

"ఈ కాంట్రాక్ట్ మ్యారేజ్ అనేది వ్యభిచారంతో సమానం..

డబ్బులు తీసుకుని ఆ అమ్మాయి సంతకం పెట్టి అతడికి అద్దె భార్యగా వెళ్లడం.. అతడికి నచ్చినన్ని రోజులు ఆమెతో గడిపి మోజు తీరిపోగానే వెళ్లగొట్టడం ఇంతటి చెత్త వ్యవస్థని ఇలాంటి ప్రముఖులు ఆచరిస్తే వాళ్ళని

చూసి మరింతమంది అలాంటి దారిలోనే వెళ్లే అవకాశం ఉంది కాబట్టి ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలి.."

విక్రమ్ కి ఏమీ అర్థం కాలేదు అసలు.. మైండ్ అంతా బ్లాక్ అయింది.

వెంటనే శాస్త్రికి ఫోన్ చేసాడు హాస్పిటల్లో బెడ్ మీద ఉన్న శాస్త్రి ఫోన్ ఎత్తి, "సార్ తప్పు జరిగిపోయింది సార్.." అంటూ ఏడవడం మొదలుపెట్టాడు.

"ఏమైంది శాస్త్రి.. ఏం జరుగుతుంది? నీ దగ్గర ఉండాల్సిన కాంట్రాక్ట్ పేపర్స్ మీడియా కి ఎలా వెళ్లాయి?" అరిచాడు దిక్కులు పిక్కటిల్లేలా.

"అంతా పద్మ చేసింది సర్ ఆ పద్మ ఎవరో కాదు..

ఆ రీటా పంపించిన అమ్మాయి అంట.. అది ఎలా చెప్తే ఇది అలా ఆడింది కానీ మనం కనిపెట్టలేకపోయాం.. నన్ను క్షమించండి సార్.." అంటూ ఏడుస్తున్న శాస్త్రి ఫోన్ కట్ చేసి.. టీవీ ఆఫ్ చేసి తల పట్టుకుని కూర్చున్నాడు హాల్లో..

"అయితే ఇదంతా రీటా పని..

లేదంటే మహిళా సంఘాలకు,ఈ జనాలకు నా గురించి ఇంత ఇంట్రెస్ట్ ఎందుకు.. ఇదంతా కావాలని న్యూసెన్స్ చేయాలని చేస్తున్నారు."

కోపాన్ని ఫ్రస్టేషన్ ని అణుచుకోలేక, అక్కడినుండి లేచి కార్ తీసుకొని వేగంగా తన కి బాగా తెలిసిన బార్ కి వెళ్ళిపోయాడు.. ఈ కోపంలో ఫ్రస్టేషన్ చేయకూడనివి చేయకుండా ఉండాలంటే అందుకు ఇది ఒకటే మార్గం అనుకుని.. బాటిల్స్ మీద బాటిల్స్ ఖాళీ చేస్తూనే ఉన్నాడు.

"నా పరువు పోయినందుకు, ఆఫీస్ నుండి ధ్వంసం చేసినందుకు నాకు బాధగా లేదు...కాని ఇప్పటికే ఆ అమ్మాయి లైఫ్ని అతలాకుతలం చేశానని నేనే బాధపడుతుంటే, మళ్ళీ ఆమె క్యారెక్టర్ ని బ్యాడ్ చేస్తూ, అందరికీ

తెలిసేలా తన పరువు తీస్తున్నందుకు నా గుండెల్లో ఏదో తెలియని బాధ.. పశ్చాత్తాపం నామీద నాకే కోపం, అసహ్యం కలుగుతున్నాయి.

సారీ ప్రియ.. నువ్వు కాకుండా ఏ అమ్మాయి గురించి ఆలోచించలేదు.. ఎప్పుడు బాధపడలేదు కానీ మధు... తనను చూసినప్పుడల్లా నాకు నీలాగే అనిపిస్తుంది. ఎందుకిలా జరుగుతుందో నాకు తెలియదు. నాకు తెలియకుండానే చాలాసార్లు తన మీద నాకెందుకు ఇలాంటి ఇష్టం ప్రత్యేకమైన అభిమానం ఏర్పడుతుందో నాకు అర్థం కావట్లేదు.. ఆ ఇష్టాన్ని అదుపు చేసుకోవడానికే చాలా సార్లు తనని కోప్పడడం తిట్టడం చేశాను.. అయినా ఆ అమ్మాయి చాలా మంచిది.. అని తనలో తాను గొణుక్కుంటూ సారీ.. సారీ మధు.." అనుకుంటూ అలాగే పడిపోయాడు..

విక్రమ్ ఆ బార్ ఓనర్ కు చాలా క్లోజ్ కావడంతోబాయ్స్ కి చెప్పి అక్కడే ఉన్న బెడ్ రూమ్ లోకి తీసుకెళ్లి పడుకోపెట్టారు.

*****

"విక్కీ బాబు.. పడుకున్నావా?" అన్న పిలుపు వినగానే టక్కున లేచి కూర్చున్నాడు విక్రమ్..

ఎదురుగా, వైట్ సారీ లో దేవతలా తన బెడ్ పై, తన పక్కనే నవ్వుతూ కూర్చున్న తన ప్రియా కనిపించింది.

"ప్రియా.." అన్నాడు నోరు పెగుల్చుకుని..

"అవును నేనే ఏంటి విక్కీ బాబు.."

"ఏం చేస్తున్నావ్ ఇక్కడ.. ఇంటికి రావా.. పిల్లలు నీ కోసం ఏడుస్తున్నారు కదా.."

"నువ్వు లేవు కదా.." అన్నాడు.

"ఎందుకు లేను.. నీకోసమే ఇంకో రూపంలో వస్తే ప

తరిమేశావుగా నువ్వే యుఎస్ కి."

"అంటే.." అన్నాడు అయోమయంగా

"బుద్ధూ.." అంటూ తలమీద చిన్నగా మొట్టికాయలు వేసి.. "మధు.. నాకు బాగా నచ్చేసింది విక్కీ.. నా పిల్లల్ని తను నేనుంటే ఎలా చూసుకునేదాన్నో అచ్చం అలాగే చూసుకుంటుంది.. నావిక్కి బాబుని కూడా నాలాగే ప్రేమగా చూసుకుంటుంది.. కానీ తన ప్రేమను నువ్వు దూరంగా విసిరేసావ్ నాకు నచ్చలేదు విక్కీ బాబు.."

"ఏమంటున్నావ్ ప్రియా.."

"మధు ని తీసుకురా.. నీకు నా పిల్లలకి ఇప్పుడు తన అవసరం చాలా ఉంది.. లేదంటే నేను నీతో మాట్లాడను."

అంతే గబుక్కున లేచి కూర్చున్నాడు.. చుట్టూ చూస్తే ఎక్కడ ఏమీ లేదు.. గడియారం 6:00 చూపిస్తుంది ఉదయం.

ఇదంతా కలా.. నేను ఎక్కడున్నాను అసలు.. అంటూ రాత్రి జరిగిందంతా గుర్తు తెచ్చుకున్నాడు.

"తను చనిపోయినప్పటి నుండి ఇంతవరకు నాకు కలలో కనిపించని ప్రియ ఈరోజు కేవలం మధు గురించి మాట్లాడింది అంటే నా ప్రియా కి మధు అంటే ఇష్టం.

నేను మధు ని పెళ్లి చేసుకోవాలని నా ప్రియ కోరుకుంటుందా?" అనుకున్నాడు..

కానీ ప్రియా కి నేనంటే ఇష్టమో లేదో తెలియదు.. పెళ్లయి ఇద్దరు పిల్లలున్న వాడిని తను పెళ్లి చేసుకోవాలనుకుంటుందా? లేదా ప్రియా చెప్పినట్లు నిజంగానే మధుకి కూడా నేను అంటే ఇష్టమా..

తెలుసుకోవాలి.. అని వెంటనే తన ఫోన్ తీసుకొని డయల్ చేశాడు..

"శ్రావణ్ ఎక్కడున్నావు రా? తనని దింపేసావా డాడీ దగ్గర?"

"హా దింపేసాను రా.. నీ భారము దిగిపోయినట్లేనా ఇంకా? ఎందుకురా ఆ అమ్మాయిని అలా చేస్తున్నావ్.. పాపం చాలా మంచి అమ్మాయి.."

"అవున్రా చాలా మంచి అమ్మాయి అందుకే తనకు మంచి ఫ్యూచర్ ఉండాలని అక్కడికి పంపించాను.. నేనేం చేశానురా తన గురించే ఆలోచిస్తున్నాను కదా.."

"ఒరేయ్ మెంటల్ తన గురించి ఆలోచించడం అంటే తనకి ఏది ఇష్టమో అది చేయాలి.."

"అంటే తనకి యూ ఎస్ వెళ్ళడం ఇష్టం లేదా?"

"లేదు.."

"ఏం చెప్పిందిరాతను నీకు?"

"నీకు చెప్పొద్దని చెప్పింది.."

"ఏహే చెప్పు బే.. తను నాతో ఉండిపోతుందారా ఎప్పటికీ అడిగాడు ఆశగా.."

"అవును బే..తన కళ్ళల్లోకి ఒక్కసారి కళ్ళు పెట్టి చూస్తే అర్థమయ్యేది నీకు ఆ విషయం ఎప్పుడో.."

"నిజమా రా.."

"నువ్వంటే పడి చచ్చిపోతుంది ఆ పిల్ల.. నువ్వేమో దూరం దూరం పంపిస్తున్నావు.."

"ఒరేయ్ ఇపుడే బయల్దేరి వస్తున్నా.." అంటూ ఫోన్ కట్ చేసి.తన పి ఏ కి ఫోన్ చేసి యూ ఎస్ కి టికెట్ బుక్ చేయమని, తన పాస్ పోర్ట్ తీసుకుని ఎయిర్పోర్ట్ కి బయల్దేరాడు..

*****

"కాలేజ్ ఎలా ఉందిరా?" అడిగాడు కృష్ణ.

"చాలా బాగుంది అంకుల్.."

"అయితే ఇందులోనే సీట్ కోసం మేనేజ్ చేస్తాను.. నేను లోపలికి వెళ్ళి మాట్లాడి వస్తాను. నువ్వు ఇక్కడే కూర్చో." అంటూ వెళ్ళాడు లోపలికి.

చుట్టూ పచ్చని చెట్లని చూస్తూ , చల్లని గాలి ఆస్వాదిస్తూ కూర్చున్న మధు ముందుకి వచ్చి నిల్చున్నాడు విక్రమ్.

సడెన్గా కళ్ళ ముందు కనిపించిన విక్కి ని చూసి నోరు తెరిచి అలాగే చూస్తున్న మధు తో ఈగలు పోతాయి జాగ్రత్త అని, "నీ పేరు మధుప్రియ కదా..!" అన్నాడు

"ఆ..!?" అంది అయోమయం గా.

"అందరూ మధు అని పిలుస్తారు కదా.. కానీ నేను ప్రియ అని పిలవొచ్చా?" అన్నాడు నవ్వుతూ..

సగం అర్థమై సగం కాకుండా తల అడ్డంగా నిలువుగా గా ఊపుతున్న మదుచేయి పట్టుకుని, "ఈసారి 2 ఇయర్స్ కాదు గానీజీవితాంతం నాతో

ఉండటానికి మా ఇంటికి,నాకు పర్మనెంట్ పెళ్ళాం గా వస్తావా?" అన్నాడు కన్ను గీటి.

అప్పుడు అర్థమయి సిగ్గుతో తల దించుకుని వస్తా.. అన్నట్లు గా తల ఊపింది.

సంబరం గా మధు నీ తీసుకుని వెళ్ళాడు విక్రమ్..

సీట్ మధు కి వచ్చేలా చాలా కష్టపడి, పట్టరాని సంబరం తో, గర్వం గా ఈ విషయం మధుకి చెప్దామని వచ్చిన విక్రమ్ తండ్రి అక్కడ మధు లేకపోవడం చూసి షాక్ అయ్యాడు..

*****

సారీ మధు.. నిజంగా నిన్ను చాలా బాధపెట్టి ఉంటాను కదా నా పిచ్చి చేష్టలతో, ఎప్పుడూ అనవసరంగా నిన్ను కోప్పడుతూ.. అన్నాడు విక్రమ్.

పోనీలెండి ఇప్పటికైనా తెలుసుకున్నారు కదా.. సంతోషం.. అంది బుంగమూతి పెట్టుకుని.

సారీ ఎందుకు మన మధ్యలో అంటావేమో అనుకున్నాను.. అన్నాడు దీనంగా ఆమె వైపు చూస్తూ ..

అతని మొహం చూడగానే చాలా జాలిగా అనిపించింది ఆమెకి.

అంతే ఎప్పుడు మీవైపే ఆలోచించాలి గానీ నావైపు ఆలోచించరు కదా.. నాకు మీరు అంటే ఎంత ఇష్టమో ఒక్కసారైనా గమనించారా మీరు? ఇప్పుడు కూడా మీ ఫ్రెండ్ చెప్పాడు కాబట్టి వచ్చారు లేదంటే నన్ను ఇక్కడే వదిలేసి, ఎంచక్కా ఉండేవారు కదా ఇండియాలోనే..

నిజమే ఒక ఆడపిల్ల మనసు అర్థం చేసుకోవడంలో నేను ఎప్పుడు వెనుకబడే ఉన్నానేమో అన్నాడు డల్ గా ఏదో ఆలోచిస్తున్నట్టుగా విక్రమ్.

అయ్యో మీరు ఎక్కడికో వెళ్ళిపోకండి.. మీ పరిస్థితి కూడా నేను అర్థం చేసుకోగలను మీ భార్య అంటే మీకు ఎంత ఇష్టమో నేను అర్థం

చేసుకున్నాను ఆమె ప్లేస్ ఇంకొకరికి ఇవ్వడం అంత ఈజీ ఏం కాదు

అంది అతని మీద చేయి వేసి ఓదారుస్తూ.

థాంక్యూ మధు.. నన్ను ప్రియ తర్వాత అంతలా అర్ధం చేసుకుని ప్రేమించేది నాకు తెలిసి నువ్వు మాత్రమే.

అందుకేనేమో బహుశా తనకి కూడా నువ్వు బాగా నచ్చావ్.. కలలో కనిపించి మరీ నిన్ను పెళ్లి చేసుకోమని చెప్పింది.

షాక్ అవుతున్నట్లు అతని వంకే చూసింది మధు..

అంటే తను చెప్పిందని వచ్చారా మీరు? అంది అదోలా మొహం పెట్టి.

తన ఫేస్ చూసి పెద్దగా నవ్వి..

మీ ఆడాళ్లకు చచ్చినోళ్ళ మీద కూడా జెలసి పోదే అన్నాడు బుగ్గలు గిల్లుతూ..

మా ఆడాళ్ళం అంతే.. మేము ప్రేమిస్తున్న మగాడి ఆలోచనలు మా చుట్టూ తప్ప ఇంకెక్కడ ఉండకూడదు అనుకుంటాం. అంది నవ్వుతూ

అచ్చం తనలానే ఆలోచిస్తున్నావ్ అనబోయి అంతలోనే ఆ మాటలు మింగేసి,

ఐ లవ్ యు మధు.. అంటూ తన చేతుల్ని ప్రేమగా ముద్దాడాడు మొదటిసారి..

ఐ లవ్ యు సో మచ్ సర్.. ఇంతవరకు నా జీవితంలో ఇంత ప్రేమని నేను ఎప్పుడు ఇవ్వలేదు.. అనుభూతి చెందలేదు అంది అతని భుజంపై గారంగా వాలిపోయి..

ఇన్నాళ్ళుగా తనలో తానే అనుభవిస్తున్న మనోవేదన ఒక్కసారి పటాపంచలై, చాలా రిలీఫ్ గా అనిపించింది మధు మనసు..

******

డాడీ తనని యూఎస్ నుండి నేనే తీసుకెళ్లిపోతున్నాను.. తనని వదిలిపెట్టి నేను ఒక్కరోజు కూడా ఉండలేను.. తన చదువేదో ఇండియాలోనే చదువుతుంది అంటూ తండ్రి కి ఫోన్ చేసి చెప్పేసాడు విక్రమ్.

వార్నీ.. ఇదేంటిరా సీట్ వచ్చాక ఇలా చేసావు అంటూ షాక్ తిన్నాడు విక్రమ్ తండ్రి.

సారీ డాడీ మీకు ట్రబుల్ ఇచ్చినందుకు.

పర్లేదు రా నువ్వు తనతో సంతోషంగా ఉన్నావో లేదో అని ఎక్కడో ఒక చిన్న అనుమానం ఉండేది ఇప్పుడు అది పూర్తిగా పోయింది.. నువ్వు తనని ఎంతలా ప్రేమిస్తున్నావో నాకు బాగా అర్థమైంది.. ఐ యాం హ్యాపీ రా.. అన్నాడు సంతోషంగా..

*******

"మమ్మీ.. డాడీ.. మాకు ఇంకో చెల్లి లేదా తమ్ముడు కావాలి.." అన్నాడు అద్విత్.

"ఇదంతా బామ్మ ట్రైనింగ్ అయి ఉంటుంది సర్.." అంది మధు మెల్లిగా విక్రమ్ చెవిలో.

"ఒక్కరు సరిపోతారా నాన్నా?" అన్నాడు విక్రమ్.

"నాకైతే చెల్లి, తమ్ముడు ఇద్దరు కావాలి డాడీ.." అంది ఆద్య.

"గుడ్.. మరి మీరు ఇక్కడ ఉంటే వాళ్ళు రారు కానీ.. మీరు ఇప్పటినుండి బామ్మ దగ్గర పడుకోండి.

బామ్మ మంచి మంచి కథలు చెప్తుంది.. మమ్మీ డాడీ నీ అస్సలు డిస్టబ్ చేయకూడదు మీరు.. అపుడే తమ్ముడు, చెల్లి వస్తారు అర్థమైందా.." అంటున్న విక్రమ్ ని చూసి సిగ్గు తో కళ్ళు మూసుకుంది మధు.

"అలాగే డాడీ.." అంటూ బుద్ధి గా తలూపి, గది నుండి బయటకు వెళ్ళి "జేజీ..మమ్మీ డాడి చెల్లిని, తమ్ముడు ని తెచ్చే పనిలో ఉంటారంట.. ఎవ్వరు డిస్టర్బ్ చేయకండీ.. అర్థమైందా?" అంటూ అరుస్తూ వెళ్తున్న ఆద్య మాటలకి విక్రమ్,మధు ఇద్దరు ఒకరినొకరు చూసుకుంటూ నవ్వుకున్నారు..

*****

శుభం..

సమాప్తం ..